www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 245 | శనివారం | 24 ఫిబ్రవరి, 2018
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00





నిదానంగా..నిర్దుష్టంగా

పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ పొరపాట్లు లేకుండా జరగాలి

- మార్చి 11నే అందరికీ అందించాలనే తొందరపాటు వద్దు
- వివరాలు నిర్దుష్టంగా ఉండేలా క్షుణ్ణంగా పరిశీలించాలి
- కొంత సమయం తీసుకున్నా ఫర్వాలేదు
- అసైన్డ్‌కు కూడా పాస్‌బుక్‌లు ఇవ్వాలి : సమీక్షలో సిఎం కెసిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : అర్హులైన పట్టాదారులతోపాటు అసైన్డ్ భూములు కలిగినవారికి కూడా కొత్త పాస్‌బుక్‌లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 11వ తేదీనే పట్టాదారు పాస్‌బుక్‌లన్నింటినీ పంపిణీ చేసి తీరాలనే తొందరలో పొరపాట్లు జరగడానికి ఆస్కారం ఇవ్వవద్దని, పాస్‌బుక్‌లో నమోదయ్యే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించడానికి కొంత సమయం తీసుకున్నా అభ్యంతరంలేదని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, సలహాదారు అనురాగ్‌శర్మ, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి రాజేశ్వరి తివారి తదితరులతో ప్రగతి భవన్‌లో శుక్రవారం సమీక్ష జరిపిన సిఎం, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్న అసైన్డ్ భూములను గుర్తించి, వాటి యాజమాన్యంపై స్పష్టత ఇవ్వాలని, వారి పేరుమీదనే పాస్‌బుక్‌లను రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. పాస్‌బుక్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, పొరపాట్లు దొర్లకుండా చూడడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని, తొందరపాటు అవసరం లేదన్నారు. 'మార్చి 11నే పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలని నిర్ణయించిన మాట నిజం. అయితే అసైన్డ్ భూముల తరువాయి 6లో

అప్రూవర్ అవుతా

- సుప్రీంకోర్టుకు 'ఓటుకు నోటు' కేసు నిందితుడు మత్తయ్య లేఖ



మన తెలంగాణ/ హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన 'ఓటుకు నోటు' కేసులో నిందితుడిగా ఉన్న జెరూసలేం మత్తయ్య అప్రూవర్‌గా మారుతానని సుప్రీంకోర్టు తరువాయి 6లో

రాజ్యసభకు సంతన్న?

మిగతా రెండు స్థానాలు బిసిలకు?

ఒకటి యాదవ్‌లకు, మరొకటి ముదిరాజ్‌లకు

3 స్థానాలూ టిఆర్‌ఎస్‌వే



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాజ్యసభ షెడ్యూలు వెలువడడంతో ఒక్కసారిగా అందరి దృష్టి అభ్యర్థులు ఎవరనే అంశంపై పడింది. తెలంగాణ రాష్ట్రం నుండి ఖాళీ అవుతున్న 3 రాజ్యసభ స్థానాలను అధికార టిఆర్‌ఎస్ పార్టీ ఏకగ్రీవంగా గెలుచుకోనుంది. అభ్యర్థులు ఎవరైనా గెలుపు లాంఛనమే. ఈ మూడు స్థానాల్లో ఒకదానికి ఇప్పటికే టిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌రావు పేరు దాదాపు ఖరారైనట్లేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో అధినేత కెసిఆర్‌కు చేదోడు వాదోడుగా ఉన్న ఆయనకు అత్యంత విశ్వాసపాత్రునిగా పేరుంది. టిఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలు ఆప్యాయంగా సంతన్నగా పిలుచుకునే సంతోష్‌రావుకు అప్పజెప్పిన పనిని చాకచక్యంగా పూర్తి చేయడంలో సమర్థుడుగా పేరొందారు. స్వరాష్ట్ర తరువాయి 6లో



జిల్లా రైతు సమితులకు సమన్వయకర్తలు

- 30 జిల్లాలకు స్వయంగా నామినేట్ చేసిన ముఖ్యమంత్రి
- సామాజికవర్గాల వారీగా ప్రాధాన్యత
- ఒక్కొక్క సమితిలోనూ 24 మంది సభ్యులు



మన తెలంగాణ/ హైదరాబాద్ : జిల్లా రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసి వాటికి సమన్వయకర్తలను (అధ్యక్షులు) రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. 30 జిల్లాలు కావడంతో వీటిని జిఒఐఆర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చకుండా ఆఫ్‌లైన్‌లో ఉత్తర్వులిచ్చినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. జిల్లా రైతు సమన్వయ సమితిలో ఒక కో–ఆర్డినేటర్‌తో కలిపి మొత్తం 24 మంది సభ్యులుంటారు. వీటిలో సభ్యులను మంత్రులు ఎంపిక చేసి, తరువాయి 6లో

కాళేశ్వరంపై పిటిషనర్‌కు మొట్టికాయలు

- ఫోరం హంటింగ్ తగదని సుప్రీం హెచ్చరిక
- పర్యావరణ పిటిషన్ కొట్టివేత
- కాంగ్రెస్ కుటిల యత్నాలకు చెంపపెట్టు: హరీశ్



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. ప్రాజెక్టు నిర్మాణంలో పర్యావరణ నిబంధనల ఉల్లంఘన జరిగిందని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను నారింగ్టన్ రోహిమన్, నవీన్ సిన్హాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కొట్టేసింది. పిటిషనర్ హయతుద్దీన్‌ను కోర్టు మందలించింది. ముంపు గ్రామాల్లో సరైన చర్యలు చేపట్టకుండా పనులు చేస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై శుక్రవారం సుప్రీం విచారణ చేపట్టింది. చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్ నుంచి ఢిల్లీ ట్రిబ్యునల్‌కి ఎందుకు తరువాయి 6లో


రాజ్యసభ ఎన్నికలు మార్చి 23న

- 16 రాష్ట్రాల్లోని 58 స్థానాలకు మార్చి 5న నోటిఫికేషన్
- తెలంగాణ, ఎపిల నుంచి మూడేసి ఖాళీల భర్తీ 3లో

నేటి నుంచి టిఆర్‌టి

3లో

- తొలి రోజు 60 కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్షలు



నిరుద్యోగ భృతి?

- బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వం యోచన

మన తెలంగాణ / హైదరాబాద్ : రానున్న బడ్జెట్‌లో నిరుద్యోగులకు ప్రతి నెలా 'భృతి' సమకూర్చే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడం గురించి ప్రభుత్వం ఆలోచిస్తూ ఉంది. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు ఒకవైపు ఉపాధి అవకాశాలను కల్పించడంపై దృష్టి పెడుతూనే.. అవి వారికి అందేంత వరకు ప్రతి నెలా భృతిని చెల్లించడంపై కసరత్తు చేసి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాల్సిందిగా ఆర్థికశాఖ అధికారులకు సిఎం సూచించినట్లు తెలిసింది. ఇటీవల బడ్జెట్‌కు సంబంధించి అధికారులతో తరువాయి 6లో



సాక్షర భారత్‌లో కుంభకోణం 7


- రూ.కోటి 13 లక్షల స్వాహా
- ఉమ్మడి మెదక్ మాజీ డిడి స్వర్ణలతపై కేసు

మెట్రో రైల్‌లో కొలువుల పేరుతో మోసం 7

జీడిమెట్లలో అగ్నిప్రమాదం

- ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలు 3





మార్చి 18 తర్వాత భవిష్యత్ కార్యాచరణ : నాగం



మన తెలంగాణ/హైదరాబాద్: తన భవిష్యత్తు కార్యాచరణ మార్చి 18 తరువాత ప్రకటిస్తానని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. ఇటీవల పత్రికల్లో కాంగ్రెస్‌లో చేరికపై వచ్చిన వార్తలపై 'మన తెలంగాణ' ఆయనను సంప్రదించగా, పై వ్యాఖ్యలు చేశారు. మరోవైపు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ లోకి వస్తే ఆహ్వానిస్తామని ఏఐసిసి కార్యదర్శి, వనపర్తి శాసనసభ్యుడు డా. జి.చిన్నారెడ్డి అన్నారు. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలో ఆయన బలమైన నాయకుడని, రాష్ట్రస్థాయిలో కూడా ఆయన ప్రభావం ఉంటుందన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ శాసనసభ్యులు సి.హెచ్.వంశీచంద్‌రెడ్డితో కలిసి చిన్నారెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. నాగం చేరికను వ్యతిరేకించిన ఎంఎల్‌సి దామోదర్‌రెడ్డి శాసనమండలికి ఎన్నికవడానికి నాగం జనార్దన్‌రెడ్డి కూడా సహకరించారని గుర్తుచేశారు. ఇతర పార్టీల్లో నుండి ఎవరు కాంగ్రెస్‌లో చేరినా స్వాగతించాలని, ఎవరికి గెలిచే అవకాశం ఉంటే వారికి టిక్కెట్ లభిస్తుందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇతర పార్టీ నేతలు కాంగ్రెస్‌లోకి వస్తామంటే కాంగ్రెస్ లో పుట్టి పెరిగిన నేతలెవ్వరూ వ్యతిరేకించడం లేదని, కేవలం పార్టీలు మారి కాంగ్రెస్‌లో చేరిన వారే వ్యతిరేకిస్తున్నారని వంశీచంద్‌రెడ్డి అన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- ఆర్‌డిఒ హామీతో విరమణ

మన తెలంగాణ/కోదాడ క్రైం: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ ప్రభుత్వ ఆస్పత్రలో వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం కట్టకొమ్ముగూడెం గ్రామానికి చెందిన భాస్కర వనజ (26)ను భర్త రవి కాన్పు కోసం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చాడు. విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షలు నిర్వహించి, ప్రసూతి నిమిత్తం అడ్మిట్ కావాలని చెప్పడంతో బాధితులు పేరు నమోదు చేయించుకున్నారు. అపరేషన్ సమయానికి వైద్యుడు రాకపోవడం, నర్సులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కడుపులో ఉన్న శిశువు మృతి చెందినట్లు బంధువులు తాతయ్య, నాయనమ్మ తెలిపారు. దీనిపై స్థానిక ఎంఎల్‌ఎ పద్మావతిరెడ్డికి తెలపగా, ఆమె వెంటనే డాక్టర్‌కి ఫోన్‌చేసి ఆసుపత్రికి రావాలని తెలపడంతో వైద్యుడు వచ్చి అపరేషన్ చేయగా, శిశువు మృతి చెందినట్లు నిర్ధారించాడు. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలంటూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ భిక్షునాయక్ బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఇదిలాఉంటే వైద్యుడు మాట్లాడుతూ తల్లికి ఉమ్మనీరు పూర్తిగా పడిపోవడంతో అపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని తెలపగా, బాధితులు అపరేషన్‌కు అడ్మిట్ అయ్యారని, తనకు ప్రసూతి సమయంలో సూర్యాపేటలో మీటింగ్ ఉన్నందున రాలేకపోయానని వివరణ ఇచ్చాడు.

సిండికేట్ బ్యాంక్
ప్రాంతీయ కార్యాలయం-1 : 6-3-915, HMWS & SB బిల్డింగ్, వెస్ట్ బ్లాక్, 2వ అంతస్తు, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004. టెలిఫోన్: 040-23311943 ap.3053hydro@syndicatebank.co.in
రికవరీస్ సెక్షన్
Ref.No. 578/PN/3053/ROCH/1846/2017-18 Date:23.02.2018
స్వాధీనతా ప్రకటన
(యాక్ట్-రూలు-8(1) క్రింద అనుబంధము-IV)*
[illegible]

సిండికేట్ బ్యాంక్
ప్రాంతీయ కార్యాలయం-1 : 6-3-915, HMWS & SB బిల్డింగ్, వెస్ట్ బ్లాక్, 2వ అంతస్తు, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004. టెలిఫోన్: 040-23311943 ap.3053hydro@syndicatebank.co.in
రికవరీస్ సెక్షన్
Ref.No. 578/PN/3053/ROCH/1859/2017-18 Date:20.02.2018
స్వాధీనతా ప్రకటన
(యాక్ట్-రూలు-8(1) క్రింద అనుబంధము-IV)*
[illegible]

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
ఇ-వేలం ద్వారా స్థిరాస్తుల అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన
[illegible]

సిండికేట్ బ్యాంక్
ఆర్‌పి రోడ్ బ్రాంచ్, 8-1-384, 385 & 468, ఆర్‌పి రోడ్, సికింద్రాబాద్-500003.
Ref.No. RPR/3018/ADV/2018 Date:22.02.2018
స్వాధీనతా ప్రకటన
[illegible]

IDBI BANK
రిటైల్ అస్సెట్స్ సెంటర్ గవర్నర్‌పేట్, విజయవాడ.
సంప్రదించవలసిన ఫోన్ నెం.లు: 040-66746099/88, 0866-6644703
ఇ-వేలం ద్వారా స్థిరాస్తుల అమ్మకం బహిరంగ ప్రకటన
[illegible]
ప్రదేశం: హైదరాబాద్, తేదీ: 24 ఫిబ్రవరి, 2018


ప్రైవేట్‌లో ప్రభుత్వ పుస్తకాల అమలు లేనట్లే!

- ప్రైమరీ తరగతులకు రూ. వేలల్లో వెచ్చించాల్సిన పరిస్థితి

మన తెలంగాణ/హైదరాబాద్: రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రైవేట్ పాఠశాలల్లోనూ ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలనే ఉపయోగించే నూతన విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా ఆచరణలో మాత్రం ఆ దిశగా ప్రయత్నాలు ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటివరకు ఈ అంశానికి సంబంధించి ప్రైవేటు విద్యా సంస్థలతో సంప్రదింపులు జరపడంగానీ, సర్క్యులర్‌ను జారీ చేయడంగానీ, అవసరం మేరకు ఎక్కువ సంఖ్యలో పుస్తకాలను ముద్రించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంగానీ జరగలేదు. ప్రభుత్వం సైతం ఇప్పటివరకు ఉత్తర్వులను జారీ చేయలేదు. ఈ కారణంగా రానున్న విద్యా సంవత్సరంలో కూడా ప్రైవేట్ స్కూళ్లలో ప్రైవేట్ ప్రచురణకర్తలు ముద్రించిన పుస్తకాలనే యాజమాన్యాలు ఉపయోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర సిలబస్‌తో నడిచే ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల అవసరానికి అనుగుణంగా ప్రభుత్వం ఒక మేరకు అదనపు సంఖ్యలో పుస్తకాలను ముద్రిస్తున్నప్పటికీ ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం ప్రైవేట్ ప్రచురణకర్తలు ముద్రించిన పుస్తకాలనే ఎక్కువగా విద్యార్థులు ఉపయోగిస్తున్నారు. ప్రైవేటు పుస్తకాలు కావడంతో తల్లిదండ్రులు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రీ ప్రైమరీ, ఒకటవ తరగతి పుస్తకాలకు కూడా రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు తల్లిదండ్రులు ఖర్చు పెడుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో కచ్చితంగా యాజమాన్యాలు చెప్పిన పుస్తకాలనే తల్లిదండ్రులు తీసుకోవాల్సి వస్తోంది. స్కూళ్ల యాజమాన్యాలు ప్రైవేట్ ప్రచుకరణకర్తలతో ఒప్పందాలు కుదుర్చుకుని ప్రీప్రైమరీ పుస్తకాలకు కూడా రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పుస్తకాలలో విద్యార్థులకు శాస్త్రీయమైన విద్య అందే అవకాశం ఉంటుంది. విద్యావేత్తలు, సబ్జెక్టు నిపుణులు రూపొందించిన సిలబస్ ఆధారంగా ప్రభుత్వ పుస్తకాలు ముద్రిస్తారు. ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలను ఉపయోగించడం వల్ల తల్లిదండ్రులు పాఠ్యపుస్తకాలపై వెచ్చించే ఖర్చు కూడా చాలా వరకు తగ్గుతుంది.

కదులుతున్న బినామీల డొంక

- పురుషోత్తమరెడ్డిని కస్టడీలోకి తీసుకున్న ఎసిబి



మన తెలంగాణ/హైదరాబాద్: ఆదాయానికి మించిన కేసులో నిందితుడైన హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి ఆస్తుల డొంక కదులుతోంది. నాంపల్లి ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న పురుషోత్తమరెడ్డిని ఎసిబి అధికారులు శుక్రవారం కస్టడీలోకి తీసుకున్నారు. ఎసిబి ప్రధాన కార్యాలయంలో అతన్ని ఉన్నతాధికారులు విచారిస్తున్నారు. తొలిరోజు విచారణలోనే బినామీ పేర్లపై ఉన్న ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయనే విషయం పై సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. ఏడేళ్ల క్రితం ఎసిబి అధికారు లకు పట్టుబడినప్పుడు ఆస్తులను తన పేరుపై కాకుండా బినామీల పేర్లపై కూడబెట్టిన విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న పోలీసులు తాజాగా పట్టుబడినప్పుడు ఇంట్లో కేవలం రూ.5 కోట్ల ఆస్తులే లభ్యం కావడంపై ఆరా తీసినట్లు తెలిసింది. మరికొందరి బినామీల పేర్లను బయటికి లాగినట్లు తెలిసింది. మొదటి గంటపాటు ఎసిబి అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు పురుషోత్తమరెడ్డి నోరు విప్పకపోయినా బినామీల పేర్లపై ఉన్న భవనాలు, భూములు, బంగారం, వజ్రాలకు సంబంధించిన రసీదులు చూపించడంతో కొన్ని విషయాలను వెల్లడించినట్లు పోలీసుల ద్వారా తెలిసింది. ఈ విచారణ సందర్భంగా మరో రూ. 30 కోట్ల విలువైన ఆస్తులను ఎసిబి అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురు బినామీలను అరెస్టు చేసిన ఎసిబి అధికారులు మరికొందరు బినామీలను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మరో ఐదు రోజుల పాటు విచారణ కొనసాగనుంది.

సిపిఎస్ రద్దుకు వినతి

- ఈ నెల 25న హైదరాబాద్‌లో సకల ఉద్యోగుల మహాసభ
- జెఎసి చైర్మన్ రవీందర్ రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్)ను రద్దు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ జెఎసి చైర్మన్ రవీందర్ రెడ్డి విజ్ఞప్తిచేశారు. బుధవారం జెఎసి సభ్యులతో కలిసి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిపిఎస్ విధానంతో పాటు చాలా సమస్యలు ఉన్నాయని వాటిని పరిశీలించి పరిష్కరించాలని సిఎస్‌ను కోరినట్లు తెలిపారు. వీటిపై చర్చించడానికి ఈ నెల 25న హైదరాబాద్‌లో సకల ఉద్యోగుల మహాసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే ఈ సభకు రాష్ట్రంలోని 2.65లక్షల మంది ఉద్యోగులు, 2.40లక్షల మంది పెన్షనర్లు పాల్గొంటున్నారని తెలిపారు. సిపిఎస్ రద్దు కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. కేంద్రం తెచ్చిన ఈ చట్టంతో తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. 27 రాష్ట్రాల ఉద్యోగులు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. కొత్తగా జిల్లాల్లో సిబ్బంది కొరతతో అక్కడి ఉద్యోగులపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. స్టాఫ్ పాటర్న్ మార్చాలని, ఎన్నికలకు ముందే ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని సిఎస్‌ను కోరామని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఉద్యోగుల కేటాయింపులు సక్రమంగా జరగలేదని, ఏపికి కేటాయించిన తెలంగాణ ఉద్యోగులను వెంటనే రప్పించాలని ఆయన కోరారు. సిపిఎస్ ఉద్యోగులకు గ్రాట్యూటి, పెన్షన్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని వెంటనే వీటిని మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల వేతనాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. కొత్త జిల్లాలకు ఉద్యోగులను సర్దుబాటు చేసి ఆర్డర్ టు సర్వ్‌ను ఆరు నెలల్లో రద్దు చేస్తామని చెప్పి ఏడాదిన్నరైనా చేయలేదని, వెంటనే చేయాలని ఆయన కోరారు.

నా కొడుకును రప్పించండి సారూ..!

- చేయని నేరానికి కువైట్‌లో జైలు జీవితం
- ఆదుకోవాలని కుటుంబసభ్యుల వేడుకోలు



రాహుల్ తల్లి, భార్య, కొడుకు

మన తెలంగాణ/ రాయికల్: సాగు భారమై అప్పు చేసి ఉపాధిని వెతుక్కుంటూ కువైట్ వెళ్లిన ఓ యువకుడు చేయని నేరానికి జైలు జీవితం గడుపుతు న్నాడు. ఇటీవల కువైట్ ప్రభుత్వం క్షమాభిక్ష గడువును ఈ నెల 22తో గడువు ముగియడంతో జైల్లో ఉన్న తన బిడ్డను స్వదేశానికి రప్పించాలని కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపెల్లి గ్రామానికి చెందిన రాహుల్ ఐదేళ్ల కింద కువైట్‌కు వెళ్లి అక్కడి సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. ఏడాది క్రి తం స్నేహితులతో కలిసి రూంలో ఉన్న రాహుల్‌ని మద్యం అమ్ముతున్నాడనే కారణంతో అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. అక్కడే మరో కంపెనీలో పని చేస్తున్న తండ్రి రాహుల్‌ను విడిపించేందుకు ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వం ఇటీవల ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించినా, దాని గడువు గురువారంతో ముగిసింది. దీంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు తన కొడుకును తిరిగి దేశానికి రప్పించాలని రాహుల్ తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరవుతోంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా
చంచల్‌గూడ బ్రాంచ్, సుబేదార్ అమీర్ అలి ఖాన్ రోడ్, కలాడేరా, చంచల్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ- 500024
స్వాధీనతా ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1))
[illegible]
తేదీ : 23.02.2018, ప్రదేశం : హైదరాబాద్

బ్యాంక్ ఆఫ్ ఇండియా
కాచిగూడ బ్రాంచ్
స్వాధీనతా ప్రకటన
[illegible]
తేదీ: 23.02.2018



సింగరేణి కార్మికులకు వడ్డీలేని ఇంటి రుణాలు

మన తెలంగాణ/హైదరాబాద్: సింగరేణి కార్మికుల సొంత ఇళ్ల నిర్మాణానికి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జరిగిన బోర్డు డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం జరిగింది. సిఎండి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన నిర్ణయానికి అధికారిక ఆమోదం తెలిపింది. కొత్త రుణాలతో పాటు ఇప్పటికే వాయిదాలు చెల్లిస్తున్న వారికి కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపజేస్తారు. కార్మికుల నుంచి బ్యాంకులు వసూలు చేసిన వడ్డీని కంపెనీ తిరిగి కార్మికుని ఖాతాలో జమ చేస్తుంది. గరిష్టంగా రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తారు. దీంతో రూ.130 కోట్ల వరకు సంస్థ అదనంగా వెచ్చించాలని సింగరేణి ఆర్థిక విభాగం అధికారులు అంచనా వేశారు. ఈ సమావేశంలో బొగ్గు మంత్రిత్వ శాఖ డైరెక్టర్లు జెఎస్ బింద్రా, సయీద్ అస్రఫ్, రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, సింగరేణి డైరెక్టర్లు జె.పవిత్రన్ కుమార్, బి.భాస్కర్‌రావు, ఎస్.చంద్రశేఖర్, ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి సంస్థకు సంబంధించి ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని సంస్థ సమాచార విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం

- ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలు
- పెద్దమొత్తంలో ఆస్తి నష్టం

మన తెలంగాణ/హైదరాబాద్/షాపూర్‌నగర్: జీడిమెట్ల పారిశ్రామికవాడ గంపలబస్తీలోని సూటిక్ ఫార్మా పరిశ్రమలో శుక్రవారం తెల్లవారు జామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే గురువారం రాత్రి విధులకు వచ్చిన 24మంది నైట్ షిఫ్ట్ కార్మికులు శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో విధులు ముగించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే పక్కనే ఉన్న పరిశ్రమ గోదాంకు రసాయన ట్యాంకర్ వచ్చింది. దీంతో కొంతమంది కార్మికులు (గ్రిగ్‌నాట్ రియాక్టర్ వద్ద) ట్యాంకర్‌ను అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దట్టమైన పొగతో పరిశ్రమ మొత్తం మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఏడుగురు కార్మికులు బి.శ్రీనివాస్, కుమారస్వామి, సింహాచలం, సంజీత్, హర్విన్, నరహరి, శ్యాం తీవ్రగాయాలతో పరిశ్రమలో మంటల్లో చిక్కుకున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జీడిమెట్ల సిఐ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం స్థానికుల సహాయంతో క్షతగాత్రులను బయటకు తీసుకువచ్చిన సిఐ శంకర్‌రెడ్డి, పోలీసు బృందం మిగితా కార్మికులకు ప్రాణ నష్టం జరగకుండా కాపాడారు. వెంటనే వీరిని పేట బషీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఎంవిరెడ్డి, కుత్బుల్లాపూర్ ఎంఎల్‌ఎ వివేకానంద్ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంటల ధాటికి చుట్టపక్కల పరిశ్రమ అద్దాలు, పై కప్పులు ధ్వంసమయ్యాయి. అలాగే పక్కనే ఉన్న ఓ కెమికల్ పరిశ్రమకు మంటలు అంటుకోవడంతో కొంత ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఆలస్యంగా 108 : సంఘటన స్థలానికి దాదాపు గంట ఆలస్యంగా 108 రావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షతగాత్రులను పోలీసులు బయటకు తీసుకొచ్చినా ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్సులు అందుబాటులో లేవని మండిపడ్డారు. కాగా, ఘటన స్థలంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎనిమిది అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది శ్రమించారు.

మండిపడ్డ వామపక్షాలు : పరిశ్రమలో పనిచేసే పేద కార్మికులతో యాజమాన్యాలు ఆడుకుంటున్నాయని వామపక్షాలు, ప్రతిపక్షాల నేతలు మండిపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న కార్మిక సంఘాల నాయకులు మదన్‌గౌడ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఐలయ్య, సిపిఎం నాయకులు లక్ష్మణ్, కిషోర్‌చారి, టిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు దేవగారి రాజేందర్‌రెడ్డి యాజమాన్యంపై మండిపడ్డారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

విద్యాసంస్థల్లో బాలికలే ముందంజ

- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

మన తెలంగాణ/హైదరాబాద్: అన్ని విద్యాసంస్థల్లో బాలికలే ముందంజలో ఉంటున్నారని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం సరోజిని నాయుడు వనితా మహా విద్యాలయ వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుతం అన్ని రకాల కోర్సుల్లో అమ్మాయిల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా ఉంటోందని, గతంలో మెడికల్ కళాశాలల్లో 80శాతం అబ్బాయిలు, 20 శాతం అమ్మాయిలు ఉంటే, ఇప్పుడు అందుకు భిన్నంగా 80 శాతం అమ్మాయిలు, 20 శాతం అబ్బాయిలు ఉంటున్నారన్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో 60 శాతం అమ్మాయిలు, 40 శాతం అబ్బాయిలున్నారని తెలిపారు. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. వనితా మహా విద్యాలయ 'న్యాక్ ఎ గ్రేడ్' పొందడాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. వార్షికోత్సవంలో భాగంగా అత్యధిక మార్కులు సాధించిన బాలికలకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అందచేశారు. 7 గోల్డ్ మెడల్స్ పొందిన స్వప్న అనే విద్యార్థికి మంత్రి రూ.10 వేల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఛైర్మన్ వసంతరావు, కార్యదర్శి నరోత్తమరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విజయశ్రీ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు రైతు ప్రాంతీయ సమావేశం

- రాజేంద్రనగర్‌లో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పోచారం



మన తెలంగాణ/హైదరాబాద్: విత్తనం వేసిన దగ్గర నుంచి, పండించిన పంటను మార్కెట్ లో అమ్ముకునే వరకు రైతు సమన్వయ సమితులు రైతులకు అండగా ఉంటాయని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతు సమన్వయ సమితి సభ్యుల బాధ్యతలు, విధి విధానాలు వివరించడానికే ప్రాంతీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం గ్రౌండ్‌లో ఈ నెల 25న జరిగే ప్రాంతీయ సమావేశం ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఉదయం ప్రసంగిస్తారని, మధ్యాహ్నం భోజనం తరువాత చర్చాగోష్టి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పాల్గొనే ప్రతి సభ్యునికీ గ్రీన్, పింక్ పేపర్‌లను అందజేస్తామన్నారు. వాటిపై సభ్యులు రాసే సందేహాలకు సిఎం స్వయంగా సమాధానమిస్తారన్నారు. కరీంనగర్‌లో ఈ నెల 26న సమావేశం జరగనుందని, వీటి అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మరో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ సిఐ

మన తెలంగాణ/నిజామాబాద్ క్రైం: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి సిఐగా పనిచేస్తున్న దరావత్ కృష్ణ గురువారం రాత్రి మద్యం సేవించి తన సొంత కారు డస్టర్‌లో నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు అతివేగంతో అజాగ్రత్తగా నడుపుతున్న సదరు సిఐని గుర్తుతెలియని వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో హైవే పెట్రోలింగ్ ఇన్‌ఛార్జి రాజనర్సింలు సదాశివనగర్ పిఎస్ పరిధిలో సిఐ వాహనాన్ని పట్టుకుని సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం సదాశివనగర్ ఎస్‌ఐ నాగరాజు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా, మద్యం తాగినట్లు నిర్ధారించారు. మద్యం మోతాదు 262/100గా ఉన్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఈ విషయం తెలుసుకున్న కామారెడ్డి ఎస్‌పి శ్వేతారెడ్డి నిజామాబాద్ కమిషనర్ కార్తికేయ దృష్టికి తీసుకెళ్లగా, ధర్పలి సిఐ ధరావత్ కృష్ణకు పనిష్‌మెంట్‌గా విఆర్ అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

టిఆర్‌టి అభ్యర్థుల ఆందోళన



మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌టి దరఖాస్తుకు అవకాశం కల్పించి తమ డిగ్రీ మార్కులు 45 శాతం కంటే తక్కువగా ఉన్నాయని హాల్‌టికెట్లు జారీ చేయలేదని ఆరోపిస్తూ శుక్రవారం టిఎస్‌పిఎస్‌సి కార్యాలయం వద్ద సుమారు 200మంది బాధిత అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగ అభ్యర్థులు డిగ్రీలో 40 మార్కులు ఉన్నా అనుమతించాలని హైకోర్టు చెప్పిందని, అయితే కేవలం పిటిషనర్లకే హాల్ టికెట్లు జారీ చేసి మిగతా వారికి హాల్‌టికెట్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. తమకు అర్హత లేకుండా దరఖాస్తులు ఎందుకు స్వీకరించారని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. తాము టెట్‌లో అర్హత సాధించి గత కొన్నేళ్లుగా టీచర్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు. టిఆర్‌టికి దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించి, ఇప్పుడు పరీక్షలు రాసేందుకు హాల్‌టికెట్లు జారీ చేయడం లేదని ఆరోపించారు.

హరిత ఘోరంపై సిఎం ఆగ్రహం

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం వల్ల ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదని, మొక్కల సంరక్షణ పట్ల ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆటవీశాఖ ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. ప్రధానంగా పాఠశాలలు, కళాశాలలతో పాటు ఇతర సంస్థల ఆవరణలో నీటి వసతి ఉన్నా మొక్కలు కనుమరుగు కావడంపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాల అధికారులతో శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా ఆటవీ సంరక్షణ ప్రధాన అధికారి పికె.ఝా, సీఎంఒ ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ పై విధంగా వ్యాఖ్యానించారు. పాఠశాలల్లో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించినా మొక్కల సంరక్షణ తీరు సరిగా లేదనే విషయం సీఎం కేసీఆర్ తెప్పించుకున్న నివేదిక ద్వారా స్పష్టమైందని వారు వివరించారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత పూర్తిగా జిల్లా ఆటవీశాఖ అధికారులదేనని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కూడా వారిదేనని ఉన్నతాధికారులు వ్యాఖ్యానించారు. అన్ని జిల్లాల ఎంపిడిఒలు, ఎంఇఓలతో కలెక్టర్లు సమావేశాలను నిర్వహించి బతికిన మొక్కల సంఖ్యను తేల్చాలని సూచించారు. మొక్కల సంరక్షణకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపేందుకు త్వరలోనే అకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరుగుతుందన్నారు. రానున్న హరితహారం కోసం నర్సరీల సంసిద్ధతపై చర్చించారు.



రాష్టంలో బయోకాన్ పరిశోధనా కేంద్రం

- జీనోమ్ వ్యాలీలో ఏర్పాటుకు ముందుకొచ్చిన సంస్థ
- నోవార్టిస్, డెలాయిట్ కంపెనీలతోనూ కెటిఆర్ భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్: జీనోమ్ వ్యాలీలో బయోకాన్ నూతన ఆర్ అండ్ డి (పరిశోధనా) కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ ఎండి కిరణ్ మజుందార్ షా మంత్రి కెటిఆర్‌కు వెల్లడించారు. తమ అనుబంధ కంపెనీ అయిన 'సింజెన్' ద్వారా ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యూనిట్ ద్వారా 1000 మందికి హై స్కిల్డ్ ఉద్యోగాలు వస్తాయన్నారు. దీంతో పాటు బయోకాన్‌లోని సిబ్బంది సంఖ్యను రెట్టింపు చేస్తామన్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో అందిస్తామని ఆమె మంత్రికి తెలిపారు. బయో ఏషియా రెండో రోజు సమావేశంలో భాగంగా మంత్రి కెటిఆర్ పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. బయోకాన్, డెటాయిట్, జీఈ, మెర్క్, నోవార్టీస్ కంపెనీల ఎండీలు, సిఈవోలు, సీనియర్ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. థాయ్‌లాండ్ వాణిజ్య మంత్రి, ఇటలీ కాన్సుల్ జనరల్స్‌తోనూ కెటిఆర్ భేటీ అయ్యారు. బయోకాన్ నూతన యూనిట్ ఏర్పాటును స్వాగతించిన మంత్రి కిరణ్ మజుందార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తు విస్తరణకు తెలంగాణ ఫార్మాసిటీని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరంపైనా, మంత్రి కెటిఆర్ పైనా కిరణ్ మజుందార్ షా ప్రశంసలు కురిపించారు. హైదరాబాద్ నగరం భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత పురోగతి సాధించేందుకు ఆయా రంగాల్లోని నిపుణులు, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వాధికారులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. జిఈ సంస్థ అధ్యక్షుడు, సిఈవో టెర్రీ బ్రెసెన్హమ్‌తో కెటిఆర్ సమావేశమై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మెడ్ డివైజెస్ పార్కు (మెడికల్ ఉపకరణాల పార్కు) గురించి వివరించారు. బయో టెక్నాలజీలో వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ కంపెనీలు అందిపుచ్చుకునేందుకు ఉన్న అవకాశాలపైన మంత్రితో చర్చించారు. త్వరలో నే జీనోమ్ వ్యాలీ పర్యటనకు వస్తానని టెరీ వెల్లడించారు.


నేటి నుంచి టిఆర్‌టి

- తొలిరోజు 60 కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్షలు (టిఆర్‌టి) శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు హైదరాబాద్‌లోని హెచ్‌ఎండిఎ పరిధిలో కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లా కేంద్రాల్లో మొత్తం 60 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. శనివారం జరుగనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (సిబిఆర్‌టి) పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం కలిపి మొత్తం 34,827 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. మొదటిసారి ఆన్‌లైన్ టిఆర్‌టి పరీక్షలు నిర్వహిస్తున్నందున ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఏదైనా పరీక్షా కేంద్రంలో సమస్యలు తలెత్తితే అభ్యర్థులు వెంటనే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

మొదటి మూడు రోజుల టిఆర్‌టి షెడ్యూల్

ఫిబ్రవరి 24(సిబిఆర్‌టి) , ఉదయం : భాషా పండితులు (తెలుగు), మధ్యాహ్నం ఎస్‌జిటి (తెలుగు), స్కూల్ అసిస్టెంట్ తెలుగు, ఫిబ్రవరి 25 (ఒఎంఆర్–ఆఫ్‌లైన్ విధానం) ఉదయం ఎస్‌జిటి (తెలుగు మాధ్యమం), మధ్యాహ్నం ఎస్‌జిటి (ఇంగ్లీష్ మాధ్యమం), ఫిబ్రవరి 26(సిబిఆర్‌టి) ఉదయం ఎస్‌ఎ(ఇంగ్లీష్), మధ్యాహ్నం ఎస్‌ఎ గణితం, సాంఘిక శాస్త్రం(ఇంగ్లీష్ మీడియం)



మోడల్ ఆసుపత్రిగా గాంధీ

- సకల సదుపాయాల కల్పనకు చర్యలు
- అవయవ మార్పిడిపై ప్రత్యేక దృష్టి
- కిడ్నీ విభాగం సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో మంత్రి లక్ష్మారెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: గాంధీ ఆసుపత్రిని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం అదనపు సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి తెలిపారు. కిడ్నీల మార్పిడిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన గాంధీ ఆసుపత్రిలో కాలేయం, గుండె, లివర్ వంటి అవయవాల మార్పిడిపైనా దృష్టి పెట్టామని, ప్రసవాల విభాగాన్ని కూడా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, ఒకే దగ్గర అన్ని రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలను చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. పాతికేళ్ల కిందటనే కిడ్నీల విభాగం ఏర్పాటైందని, దేశంలో ఎక్కడ లేని విధంగా 40 సింగిల్ యూజ్డ్ డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వ ఆసుప్రతుల్లో నెలకొల్పినట్లు తెలిపారు. కిడ్నీ విభాగాధిపతి డా. మంజూష మాట్లాడుతూ వ్యాధులపై ప్రజలకు కనీస అవగాహన లేకపోవడంతో వ్యాధి తీవ్రంగా ముదిరిన తర్వాత వస్తున్నారని, ఫలితంగా నయం చేయడం కష్టతరంగా మారుతుందన్నారు. పెరిగిన సాంకేతిక ఆధునిక పరిజ్ఞానంతో మానవీయ కోణంలో రోగులను చూస్తే పరిష్కారాలు లభిస్తాయన్నారు. పాతికేళ్లుగా ఈ విభాగం సాధించిన పనితీరును వివరించే ఫొటోలతో కూడిన సావనీర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కిడ్నీ నివారణకు విశేషంగా కృషి చేసిన వారికి ప్రోత్సాహక అవార్డులను గాంధీ ఆసుప్రతి పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఇందుకోసం రూ.1.5 లక్షల మూల నిధిని మంత్రి ఆసుప్రతి సూపరింటెండెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో చెన్నై, లక్నో నుంచి వచ్చిన వైద్యులు కిడ్నీ వ్యాధులు వాటి నివారణ గురించి వివరించారు. యూనివర్శిటీ ఆఫ్ ఎడిన్‌బో లండన్ నుంచి వచ్చిన డా. నీల్ టర్నర్ మూత్రంలో సుద్ద వంటి పదార్థం పోవడానికి కారణాలతో పాటు అదుపు చేయడానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆసుప్రతి సూపరింటెండెంట్ డా. శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపల్ ప్రొ. డా.మంజుల, వివిధ దేశాల వైద్యులు పాల్గొన్నారు.



వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి దంపతులు శుక్రవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఇఒ సునీత పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్య, వల్లభ గణపతిని దర్శించుకొని, ఆ తర్వాత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

- మన తెలంగాణ/వరంగల్

రంగారెడ్డిలో టెక్స్‌టైల్ పార్కు


- భూసేకరణలో అధికార యంత్రాంగం నిమగ్నం
- ఎకరానికి రూ. 20 లక్షలు అడుగుతున్న రైతులు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టిఎస్‌ఐఐసి) రంగారెడ్డి జిల్లాలో కొత్తగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం షాబాద్ మండలంలోని చందనవెల్లి గ్రామంలో సర్వే నంబర్ 190లోని 594 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు మరో 50 ఎకరాలను ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించనుంది. భూసేకరణ బాధ్యతలను ప్రభుత్వం రెవెన్యూ, పరిశ్రమల శాఖకు అప్పగించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో భూసేకరణ కోసం రైతులతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. గత వారం రోజులుగా చందనవెల్లిలో అధికారులు రైతులతో వరుస భేటీలు జరుపుతున్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సుందర్ అబ్నార్ ఆధ్వర్యంలో టిఎస్‌ఐఐసి అధికారుల బృందం షాబాద్ మండలంలోని చందన వెల్లి, ఆ పరిసర గ్రామాల ప్రజలను కలిసింది. టెక్స్‌టైల్ పార్కు కోసం తమ భూములు సేకరించదలిస్తే ఎకరాకు రూ. 20 లక్షల పరిహారం అందించాలని రైతులు కోరారు. ప్రభుత్వం ఎకరాకు రూ. 9 లక్షలను చెల్లించాలని నిర్ణయించిందని, ఇందుకు అంగీకారం తెలిపే రైతులు తమ భూములను ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు అంగీకార పత్రాలను తమకు అందించాలని రంగారెడ్డి జిల్లా జెసి సుందర్ అబ్నార్ రైతులకు స్పష్టం చేశారు. కొత్త టెక్స్‌టైల్ పార్కు రాకతో 8 వేల మందికి ప్రత్యక్షంగానూ, మరో 4 వేల మందికి పరోక్షంగాను ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని టిఎస్‌ఐఐసి వర్గాలు పేర్కొంటున్నాయి. టెక్స్‌టైల్ పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారమిచ్చి, విద్యార్హతలను బట్టి ఈ టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలు ఇస్తామని అధికారులు తెలిపారు. భూసేకరణ ప్రక్రియను ఒకటి రెండు నెలల్లోనే పూర్తి చేసే టెక్స్‌టైల్ పార్కు పనులను ప్రారంభిస్తామని టిఎస్ ఐఐసి అధికార వర్గాలు పేర్కొన్నాయి.

మార్చి 23న రాజ్యసభ ఎన్నికలు

న్యూఢిల్లీ: ఖాళీ కానున్న 58 రాజ్యసభ స్థానాలకు పోలింగ్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం వెలువరించింది. 16 రాష్ట్రాలలో మొత్తం 58 స్థానాలకు మార్చి 23న ఎన్నికలు జరుగుతాయి. మార్చి 5న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారని ఇసి వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఎగువసభకు పోటీచేసేందుకు నామినేషన్ల ప్రక్రియ మార్చి 12న మొదలవుతుంది. 16 రాష్ట్రాలలో 58 మంది రాజ్యసభ సభ్యుల ప్రస్తుత పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో ముగియనుండటంతో ఈ స్థానాలకు ఇసి ఎన్నికలు నిర్వహించనుంది. నామినేషన్ల పరిశీలన 13 మార్చిన జరుగుతుంది. ఇక ఉపసంహరణలకు చివరి తేదీ 15 మార్చిగా ఇసి నిర్ణయించింది. 26 మార్చి వరకు ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో మూడు, ఆంధ్రప్రదేశ్‌లో మూడు స్థానాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి చిరంజీవి, రేణు కాచౌదరి, దేవేందర్ గౌడ్, తెలంగాణ నుంచి రాపోలు ఆనంద్ భాస్కర్, సిఎం రమేష్, దివంగత పాల్వాయి గోవర్ధన్ రెడ్డిల పదవీ కాలం ఏప్రిల్‌తో ముగియ నుంది. వివిధ రాష్ట్రాలలో ఖాళీలు...తెలంగాణ 3, ఆంధ్రప్రదేశ్ 3, బీహార్ 6, ఛత్తీస్‌గఢ్ 1, ఉత్తరాఖండ్ 1, పశ్చిమ బెంగాల్ 5, ఒడిశా 5, జార్ఖండ్ 2, గుజరాత్ 4, హర్యానా 1, హిమాచల్‌ప్రదేశ్ 1, కర్నాటక 4, మధ్యప్రదేశ్ 5, మహారాష్ట్ర 6, ఉత్తరప్రదేశ్ 10 స్థానాలు.

SPORTS AUTHORITY OF TELANGANA STATE
LAL BAHADUR STADIUM, HYDERABAD – 1
Phone No.040-23212818,845, Fax No.23243297
DT: 23.02.2018
E-procurement - Tender Notice
E-Tender notice no's: SATS/A1/707-2/2017 & SATS/P&P/SG/7343/2017.
Tenders invited on e-procurement platform for the services "Providing man power through outsourcing agency"&"Providing Security guards through agency", are cancelled due to technical reasons and recalled. For further details please visit www.tenders.telangana.gov.in.
Bid submission Start date : 24-02-2018 - 11:00 AM
Bid Submission closing date : 02-03-2018 - 05:00 PM.
Sd/-
VICE CHAIRMAN AND MANAGING DIRECTOR



“మానవాళి సుఖం కోసం పాటుపడే వారు నిజాలను ధైర్యంగా ఒప్పుకో గలవారై ఉండాలి. – లెనిన్”

టీచర్లకు తుపాకీ శిక్షణ!?

సంపాదకీయం

అమెరికా స్కూళ్లలో విద్యార్థులపై కాల్పుల ఘటనలను అదుపు చేసేందుకుగాను తుపాకులు పేల్చటంలో టీచర్లకు ఉత్తమ శిక్షణ!? పరిష్కారమా? ‘‘టీచర్లకు, కోచ్‌లకు మంచి శిక్షణ ఇచ్చి తుపాకులిస్తే, పోలీసులు వచ్చేలోపు సమస్య పరిష్కారమవుతుంది. గొప్ప నిరోధన.’’ ‘‘స్కూల్లో తుపాకీ పేల్చటంలో సుశిక్షితులైన టీచర్లున్నారని తెలిస్తే ఎవడూ స్కూలుపై దాడికి ఎన్నడూ ప్రయత్నించడు’’ – ఇవీ మోడీ ట్వీట్లు. అయితే ఈ సూచనను సిఎన్‌ఎన్, ఎన్‌బిసి అపహాస్యం చేయగా, అమెరికాలో అతిపెద్ద టీచర్ల సంఘం – నేషనల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్(ఎన్ఇఎ) అధ్యక్షురాలు ఎల్.ఇ.గార్సియా అధ్యక్షుడి సలహాను తోసిపుచ్చారు. ‘‘స్కూలు సిబ్బందికి ఆయుధాలివ్వాలన్న ఐడియాను తల్లిదండ్రులు, టీచర్లు ఎన్నడూ అంగీకరించబోరు. స్కూళ్లలోకి మరిన్ని తుపాకులు ప్రవేశపెట్టటం తుపాకీ హింసనుంచి విద్యార్థులను, టీచర్లను కాపాడవు’’ అనిఆమె అన్నారు. మరో పెద్దసంఘం అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ అధ్యక్షురాలు ఆర్.వీన్‌గార్టెన్ మరింత కటువుగా వ్యాఖ్యానించారు. టీచర్లకు ఆయుధాలివ్వటం ద్వారా స్కూళ్లను సైనిక కోటలుగా మార్చే ప్రయత్నాలను ‘‘ఆయుధ పోటీగా’’ పోల్చారు.

ఫ్లోరిడా రాష్ట్రంలోని పార్క్‌లాండ్‌లో మర్జోరీ స్టోన్‌మాన్ డగ్లస్ హైస్కూలుపై నికోలస్ క్రుజ్ అనే పూర్వ విద్యార్థి ఒకడు గత బుధవారం కాల్పులు జరిపి 14 మంది విద్యార్థులను, ముగ్గురు టీచర్లను హతమార్చిన ఘోరకలి అనంతరం అమెరికన్ సమాజంలో ‘తుపాకీ సంస్కృతి’పై నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ స్కూలు విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశంలో ట్రంప్ ఆ సూచన చేశారు. సెమీ ఆటోమేటిక్ తుపాకులను ఆటోమేటిక్ తుపాకులుగా మార్చే పరికరాల విక్రయాన్ని (వాటిపేరు ‘బంప్ స్టాక్స్’) నిషేధించాలన్న సూచనను ట్రంప్ అంతకుముందు బలపరిచారు. స్టీఫెన్ పెడ్డాక్ అనేవాడు 2017లో లాస్‌వెగాస్‌లో సంగీత కచ్చేరి వీక్షిస్తున్న వారిపై కాల్పులు జరిపి 58మందిని బలిగొన్న నాటినుంచీ ‘బంప్‌స్టాక్స్’పై నిషేధం విధించాలనే డిమాండ్ బలపడుతున్నది. ఆ రాక్షసుడు అటువంటి ఆయుధం ఉపయోగించాడు. వాటి నిషేధంపై డెమొక్రాట్స్, కొంతమంది రిపబ్లికన్స్, అత్యంత శక్తిమంతమైన నేషనల్ రైఫిల్ అసోసియేషన్ తుపాకీ లాబీ ఏకీభవించటం అరుదైన విషయం. తుపాకులు కొనేవారి నేపథ్యంపై గట్టి దర్యాప్తు ఉండాలని ట్రంప్ భావిస్తున్నారు.

అమెరికన్‌లను, ముఖ్యంగా స్కూలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలవరపెడుతున్న పార్క్‌లాండ్ హైస్కూలు కాల్పుల ఘటన తదుపరి ఒకవైపు విద్యార్థులు నిరసన ప్రదర్శనలు జరుపుతుండగా అధ్యక్షుడు ట్రంప్ అయోమయంలో ఉన్నట్లు విదితమవుతున్నది. రాజకీయ పార్టీలనుంచి లాంఛనమైన ఖండనలు తప్ప ‘తుపాకీ సంస్కృతి’ని అంతం చేసే అభిప్రాయాలు వెల్లడి కావటం లేదు. ఇందుకు ప్రధాన కారణం ‘తుపాకుల ఉత్పత్తి పరిశ్రమ’ లాబీ అత్యంత శక్తి కలిగి ఉండటమేకాదు, అమెరికా చరిత్ర వారికి అండగా ఉంది. అమెరికా ఖండాన్ని ఆక్రమించిన శ్వేతజాతీయులు మూలవాసులైన రెడ్ ఇండియన్‌లను ఊచకోతకోసి మారుమూల ప్రాంతాల్లోకి తరిమివేసిన నేపథ్యంలో, బానిసలుగా తెచ్చుకున్న నీగ్రోలకు స్వేచ్ఛ కల్పించిన పూర్వరంగంలో శ్వేతజాత్యాహంకార రాష్ట్రాలు తమ పౌరులు ఆత్మరక్షణ నిమిత్తం తుపాకులు కలిగి ఉండటాన్ని హక్కుగా ఇచ్చాయి. శతాబ్దాలు గడిచిపోయినా, ఎన్ని కాల్పుల ఘటనలు జరుగుతున్నా, ప్రాణాలు పోతున్నా ‘తుపాకీ సంస్కృతి’ని అంతం చేయటానికి రెండు రాజకీయ పార్టీల్లో ఏదీ ముందుకు రాదు. ఆ ప్రతిపాదన చేయటానికి ఏ గవర్నర్, ఏ రాష్ట్రం సాహసించదు. అదే ట్రంప్ డోలాయమాన స్థితిలో వ్యక్తమవుతున్నది. గత అధ్యక్షుడు ఒబామా కొన్ని ఆంక్షలు విధించటానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

అధ్యక్షుడు ట్రంప్ వచ్చేవారంలో 50 రాష్ట్రాల గవర్నర్‌ల సమావేశం పిలిచారు. తుపాకుల చట్టాలను కట్టుదిట్టం చేయాలని కోరుతూ ఇప్పటికే నిరసన ప్రదర్శనలు, తరగతుల బహిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు ‘‘మా ప్రాణాల కొరకు మార్చ్’’ పేరుతో మార్చి 24న వాషింగ్టన్‌లో ప్రదర్శన తలపెట్టారు. ఈ ఆందోళనలు, ఇతర ప్రయత్నాలు రాజకీయ వ్యవస్థపై తెచ్చే ఒత్తిడి ఏమైనా ఫలితమిస్తుందో లేదో వేచిచూడాల్సిందే.

గ్రామీణ ఉపాధికి తలకొరివి?

చూపు

జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టాన్ని(ఎన్‌ఆర్ఇజిఎ) రద్దు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో అడుగులు వేస్తోంది. 2014లోక్‌సభ ఎన్నికల ముందు బిజెపి ముఖ్యనేతల ప్రైవేటు చర్చలలో ఈ ఆలోచన ప్రముఖంగా వచ్చింది. ఈ పథకానికి స్వస్తి పలకాలని ఇంచుమించు అందరు బిజెపి నాయకులు అభిప్రాయపడ్డారు. అయితే పథకం లబ్దిదారులనుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురుకావచ్చన్న భయంతో ఆ ప్రతిపాదన పక్కనపెట్టారు. ఆ ఎన్నికల తరువాత ఈ విషయం తిరిగి చర్చకు వచ్చింది. అప్పుడు కూడా గ్రామీణ పేదలలో అత్యధిక శాతం జనాభాను శత్రువులుగా చేసుకోవడం ఇష్టంలేక మిన్నకున్నారు. ‘ఎన్‌ఆర్ఇజిఎ విఫలం’ అయిందని బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. నిజానికి ఈ పథకం పేదరిక నిర్మూలనలో పెద్దగా విజయం సాధించకపోవచ్చు కానీ పూర్తిగా విఫలమైందని అనలేము. ఎన్నికల ప్రయోజనాలకోసం ఆ పథకాన్ని వాడుకోవాలని బిజెపికి ఒక ఆలోచన వచ్చాక దాని యంత్రాంగాన్ని కొద్దిగా మార్చి అమలు చేయాలని సంకల్పించింది. కాని పథకానికి కేటాయింపుల మొత్తం తగ్గించి వేసింది.

పదేళ్ల తర్వాత కూడా ఈ పథకం నిలిచి ఉండడానికి కారణం గ్రామీణ ప్రజల మద్దతే. పేద ప్రజలకు రాజకీయ వాణిని కల్పించిన పథకమది. అయితే ఈ పథకం లబ్ధిదారులు బిజెపికి అనుకూలురుగా మారలేదు. ఈ కారణంగానే కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఎన్‌ఆర్ఇజిఎ పథకానికి కేటాయింపులను కోతకోసింది. ఒక రకంగా చెప్పాలంటే ఆ పథకం విప్లవాత్మకం. మధ్యదళారులు, స్వార్థపర శక్తుల వల్ల పథకం కొంత అప్రతిష్ట మూటగట్టుకుంది. పేదరిక నిర్మూలనకు అనుకూలమైన యంత్రాంగం ఆ పథకానికి లేదన్న ఆరోపణ బలపడింది. అంతేకాకుండా పథకం అమలు ద్వారా గ్రామీణ ప్రాంతాలలో నాణ్యమైన మౌలిక సౌకర్యాల సృష్టి జరగలేదని కూడా విమర్శలు వచ్చాయి.

ఇటువంటి ఆరోపణల ఆధారంగా పథకాన్ని పూర్తిగా పక్కనబెట్టడం సవ్యంకాదు. పేద జనానికి పనిహక్కు కల్పించాలన్న సంకల్పం మొదటిసారి ఐక్య ప్రగతిశీల కూటమి (యునైటెడ్ ప్రోగెసివ్ అలయెన్స్–యుపిఎ) ప్రభుత్వానికి కలిగింది. అయితే సామాజిక శక్తులు, భూస్వాములు ఆ చర్చలలోనే పేద ప్రజలకు ఆ ప్రయోజనాలు అందకూడదన్న దృష్టిని కనబరచాయి. తమ వర్గ ప్రయోజనాలకు అటువంటి పథకాలు గొడ్డలిపెట్టు అని ఆ శక్తులు భావించాయి. ముఖ్యంగా దేశంలోని నిరుపేదలకు సాధికారత కల్పించడంవల్ల తాము దెబ్బతింటామని వారు ఆందోళన చెందారు. పేదప్రజల ‘రాజకీయ శక్తి సామర్థ్యాలు’ పెంచడాన్ని వారు స్పష్టంగా వ్యతిరేకించారు. ఎన్‌ఆర్ఇజిఎ అమలు వల్ల గ్రామాలలోని పంచాయతీలు చురుకుగా మారి పేద ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా పనిచేస్తాయని భావించి వ్యతిరేకించారు.

అయితే ఆ పథకం అమలువల్ల వారు భయపడినంతగా పేద ప్రజలకు మేలు జరగలేదు.అందుకు బదులుగా ఆ పథకం వల్ల కొత్తగా ధనదాహంతో పెచ్చరిల్లే శక్తులు పంచాయతీల ప్రతినిధులుగా పుట్టుకొచ్చారు. ఈ పథకం క్రింద పనులను ప్రజల నిఘాలో అత్యంత సమర్థంగా అమలు జరపడం వల్ల మౌలిక సౌకర్యాలు పెంపొందుతూ గ్రామీణ పేదలకు సాధికారత లభిస్తుందన్న ఆశలు అడియాశలుగా మిగిలాయి. ప్రజల భాగస్వామ్యం లేకపోగా ప్రభుత్వ అధికారుల జోక్యం పెరిగిపోయింది. పేద ప్రజల భవిష్యత్తును మంచిగా మలిచే పాత్ర పోషించడంలో పంచాయతీలు కూడా విఫలమయ్యాయి. అందువల్లనే ఈ పథకం కింద వేతనాలను నేరుగా చెల్లించకుండా బ్యాంక్ అకౌంట్లకు బదిలీ చేసే పద్ధతి నెలకొంది. పథకం వైఫల్యంలో దాని రూపశిల్పులు, సామాజిక కార్యకర్తల పాత్ర కూడా లేకపోలేదు.



ఈ పథకం కింద పనుల పంపిణీలో రాజకీయ పరిమితం చేయాలన్న జోక్యం అడుగడుగునా పెరిగింది. దేశంలో ఆర్థికంగా అత్యంత బలహీనంగా ఉన్న ప్రాంతాలకు పథకం వర్తింపును ప్రస్తుత ప్రభుత్వ ప్రతిపాదనలు కిందిస్థాయి నుండి ఎదురైన నిరసనలవల్ల అమలు కాకుండా ఆగిపోయాయి. ముఖ్యంగా ప్రతిపక్షాల సారథ్యంలో ఈ నిరసన ప్రదర్శనలు చోటు చేసుకున్నాయి. కొందరు బిజెపి ముఖ్యమంత్రులకు ఇష్టంలేకపోవడం వల్ల పథకాన్ని నిలిపివేసే యత్నాలను ప్రదర్శకులు గట్టిగా నిరసించారు. నిజానికి కొన్ని బిజెపి రాష్ట్రాలకు గ్రామీణ ఆస్తుల సృష్టిలో ఈ పథకం అందివచ్చింది. కానీ తమ సాంప్రదాయక ఓటు బ్యాంకుకు పథకం లబ్ధిదారులు పెద్దగా కలిసిరానందున దానిపట్ల బిజెపి వ్యతిరేకతను తీవ్రంగా పెంచుకుంది.

ఇటీవల 19 రాష్ట్రాలలో ఎన్‌ఆర్ఇజిఎ కింద చెల్లింపులను స్తంభింపచేశారు. జార్ఖండ్, కర్నాటక, కేరళ, బీహార్, ఉత్తరాఖండ్, త్రిపుర, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రసహా 12 రాష్ట్రాలకు కేంద్రం నిధుల విడుదల నిలిపివేసింది. 2017 సెప్టెంబర్ నుంచి చెల్లింపులు ఆగిపోయాయి. 92 మిలియన్ మంది కూలీలకు సకాలంలో వేతనాలు అందలేదు. ఆలస్యమైన చెల్లింపుల మొత్తం రూ.3,066కోట్ల దాకా ఉంది. ఎన్‌ఆర్ఇజిఎ పథకం సంఘర్ష్ మోర్చా ఈ విషయం తెలిపింది. అది కిందిస్థాయి సంఘాలతో కూడిన నెట్‌వర్క్. రాష్ట్రాలు ఇంతకుముందు ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై ఆడిట్ రిపోర్టులను తప్పనిసరిగా పంపాలన్న నిబంధన ఉంది. ప్రతి ఏటా సెప్టెంబర్ 30 తర్వాత కేంద్ర ప్రభుత్వానికి తగిన మొత్తాలలో విడతలుగా విడుదల చేయడానికి ఈ రిపోర్టులను పంపుతారు. ఎన్‌ఆర్ఇజిఎ మార్గదర్శక సూత్రాల ప్రకారం మస్టర్ రోల్స్ మూసివేసిన పదిహేను రోజులలోగా కార్మికులకు వేతనాలు అందాలి. వాటిని చెల్లించకపోతే నిర్దిష్ట రేటులో పరిహారం పొందే అర్హత కార్మికులకు కల్పించారు.

ఈ ఆలస్యానికి న్యాయబద్ధంగా పరిహారాన్ని లెక్కగడతారు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో కేంద్రప్రభుత్వం ఈ నష్టపరిహారాన్ని రూ.519కోట్లుగా నిర్ణయించింది. నిజానికి బకాయి మొత్తం రూ.1,208 కోట్లలో ఇది 43శాతం మాత్రమే. 2017లో ఈ పథకానికి బడ్జెట్‌లో కేటాయించిన మొత్తంలో 80 శాతాన్ని తొలి నాలుగు నెలల్లో ఖర్చు చేశారు. అదనంగా రూ.17,000 కోట్ల కోసం గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ విజ్ఞప్తిని ఇంతవరకు పట్టించుకోలేదు. ప్రస్తుతం కేటాయింపులో 5 శాతం మాత్రమే మిగిలిఉన్న పరిస్థితిలో పనుల పంపిణి, వాటికయ్యే వ్యయంలో పూర్తి జాగ్రత్త పాటిస్తున్నారు. ఆశ్చర్యకరంగా 14 రాష్ట్రాలలో ఈ పథకం కింద కార్మికులకు కనీస వేతనం కంటే తక్కువ చెల్లిస్తున్నారు. చట్టం చెబుతున్న కనీస వేతనంతో సమాన మొత్తాన్ని ఈ పథకం కింద కార్మికులకు చెల్లించాలని మహేంద్రదేవ్ కమిటీ యుపిఎ ప్రభుత్వ హయాంలోనే సిఫార్సు చేసింది. లేదా చట్టం నిర్దేశిస్తున్న రేటులో ఏది ఎక్కువ అయితే ఆ మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. అయితే మోడీ ప్రభుత్వం మరో కమిటీని ఈ అంశంపై నియమించింది. కనీస వేతనాల ప్రకారం చెల్లించాల్సిన అవసరం లేదని ఆ కమిటీ సూచించింది. మొత్తం మీద కాలయాపన ద్వారా, వేతనాల చెల్లింపులను అరకొరగా చేస్తూ, పథకాన్ని పూర్తిగా నీరుకారిపోయేలా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అర్థమవుతోంది.

✻ అరుణ్ శ్రీ వాస్తవ

అవినీతికి ఎవరు అతీతులు?



టంకశాల అశోక్
9848191767

వజ్రాలు, నగల వ్యాపారి నీరవ్ మోడీ కుంభకోణానికి బాధ్యత మీదంటే మీదని బిజెపి, కాంగ్రెస్‌లు పరస్పరం నిందించుకోవటాన్ని చూసి జుగుప్స కలుగుతున్నది. దర్యాప్తు జరిగి, అదికూడా నిజాయితీగా జరిగితే, ఎవరు దోషులు, ఎవరెంత దోషులు అనే విషయం బయటపడవచ్చు. కాని ఈ లోపల మనం వీరిద్దరిలో నిజాయితీపరులు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించుకోవలసి వస్తున్నది. ఇరువురి చరిత్రను ఆసాంతం పరిశీలించినా, లేక మన చుట్టూనే ఉండే ఈ రెండు పార్టీల వారిని గమనించినా, ఇద్దరూ ఇద్దరే అనుకోక తప్పని స్థితి ఉంది.

2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో జి–2, బొగ్గుగనులు వగైరా కుంభకోణాలు దేశాన్ని కుదిపివేసాయి. అపుడు కాంగ్రెస్ నాయకత్వాన ఉండిన యుపిఎ ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అయింది. ఆ తర్వాత ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు జి–2లో అవినీతి లేదని ‘తేల్చి’ ఉండవచ్చుగాక. కాని దేశంలో పరిస్థితి ఎంత వరకు వచ్చిందంటే, అవినీతి కేసులపై కోర్టు తీర్పులను సైతం ప్రజలు నమ్మటం లేదు. దర్యాప్తు సంస్థలపై కూడా నమ్మకం పోతున్నందున, వారు దర్యాప్తును కావాలనే సరిగా జరిపి ఉండరని, లేదా లంచాలు తీసుకునో, ఒత్తిడికి లోనయ్యో కేసును నీరు గార్చి ఉంటారని, లేదా న్యాయమూర్తులు ప్రలోభాలకు గురై ఉంటారనే భావనలు ప్రజలలో వ్యాపించి పోయాయి. ఈ మాట అంటున్నది స్పెక్ట్రమ్ కేసు గురించి కాదు. అనేక కేసులను కిందినుంచి పైవరకు చూస్తున్న మీదట సాధారణ ప్రజలకు దర్యాప్తు సంస్థలపైన, కోర్టులపైన ఏర్పడిన అనుమానాలివి.

మొత్తానికి 2014 ఎన్నికల తీర్పు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రావటానికి అవినీతి కుంభకోణాలు ఒక ముఖ్యకారణం అయ్యాయి. కాంగ్రెస్ అవినీతిని పెద్ద ప్రచారాయుధంగా మార్చుకున్న బిజెపి ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్రమోడీ, తాము అధికారానికి వచ్చినట్లయితే అవినీతిని అడ్డుకోగలమని పదేపదే నమ్మబలికారు. ఆయన మాటలను ప్రజలు తగినంతగా విశ్వసించినట్లు కూడా కన్పించింది. అధికారం చేపట్టిన తర్వాత కొంత కాలం వరకు తను, ‘‘చూసారా, మా పాలనలో అవినీతి అన్నదే లేదు’’ అనే ప్రచారం కూడా సాగించారు. అటువంటి స్థితిలో విజయ్ మాల్యా బ్యాంకులకు వేలకోట్ల రూపాయలు ఎగవేయటమే గాక విదేశాలకు పారిపోగలగటంతో ఆయన ప్రభుత్వంపై దేశంలో అనుమానాలు మొదలయ్యాయి. ఆ వెంటవెంటనే ఇంకా అనేకుల అప్పు ఎగవేతల కేసులు వెలుగులోకి రావటం మొదలైంది. ఈ పరంపరలో నీరవ్ మోడీ కుంభకోణం తాజాది. ఇటువంటివారంతా బ్యాంకులను మోసం చేయటం ఒక ఎత్తయితే, చాలా తేలికగా విదేశాలకు పారిపోగలగటం మరొక ఎత్తవుతున్నది.

ఎగవేతలుగాని, పారిపోవటాలు గాని అకస్మాత్తుగా రాత్రికి రాత్రి జరుగుతున్నవి కాదన్నది ఇందులో గమనించవలసిన విషయం. అప్పులు తీసుకోవటం ఏళ్ల తరబడి సాగుతుంది. కనీసం కొన్ని కేసులలో ఆ సూచనలు బ్యాంకు ఉన్నతాధికారులకు, రిజర్వ్ బ్యాంకుకు, కేంద్ర ఆర్థిక శాఖకు, చివరకు నిఘా సంస్థలకు తెలిసి ఉండటం కూడా ఏళ్లతరబడి సాగుతుంది. అయినప్పటికీ ఎవరినుంచి, ఏ దశలోనూ చర్యలుండవు. చివరకు సదరు వ్యక్తులు ఇతర దేశాలలో అన్ని భద్రతా ఏర్పాట్లు చేసుకుని, నిధులను తరలించుకుని, ఇతర దేశాల పాస్‌పోర్టులు సంపాదించుకుని, కుటుంబాలను అక్కడకు తరలించి, ఒక శుభ ముహూర్తాన అధికారుల కళ్ల ముందునుంచే జారుకున్న తర్వాత గాని కలకలం మొదలు కాదు.

ఇపుడు నీరవ్ మోడీ వరకు ప్రతి సందర్భంలోనూ ఇదే తంతు. 2019 ఎన్నికలలోగా మరెన్ని కుంభకోణాలు బయటపడతాయో తెలియదు గాని, 2014 ఎన్నికలకు ముందు నరేంద్రమోడీ హోరెత్తించిన అవినీతి వ్యతిరేక ప్రచారం గుర్తుకువస్తున్నది. అవినీతిని నిరోధించగలమని, అప్పటివరకు అవినీతికి పాల్పడిన వారి గుట్టును రట్టు చేయగలమని, వారి సంపదలను జాతిపరం చేస్తామని, దోపిడీ సాగించి విదేశాలలో రహస్యంగా దాచిన సొత్తునంతా వెనుకకు తెప్పించగలమని, దానిని ప్రతి భారతీయ పౌరుని ఖాతాలో పదిహేనులక్షల రూపాయల చొప్పున జమ చేయగలమని ఆయన చేసిన అట్టహాసపు ప్రకటనలు మరీమరీ గుర్తువస్తున్నాయి. వీటన్నింటిలో గత నాలుగేళ్లలో ఏ ఒక్కటైనా మచ్చుకు జరగలేదు. కొత్తగా నీరవ్ మోడీ వ్యవహారం భళ్లున బద్దలైంది. షరా మామూలుగా ఇరువురూ అందుకు బాధ్యత మీదంటే మీదని నిందించుకుంటూ దేశ ప్రజలను ఉమ్మడిగా దగా చేస్తున్నారు.

మోడీ ప్రభుత్వం, బిజెపి అంటున్నట్లు నీరవ్ మోసాలు 2011లో కాంగ్రెస్ పాలనలోనే మొదలయ్యాయని అనుకుందాం. అది నిజమైతే కాంగ్రెస్ ప్రభుత్వం 2011నుంచి 2014 వరకు మూడేళ్లపాటు ఉంది. మరి 2014 నుంచి తర్వాత మూడేళ్లకు పైగా కాలంలో మోడీ ప్రభుత్వం ఏం చేసింది? పైగా, తమకన్నా ముందువలె అవినీతిని సాగనివ్వబోమని, వెనుకటి అవినీతినంతా బయటకు తేగలమని ప్రగల్భాలు పలికిన స్థితిలో? ఇందుకు వారినుంచి ఇంతవరకు ఒక్క వివరణ అయినా వినిపించటం లేదు. దానినట్లుంచి, ఈ పంజాబ్ నేషనల్ బ్యాంక్ దగా యావత్తు 2013–18లోనే జరిగినట్లు సాక్షాత్తూ సిబిఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్లు వార్తలు చెప్తున్నాయి. కుంభకోణాన్ని బ్యాంకు లోపలినుంచి నడిపిన బొంబాయి బ్యాంకు అధికారులు మనోజ్ కరత్, గోకుల్‌నాథ్ శెట్టి ఇరువురు కూడా ఆ స్థానాలలో పనిచేసింది 2014–2017(డిసెంబర్) మధ్యకాలంలో. ఇదంతా మోడీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయమే. సిబిఐ చెప్తున్నది నిజమైతే అది దిగ్భ్రాంతిని కలిగించే విషయం. అటువంటి పరిస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు(కనీసం ఈ కేసులో) ఎంతమాత్రం నిలవవు.

నీరవ్ మోడీ కుంభకోణం విలువ రూ.11,400 కోట్లా లేక, ఆదాయం పన్ను శాఖ అంచనా వేస్తున్నట్లు రూ.13,600 కోట్లా తెలియదు. ఇవన్నీ ప్రాథమిక లెక్కలు అయినందున అన్ని వివరాలు వెల్లడి అయేసరికి ఇంకెంత కాగలదో చెప్పలేము. ప్రభుత్వ పెద్దలు చెప్తున్నది ఆ సొమ్మునంతా రాబట్టగలమని, నీరవ్‌ను వెనుకకు రప్పించగలమని. ఈ మాటలను నమ్ముతున్న వారు ఎవరైనా ఉంటారా? విజయ్ మాల్యా, లలిత్ మోడీలను రప్పించటం తమాషాలు ఏళ్లతరబడిగా నడుస్తున్న స్థితిలో? నీరవ్ మోడీ సంపదలు అయిదువేల కోట్ల మేర స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెపుతున్నారు. అంతకు కొన్నిరెట్లు సంపదలు ఆయనకు విదేశాలలో ఉన్నాయి. భార్యాపిల్లలకు, తనకు ఇతర దేశాల పాస్‌పోర్టులున్నట్లు అధికారులే పేర్కొంటున్నారు. ఇట్లాంటి పరిస్థితులలో పారిపోయిన వారిని వెనుకకు రప్పించి, వారికి ఇతర దేశాలలో గల సంపదలను రాబట్టిన సందర్భం ఇంతవరకు ఒక్కటైనా ఉన్నట్లు లేదు. ఆయా దేశాలలోని చట్టాలు వారికి అనుకూలంగా ఉండటం ఇందుకు ఒక కారణమైతే, అసలు మన ప్రభుత్వాలు పైకి అనేది ఒకటి లోపల చేసేది మరొకటి కావటం రెండవ కారణం. బోఫోర్స్ దర్యాప్తు విషయంలో కాంగ్రెస్ నడిపిన నాటకం ఇందుకు పెద్దతార్కాణం. కనుక, రెండు ప్రధాన పార్టీలు కూడా బలుక్కున్నట్లు ఈ విధంగా వ్యవహరిస్తున్నప్పుడు ఇటువంటి అవినీతి ఆగుతుందని గాని, జరిగినపుడు నిందితులకు శిక్షలు పడగలవనిగాని ఆశించటం వృథా.

ఈ విధంగా మాయమయే వేలకోట్లు, లక్షల కోట్ల నష్టాన్ని భరించేది ఎవరు? మోడీ ఆశపెట్టిన విధంగా అందరికీ పదిహేను లక్షలు రావటం మాటేమోగాని, ఖాతాదారుల సొమ్ము ఈ రూపాలలో దగాకోర్లకు చేరుతున్నది. మరొ మాటలో చెప్పాలంటే ఈ దేశం సొమ్ము అన్నమాట. మోసగాళ్లనుంచి అధికారులకు, నాయకులకు, పార్టీలకు భారీగా ముడుపులు అందుతాయి. మునిగిన బ్యాంకులు తమ నష్టాలను పూడ్చుకునేందుకు ఖాతాదార్ల డిపాజిట్లపై వడ్డీలు తగ్గించటం, వారినుంచి రకరకాల సర్వీస్ ఛార్జీలు వసూలు చేయటం, కుయుక్తులతో అసలు డిపాజిట్లనే నీళ్ల తోడ బూనటం వంటివి చేస్తాయి.

బ్యాంకింగ్ వ్యవస్థను నిలబెట్టే సాకుతో ప్రభుత్వాలు సదరు బ్యాంకులకు రీ ఫైనాన్సింగ్ చేస్తాయి. ప్రజల కళ్లు కప్పేందుకు అందరూ ఒకరినొకరు నిందించుకోవటం, అవినీతికి వ్యతిరేకంగా సరికొత్త ప్రతిజ్ఞలు చేయటం వంటి నాటకాన్ని ఒక అంకం తర్వాత మరొక అంకంగా నడిపిస్తుంటారు. దీని మధ్య గల విషాదం ఈ రెండు పార్టీలు గాక మరొక ప్రత్యామ్నాయం దేశంలో లేకపోవటం. ప్రత్యామ్నాయం కాగలమన్నవారు విఫలమవుతుండటం.

వృత్తికులస్థులకు కొత్త ఉపాధులు



కొలనుపాక కుమార స్వామి,
9963720669

నాడు నిజాం నవాబు ప్రత్యక్ష పాలన కింద గ్రామాలను ఖాల్సా (ఒకని అధికారం క్రింద ఉండేవి) గ్రామాలని, సంస్థానాధీశుల, జాగీరుదార్ల పరిపాలన క్రింద గల గ్రామాలను ఖాల్సేతర ప్రాంతమని పిలిచేవారు. ఈ రెండు రకాల గ్రామాలకు రెవెన్యూ, పోలీసు, అటవీ, మద్యపాన తదితర శాఖల అధికారులు వచ్చినపుడు పనిపాటల కు చెందిన చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, తమ్మలి, హరిజన, బేగరి (గుర్రాల మాలీసు, పాకీపని) మచుకూర(మోతాదు), నీరడి(నీరు తెచ్చేవారు) తదితర 12 కులాల వారు వచ్చి గ్రామంలో ఉన్నన్ని దినాలు రాత్రింబవళ్లు సేవలు చేయాలి. దళితులు అడవికి వెళ్లి పొయ్యిలోకి కట్టెలు తెచ్చి వాటిని చిన్నచిన్నవిగా నరికి తెచ్చి ఇవ్వాలి. అధికారులు వెళ్లేటప్పుడు వారి వస్తు సామాగ్రిని నెత్తిన ముల్లెలు, మూటలు కట్టుకుని మోసుకొని గమ్యస్థానానికి చేరవేసి రావాలి. చాకలి వారు గ్రామ కచేరీలను అలికి, సాపికి(కల్లాపి) చల్లాలి. వచ్చిన అధికారులకు గ్రామాధికారులు వంతు గొర్రెలను, వంతు కోడి పిల్లలను పట్టి వాటిని కోసి కూర సప్లయి చేయాలి. మంగలి దీపాలు వెలిగించాలి. అధికారులకు గడ్డం కటింగ్ (క్షౌరం) చేయాలి. కుమ్మరివారు తమ ఇండ్లనుండి కొత్తకుండలు తెచ్చి స్నానాలకు, వంటలకు నీళ్లు తేవాలి. పిండి, కారం తయారు గావించి వారు వంటలు చేసి పెట్టాలి. వడ్ల, కమ్మరివారు మంచాలు, కుర్చీలు తమ్మలివారు పాలు, పెరుగు, కూరగాయలు సప్లై చేయాలి. బేగరి వారు అధికారులకు మరుగుదొడ్లు కట్టి వాటిని శుభ్రపరచాలి. ఈ పనులన్నింటినీ వెట్టి పనులు అంటారు. ఎలాంటి ప్రతిఫలము ఇయ్యక నిర్బంధముగా తీసుకోబడు పనులే వెట్టి పనులు. నాడు ఒక కథనం ప్రకారం దొరలే గ్రామాలను ఏర్పాటు చేశారు.

వ్యవసాయానికి, ఆవాసానికి అనువైన వాతావరణం సృష్టించారు. జనాన్ని పిలిచి ఊళ్లలో ఉంచారు. గ్రామం ఏర్పడటానికి మొట్టమొదటి అవసరం వృత్తి పని వాళ్లది. చాకలి, మంగలి, కుమ్మరి, కంచరి, వడ్ల మాదుగులు. గ్రామానికి సప్తాంగాలు. వారికి ఇనాములు ఇచ్చారు. ఇనాము భూములమీద సర్కారు సిస్తులేదు. వీటిని అమ్మడానికి, కుదువ పెట్టడానికి వీలులేదు. వంశపారంపర్యంగా వృత్తులు చేయాలి. అనుభవించాలి. అందువల్ల భూమిలేని వృత్తి పనివారు తెలంగాణలో లేకుండిరి. వేల సంవత్సరాల నుండి వచ్చిన గ్రామ వ్యవస్థ అత్యంత పటిష్టం అయింది. ఇది రాజకీయాలతో ఏ మాత్రం నిమిత్తం లేనిది. వృత్తుల వారికి ఇచ్చిన ఇనాములను ఆంధ్రప్రదేశ్ వచ్చిన తరువాత పట్టాలు చేశారు.

వృత్తిపనుల వారు వాటిని అమ్ముకున్నారు. బస్తీలు పట్టారు. ఈ సమస్యను దాశరథి రచించిన జనపదం నవలలో చర్చించారు. కులాలు స్థిరపడిపోయినాయి. ఎవరి అంతస్తు వారికి తెలుసు. ఉమ్మడిగా ఒక కులం మరో కులం మీద పెత్తనం లాంటిది లేదు. చాకలి, మంగలి కులాల్లో కట్టు, ఐక్యత ఎక్కువ. ఒక్కడు కాదంటే అందరూ కాదన్నట్లే. ఒకరికి పోటీగా మరొకరు పోరు. అది అనూచానుంగా వస్తున్న ట్రేడ్ యూనియన్. దాశరథి రంగాచార్య రచించిన ‘మోదుగు పూలు’ నవలలో మంగలిల సంఘటిత శక్తిని చూపించారు. ఈ దశలో కూడా దేశంలో కులవృత్తులు సంప్రదాయిక వృత్తులు కొనసాగుతూ వస్తున్నాయి. అందువల్ల ఏకకాలంలో కులవృత్తుల రక్షణ వాటి నుంచి విముక్తి సాగాలి. ఇది కొందరికి వైరుధ్యంగా కనిపించవచ్చు. ఇప్పుడు ఆయావృత్తులపై ఆధారపడే వారికి నైపుణ్యాల అభివృద్ధి ద్విగుణీకృత ఉత్పత్తి సామర్థ్యం, సంపద సృష్టి ఒక లక్ష్యం. యువతరాలు, భవిష్యత్తరాలు ఆధునిక అభివృద్ధిని, వైద్య, విద్య, వైజ్ఞానిక రంగాల ద్వారా సమస్త రంగాల్లో ఎదగడానికి కెజి టూ పిజి రెసిడెన్షియల్ ఉపాధి నైపుణ్యాలను పెంచడం, సాధ్యపడుతుంది. సంపద పెంచినపుడే దానిని పంపిణీ చేయవచ్చు. సంక్షేమం అభివృద్ధి రంగాల్లో కల్వకుంట చంద్రశేఖరరావు నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నది. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి రూ.250 కోట్లు కేటాయించింది. అదే విధంగా 40వేల కోట్లతో 35 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నది. ఇందులో తెలంగాణ నాయీ బ్రాహ్మణ సహకార సంఘాల సమాఖ్య ద్వారా తెలంగాణలోని నాయీ బ్రాహ్మణ వృత్తిదారులను ప్రోత్సహిస్తున్నది. నాయీ బ్రాహ్మణుల పాత పద్ధతి చేయుచున్న వృత్తికి స్వస్తి పలికి, అధునాతన హెయిర్ స్టైల్స్, బ్యూటీషియన్ వృత్తిలో శిక్షణ ఇస్తున్నారు. పురుషులకు హెయిర్ స్టైల్స్, హెర్స్పా, చుండ్రు శుభ్రత, హెయిర్ కలర్, మ్యానిక్యూర్, పెడిక్యూర్, సాధారణ ఫెరిసెల్, పండ్ల ఫెరిసెల్, గోల్డ్ షెషన్ మొదలైనవి. మహిళలకు ఐబ్రో, అప్పర్ లిప్, ఫోల్‌హ్యాండ్స్, లెగ్స్‌వాక్స్ మ్యానిక్యూర్, పెడిక్యూర్, గ్లోబల్ హెర్ కలర్స్, గోల్డ్ ఫేషియల్, లోటస్ డైమండ్ ఫేషియల్, ఆక్సికేర్ ఫైర్స్‌ఫా, అడ్వాన్స్ హెయిర్ కట్, హెయిర్ ఐరనింగ్, హెయిర్ స్ప్రెటింగ్ మొదలైనవి.

పథకం లబ్దిదారులు ఎవరు – ఇందులో అవకాశాలు పొందడానికి ఆ ప్రాంతం నాయీ బ్రాహ్మణ వృత్తిదారులంతా సహకార సంఘం ఏర్పాటు చేసుకోవాలి. నాయీ బ్రాహ్మణ కులానికి చెందిన వారు పురుషులు/స్త్రీలు వ్యక్తిగత రుణాలు 21 నుంచి 55సంవత్సరాల వరకు పొందవచ్చు. వయస్సు 21 సంవత్సరాలు దాటి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో 1.5లక్షలలోపు, పట్టణ ప్రాంతంలో రెండు లక్షల ఆదాయం కలిగి ఉండాలి. ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హులు. నాయీ బ్రాహ్మణ సమాఖ్యకు అనుబంధమైన సంఘంలోని సభ్యులై ఉండాలి. సంఘంలో సభ్యులు కాని వారు అర్హులా? అర్హులు కాదు. కాబట్టి సభ్యులు కాని వారు 11 నుంచి 15మందిసభ్యులు నూతనంగా సహకార సంఘం ఏర్పరచుకుంటే అర్హులు అవుతారు. నాయీ బ్రాహ్మణవృత్తిదారుల అభిరుచి మేరకు ప్రాంతాల వారీగా మోడ్రన్ హెయిర్ డ్రెస్సింగ్, బ్యూటిషియన్ సెలూన్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. కులవృత్తి పథకాలకు, చదువుకున్న వారికి స్వయం ఉపాధి పథకాలు వర్తింపచేస్తారు. ఆన్‌లైన్ obmms ద్వారా దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు ఏర్పాటు చేయబడును. పిదప మండల/పురపాలక/కమిటీల ద్వారా సభ్యులను ఎంపికచేసి జిల్లా కలెక్టర్ గారు మంజూరు చేయుట. అదేవిధంగా రాష్ట్ర సమాఖ్యనుండి సబ్సిడీ విడుదల తర్వాత పథకములు అమలు చేయబడును.

నూతనంగా సంఘాన్ని ఏర్పాటు చేయుటకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిని సంప్రదించాలి. పథకాల ద్వారా లబ్ది పొందుటకు దరఖాస్తు చేయదలసిన వారు oBMMS TSOBMMS.CGG.GOV.IN అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దేశంలో మారోజు వీరన్న వంటి సామాజిక ఉద్యమకారులు కులవృత్తులకు సంబంధించిన పరిశ్రమలన్నీ ఆయా కులాల వారికే చెందాలని, హక్కుభుక్తం కావాలని ఉద్యమించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఈక్రమం ప్రారంభమైందనిపిస్తుంది. మన తెలంగాణ–మన ప్రభుత్వం–మన పాలనతో 40వేల కోట్లతో 35 సంక్షేమ పథకాలతో సిఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రభుత్వం ప్రగతిపథంలో పరుగుతీస్తున్నది. వినూత్నకార్యక్రమాలతో యావత్ దేశం దృష్టిని ఆకర్షిస్తున్నది.





సీమంతంలో గాజులు తొడగడం ఎందుకంటే...

ఏ శుభకార్యంలో లేనివిధంగా సీమంతం సమయంలో గర్భిణీకి అందరూ గాజులు తొడుగుతారు. ఐదోతనంతోపాటు పండంటి బిడ్డను కనాలని ఆశీర్వదిస్తారు. అలా గాజులు తొడిగే కార్యంలో చక్కని పరమార్థం దాగుంది. గర్భం ధరించిన స్త్రీ గర్భకోశం మీద కావలసినంత జీవనాడుల ఒత్తిడి కావాలి. అందుకే ఏడవ నెలలో శుభకార్యం చేస్తూ ఐనవాళ్లంతా గాజులు తొడుగుతారు. చేతుల్లో నరాలకు గర్భకోశానికి అవినాభావ సంబంధం ఉంది. అలా ఎక్కువ గాజులు తొడిగించుకోవడం ద్వారా గర్భకోశంపై సరైన ఒత్తిడి వచ్చి సుఖప్రసవం జరుగుతుంది.

వింతైన విగ్రహాలు

ఎన్నో మహిమలు కలిగిన దేవాలయాలు వాటి స్థలపురాణాలు ఆశ్చర్యం కలిగించే విషయాల గురించి ఎంత తెలుసుకున్నా తక్కువే.. వందల ఏళ్లుగా వాటి రహస్యాన్ని తెలుసుకోవాలనుకొని పరిశోధనలు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతుంది. అటువంటి కోవకు చెందినదే నేపాల్‌లోని బుధ్‌నీల్‌నాథ్ దేవాలయం. ఈ ఆలయం పేరుమీదుగానే ఈ ఊరికి బుధనీలకంఠ గ్రామంగా పేరు వచ్చింది. ప్రపంచంలోని ఏ దేవాలయంలోనైనా విష్ణువు ఒక పక్కకు తిరిగి పడుకొని ఉన్న స్థితిలో కనిపిస్తాడు. అయితే ఇక్కడ మాత్రం విష్ణువు వెల్లకిలా పడుకుని ఉండటం విశేషం. శేషతల్పం దాని పై విష్ణుమూర్తి పవళించిన రీతిలో చూడముచ్చటగా ఉండే ఈ శిల్పం 1,300 సంవత్సరాల క్రితానికి చెందినది. బ్లాక్ బ్లాస్ట్ రకానికి చెందిన ఏక శిలలో ఈ విగ్రహాన్ని చెక్కారు. విగ్రహం పొడవు 5 మీటర్లు అంటే 16.4 అడుగులు. దాదాపు 13 మీటర్లు అంటే 42.65 అడుగులు ఉన్న విగ్రహం సరస్సు మధ్యగా ఎటువంటి ఆధారం లేకుండా నీటిపై తేలుతూ ఉంటుంది. ఈ విగ్రహం నీటిపై ఎలా తేలుతోందనే విషయం పై నేపాల్, భారత దేశానికి చెందిన శాస్త్రవేత్తలే కాకుండా ప్రపంచం నలు మూలకు చెందిన ప్రసిద్ధి చెందిన ఎంతో మంది శాస్త్రవేత్తలు దాదాపు వందేళ్లుగా పరిశోధన చేస్తున్నారు. అయితే ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విగ్రహం ఇక్కడకు ఎలా చేరిందన్న విషయంపై అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. అయితే వాటిలో కేవలం రెండు కథనాలను ఇక్కడి వారు ప్రముఖంగా ప్రస్తావిస్తారు. పూర్వం ఈ ప్రాంతానికి దగ్గర్లో ఒక రైతు పొలం దున్నుతున్న సమయంలో నాగలి మొన ఒక రాయికి తగిలింది. వెంటనే అక్కడ రక్తం కారడం మొదలయ్యింది. విషయాన్ని గ్రామస్తులకు చెప్పి అక్కడ తవ్వించారు. అప్పుడు విష్ణుమూర్తి విగ్రహం లభించింది. దీంతో గ్రామస్తులంతా ఈ విగ్రహాన్ని ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో ప్రతిష్ఠింపజేశారు. మరో కథనం ప్రకారం ఏడో శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన విష్ణుగుప్త చక్రవర్తి ఈ విగ్రహాన్ని తయారు చేయించాడు. అటుపై ప్రస్తుతం ఉన్న చోట విగ్రహాన్ని ప్రతిష్టింపజేసి దేవాలయన్ని కట్టించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. తేజోమయమైన ఈ విగ్రహం నీటిపై తేలుతూ ఉండటం అటు హిందూమత భక్తులనే కాకుండా ఇతర మతాలకు చెందిన వారిని ఎంతగానో అకర్షిస్తోంది. ఈ విగ్రహానికి ప్రతి రోజు హిందూధార్మిక శాస్త్రాన్ని అనుసరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో 11వ రోజున అంటే ఏకాదసి రోజున హరిబోధిని పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తద్వారా నిద్రపోతున్న శ్రీమహావిష్ణువును మేల్కొపగలిగామని భక్తులు నమ్ముతుంటారు.1641 నుంచి 1674 మధ్య నేపాల్ ను పరిపాలించిన ప్రతాపమల్లుడు ఈ దేవాలయన్ని సందర్శించిన వారికి మరణం తప్పదని నమ్మేవాడు. అందువల్లే ఆయన వంశీయులతో పాటు ప్రస్తుతం నేపాల్ ను పరిపాలించే రాజులు ఎవరూ ఈ దేవాలయాన్ని సందర్శించడం లేదు. నేపాల్ రాజధానికి ఖాట్మండుకు దగ్గర్లో ఈ దేవాలయం ఉంది.




ప్రపంచంలో ఎక్కడలేని విగ్రహం...

తెలంగాణ రాష్ట్రం జై శంకర్ భూపాల్ జిల్లా, మంగపేట మండలం, మల్లూరు గ్రామానికి దగ్గరా హేమాచల నరసింహుడు కొలవై ఉన్న ఈ విగ్రహానికీ ఓ చరిత్ర ఉంది. పచ్చని అడవుల్లో ప్రశాంత వాతావరణంలో ఉన్న ఈ మల్లూరు గుట్ట ప్రాచీన దేవాలయం. భారత దేశం అనేక ఆలయాలకు నిలయం. ఇక్కడ శైవం, వైష్ణవంతో పాటు జైనం, బౌద్ధం కూడా విరాజిల్లింది. ఈ క్రమంలో నిర్మించిన దేవాలయాలు, స్వయంభువుగా చెప్పుకునే విగ్రహాల్లో కొన్నింటి మర్మాలను తెలుసుకోవడం అసాధ్యమవుతోంది. ఈ విగ్రహానికి చర్మం, వెంట్రుకలు ఉంటాయి. దశావతారాల్లో ఒకటిగా చెప్పుకునే నరసింహావతారం ఉగ్ర స్వరూపం. సింహపు తల, మనిషి మొండెం కలిగిన రూపంలో నరసింహుడు మనకు దర్శనమిస్తాడు. పురాణాల ప్రకారం లోకకంటకుడిగా మారిన హిరణ్యకశిపుడిని సంహరించడం కోసమే ఇలా విచిత్రమైన రూపంలో ఈ నరసింహుడు భూమిపై అవతరించాడని తెలుస్తోంది. అటు మనిషితో కాని ఇటు జంతువుతో కాని, పగలు కాని రాత్రి కాని, ఇంటి బయట కాని లోపల కాని, భూమిపైకాని ఆకాశంలోకాని... ఏ ఆయుధంతో కాని హిరణ్యకశిపుడికి మరణం ఉండదు. దీంతో అతని ఆగడాలకు అంతు ఉండదు. ముఖ్యంగా విష్ణు భక్తులను హింసించేవాడు. చివరికి తన సొంత కుమారుడైన ప్రహ్లాదుడిని కూడా వదలలేదు. ఈ క్రమంలో విష్ణువు నరసింహుడి (మానవుడు, జంతువు కలగలిసిన రూపం) రూపంలో వచ్చి సాయంత్రం (పగలు రాత్రి కాని సమయం) సమయంలో ఇంటి గడప (ఇంటి బయట కాదు లోపలా కాదు) పై కుర్చొని తన ఒళ్లో హిరణ్యకశిపుడిని అడ్డంగా పడుకోబెట్టుకుని (భూమి ఆకాశానికి మధ్య అన్న సంకేతం) తన చేతి గోళ్ల (ఏ వస్తువుతో చేసిన ఆయుధం కాదు) తోనే హిరణ్యకశిపుడి పొట్టను చీల్చి అతడిని సంహరిస్తారు. ఇది పురాణాల ప్రకారం నరసింహుడి అవతారం వెనుక ఉన్న కథనం. దేశంలో అనేక చోట్ల నరసింహుడి విగ్రహాలు కనిపిస్తాయి. సదరు విగ్రహాలన్నీ చాలా వరకూ కొండల్లో, గుట్టలపైన ఉంటాయి. ముఖ్యంగా నరసింహుడి దేవాలయాలన్నీ చాల వరకూ గుహాలయాలే. అయితే మనం ఇప్పుడు చెప్పుకోబోయే విగ్రహం మాత్రం పచ్చని అడవుల్లో ఉంటుంది. ఈ విగ్రహం రూపుతో నుంచి ప్రతి ఒక్కటి ప్రత్యేకతను కలిగి ఉంటుంది. చర్మం వలే మెత్తగా ఉన్న విగ్రహం రూపంలో వెలిసిన వాడే హేమాచల నరసింహుడు. చాలా చోట్ల నరసింహుడు లక్ష్మీ సమేతుడై ఉంటాడు. ఇక్కడ మాత్రం నరసింహుడు ఒక్కడే స్వయంభువుగా వెలిసినాడు. విగ్రహం పూర్తి నలుపు రంగులో కనిపిస్తుంది. అన్ని చోట్ల శిలా రూపంలో కనిపిస్తే ఇక్కడ శిలాజిత్తు రూపంలో కనిపిస్తాడు. అంటే ఒంటికి చర్మం ఉన్నట్లు శిలను తాకితే మెత్తగా ఉంటుంది. నోరు, నుదురును గుర్తించవచ్చు. నుదురు నుంచి పాదం వరకూ ఎక్కడ తాకినా సొట్ట పడుతుంది. మరలా యథాస్థితికి చేరుకుంటుంది. మనిషిని ముట్టుకున్నట్లు మెత్తగా ఉంటుంది. చర్మాన్ని తాకిన అనుభూతి కలుగుతుంది. ఇలా చర్మం కలిగిన నరిసింహస్వామి విగ్రహమే కాదు మరే ఇతర దేవుళ్ల విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదు. అభిషేకం చేసే సమయంలో స్వామి వారి విగ్రహం నుంచి వెంట్రుకలు రాలి పోతుంటాయి. ఆ అనుభూతి తమకు కలుగుతుందని ఇక్కడి పూజారులు చెబుతారు. ఇక స్వామి వారి నాభి నుంచి నిరంతరం స్రవాలు కారుతుంటాయి. దాన్ని స్వామి వారి స్వేదం అని అంటారు. ఈ స్వేదం అలా కారిపోకుండా అక్కడ చందనాన్ని ఉంచుతారు. ప్రతి శని, ఆది, సోమవారాల్లో ఈ చందనాన్ని భక్తులకు అందజేస్తారు. ఈ చందనం ప్రసాదంగా తీసుకుంటే సంతానలేమి సమస్యలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ఇక స్వామి వారి పాదాల నుంచి నీటి ఊట ఎల్లప్పుడూ పారుతూ ఉంటుంది. ఇది జలధారగా మారుతుంది. దీనిని చింతామణి జలధారగా పిలుస్తారు. అయితే స్వామి వారి పాదల నుంచి కొంత దూరంలో ఉన్న జలధారకు నీరు ఎలా వచ్చి చేరుతుందనేది ఎవరూ కనిపెట్టలేక పోతున్నారు. మరో విచిత్రమేమంటే అన్ని కాలాల్లోనూ ఈ జలధారలో నీటి వేగం ఒకే విధంగా ఉండటం. ఇందులోని నీటికి రోగాలను నయం చేసే శక్తి ఉందని భక్తులు విశ్వసిస్తారు. రాణి రుద్రమదేవి ఒకానొక దశలో పేరు తెలియని వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ ఉంటే రాచవైద్యుల సూచనల మేరకు ఈ జలధార నీటిని తాగిందని దీంతో రోగం తగ్గి పోయిందని చెబుతారు. ఇదే విషయాన్ని భక్తులు కూడా నమ్ముతారు. మరోవైపు ఇక్కడి నీటిని విదేశాల్లో ఉన్న తమవారికి కూడ ఇక్కడి వారు పంపించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడి విగ్రహం వేసవిలో ఒకలాగా, మిగిలిన కాలాల్లో ఒకలాగా ఉంటుంది. వేసవిలో చాల పలచగా ఉండే విగ్రహం మిగిలిన కాలాల్లో వెనుక ఉన్న రాతి నిర్మాణం నుంచి ముందుకు చొచ్చుకు వచ్చి ఉంటుంది. గరిష్టంగా స్వామి వారి విగ్రహం నాలుగు అడుగులు ముందుకు వస్తుంది. దీనిని కూడా స్వామి వారి మహత్యంగా చెబుతారు. ఆరో శతాబ్దంలో దిలీప కుల కర్ణి మహారాజు ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు. ఆ సమయంలో ఇక్కడ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో స్వామి వారు రాజు కలలో వచ్చి తవ్వకాల సమయంలో ఓ గునపం తన విగ్రహంలోని నాభి ప్రాంతంలో దిగిందని తెలిపారు. భూమి లోపల ఉన్న తన విగ్రహాన్ని భక్తులు సందర్శించే ఏర్పాటు చేయాలని చెబుతారు. స్వామి వారి ఆదేశాలను అనుసరించి అక్కడ రాజు దేవాలయాన్ని నిర్మిస్తాడు. ఇక నాభి గుచ్చుకున్న స్థలంలోనే స్రవాలు వస్తున్నట్లు భక్తులు భావిస్తున్నారు. హైదరాబాద్ నుంచి మల్లూరు గ్రామానికి 145 కిలోమీటర్లు. ప్రయాణ సమయం దాదాపు 3.30 గంటలు. దేశంలో చాలా చోట్ల నుంచి హైదరాబాద్ కు ప్రయాణ సౌకర్యాలు బాగా ఉన్నాయి.







సహోదరిని ద్వేషించేవాడు నరహంతకుడు

శత్రువుల తలలు తెగనరకడం శూరత్వమని, ఎంత రక్తం యుద్ధ భూమిలో ప్రవహిస్తే అంత గొప్ప విజయమని నమ్మిన చరిత్రలోకి కాలుబెట్టిన యేసు "మీ శత్రువులను ప్రేమించండి, మీ పట్ల తప్పు చేసిన వారిని క్షమించండి" అంటూ బోధించడం సమాజం ఒక్క సారి ఉలిక్కిపడేట్టు చేసింది. ద్వేషించమని లోకానికి చెప్పవలసిన అవసరమే లేదు. అది లోకం డిఎన్ఎలోనే ఉంది. సృష్టి ఆరంభంలో రెండవతరం అంటే తొలి మానవుడైన ఆదాము హవ్వల కుమారుడైన కయీనుతోనే "ద్వేషం" ఆరంగేట్రం చేసింది. కయీను, అతని తమ్ముడు హేబేలు దేవునికి చెరొక కానుకనివ్వగా, దేవుడు హేబెలు కానుకను స్వీకరించి, కయీను కానుకను లక్ష్యపెట్టలేదు. అందుకు కయీను తన తమ్ముని ద్వేషించి పట్టరాని కోపంతో హేబెలును హతమార్చాడు. తనది కాదని తమ్ముని కానుకను దేవుడంగీకరించాడన్న అసూయతో కయీను ద్వేషపూరితుడయ్యాడు. కాని కయీనుకున్న కుట్ర, అసూయ, ద్వేష పూరిత స్వభావన్ని బట్టి దేవుడు అతని కానుకను నిరాకరించాడు. కానుకలతో కాదు, విశ్వాసి హృదయాన్ని అతని సరళ నడతను తాను లక్ష్యపెడ్తానన్న దేవుని తాత్పర్యాన్ని అప్పటి నుండి ఇప్పటి దాకా మనిషి గ్రహించలేదు. ద్వేషించే హక్కు నాదంటాడు మానవుడు. ఎంత బలమైన కారణమున్నా సాటి మనిషిని ద్వేషించే హక్కు మనిషికి లేదంటాడు దేవుడు. దేవునికి "ద్వేషం" అంటే ఎంత దూరమంటే, తన సహోదరుని ప్రేమించకుండా ద్వేషించేవాడు నరహంతకుడు అన్నాడాయన(1యోహాను 3:15).

యేసు ప్రభువు కేవలం ఆ విషయాన్ని బోధించలేదు, ఆచరించి చూపించాడు. శిష్యులంతా ఆయనకు సోదరుల వంటి వారే! అలాంటి వారు యేసును శ్రమల్లో వదిలేసి పారిపోతే ఆయన వారిని ద్వేషించడానికి బదులు తాను పునరుత్థానుడైన తర్వాత ఒక్కొక్కని వద్దకు తానే స్వయంగా వెళ్ళి వారిని ఓదార్చి, అనునయించి తననునుసరించే మహాభాగ్యాన్ని వారికి మళ్ళీ ప్రసాదిస్తే, వాళ్ళంతా తమ ప్రాణాలకు తెగించి యేసు క్షమ, ప్రేమ సువార్తను భూ దిగంతాలకు తీసుకెళ్ళారు. చివరికి అంతా ప్రాణాలర్పించారు. కేవలం బోధలు, బుద్ధి మాటలు లోకంలో ఎవరినీ మార్చవు. అవే బోధలు వక్తలు, బోధకుల జీవితాల్లో ఆచరణ రూపంలో కనిపిస్తే అది లోకాన్ని పరివర్తనం చేస్తుంది. ద్వేషంతో రగిలిపోయే లోకానికి ఆయనందించిన క్షమా సువార్తను ఆనాడు ఈనాడు కూడా చులకనగా మాట్లాడే వారుండవచ్చు. కాని ఉధృతంగా సాగిన హింస, ద్వేషం, కుట్రలతో కూడిన చరిత్రలో అంతో ఇంతో మానవీయతను కాపాడింది ప్రేమను, క్షమను బోధించిన క్రైస్తవంలాంటి ఉద్యమాలే!! ఈ తరానికి ఒక్క మదర్‌థెరిస్సాయే తెలియవచ్చు. కాని ప్రతి తరంలోను అలాంటి యేసు అనుచరులు వందల మంది నిరుపేదల పక్షం వహించారు.



రెవ.టి.ఎ. ప్రభుకిరణ్
98488 21472

హనుమంతుడు సింధూర ప్రియుడు



హనుమంతుడి ఒంటి నిండా సింధూరం ఎందుకు ఉంటుందో అనే విషయాన్ని "శరసంహిత" వర్ణించింది. సీతమ్మ పాపిట బొట్టు పెట్టుకోవడం చూసిన ఆంజనేయుడు ఓసారి ఎందుకలా పెట్టుకుంటున్నావని అడిగాడు. అందుకు సీతమ్మ నవ్వుతూ ఈ పాపిట బొట్టువలన నేను రామ ప్రేమను పొందానని చెప్పింది. ఈ బొట్టు రామయ్యకు చాలా ఇష్టమని చెప్పింది. దీంతో వెంటనే హనుమంతుడు సింధూరాన్ని ఒంటినిండా రాసుకున్నాడు. ఆయనకు ఆపాదమస్తకం రోమాలు ఉండటం చేత ఆ సింధూరం వెంటనే రాలిపోయేది. దీంతో ఆయన నూనెతో కలిపిన గంగ సింధూరాన్ని ఒంటినిండా పట్టించుకున్నాడట. ఈ అమాయకపు పని చేసిన ఆంజనేయుడ్ని చూసిన శ్రీరాముడు 'ఈ రూపంతో నిన్ను ఎవరైతే సేవిస్తారో వారికి నేను ప్రసన్నుడను' అని అన్నాడట. అటువంటి భక్తులకు సమస్త దోషాలూ తొలగి సుఖశాంతులు పొందుతారని వరం ఇచ్చాడు. అందుకే హనుమంతుడి ఒంటి నిండా సింధూరం పూసి ఉంటుంది.

అల్ హందులిల్లాహ్..అల్లాహ్‌కు కృతజ్ఞతలు

ఒకసారి ఖలీఫా హారూన్ రషీద్ తన రాజ దర్బారులో పరిపాలనా వ్యవహారాలు చూస్తుండగా ఆయనకు తీవ్ర దాహం వేసింది. ఆయన ఆజ్ఞ మేరకు సేవకులు నీళ్ల గ్లాసుతో ప్రత్యక్షమయ్యారు. ఆయన పక్కనే ఉన్న హజ్రత్ సమాక్ అనే ఒక పండిత మహాశయుడు ఖలీఫానుద్దేశించి ''ఖలీఫా మంచినీళ్లు తాగే ముందు నాదో విన్నపం.'' దానికి ఖలీఫా విన్నవించండి అని సైగచేశారు. ''ఖలీఫా, మన రాజ్యమంతా ఎక్కడా చుక్క మంచినీరు లేదనుకోండి, అప్పుడు మీ చేతిలో ఉన్న ఈ గ్లాసెడు మంచినీళ్లకు ఎంత మూల్యం చెల్లిస్తారు'' అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు ఖలీఫా ఆశ్చర్యానికి లోనయి ఆలోచనల్లో పడిపోయారు. కాసేపటికి తేరుకొని ''రాజ్యంలోని సగ భూభాగాన్ని విక్రయించైనా ఈ గ్లాసెడు నీళ్లను కొనుగోలు చేస్తాను' అని ఖలీఫా సమాధానమిచ్చారు. తిరిగి పండితుడు ''తమరు ఈ గ్లాసెడు నీళ్లు తాగిన తరువాత ఆ నీళ్లు తిరిగి మూత్రం రూపంలో బయటకు రాకుండా మీరు ఇబ్బంది పడితే అప్పుడు ఎంత ఖర్చుపెడతారు'' అని అడిగాడు. అప్పుడు ఖలీఫా ''ఈ సమస్య నుంచి బయటపడేందుకు, ఆ బాధనుంచి విముక్తి పొందేందుకు నా రాజరికాన్నయినా వదులుకుంటాను, నా రాజ్యంలోని యావదాస్తినిసైతం తాకట్టు పెట్టడానికి కూడా వెనుకాడను. ఎందుకంటే ఆరోగ్యం బాగాలేనప్పుడు చేతిలో ఎంత అధికారమున్నా, ఎన్ని రాజ్యాలు హస్తగతమైనా ప్రయోజనమేముంటుంది'' అనే సమాధానపరుస్తారు ఖలీఫా.

హజ్రత్ సాదీ అలై రహ్మాకు ఒకసారి బంధువుల విందుకు ఆహ్వానం అందింది. ఆయన ఆ విందుకు వెళ్లాలంటే మంచి బట్టలైతే ఉన్నాయి కానీ వాటికి తగ్గ మేజోళ్లు లేవనే అసంతృప్తి ఆయన్ని వెంటాడింది. సరే చేసేదేమిలేక ఉన్న మేజోళ్లనే శుభ్రం చేసుకుని విందులో పాల్గొనేందుకు తీవ్ర అసంతృప్తితో బయలుదేరారు. ఇలా వెళ్తుంటే మార్గమధ్యలో రెండు కాళ్లూ లేని ఒక వ్యక్తి రోడ్డుపై పాకుకుంటూ వెళ్లడం చూశారాయన. ఆ వికలాంగుడు పడుతున్న ఇబ్బందిని చూసి సాదీ అలై రహ్మా ఎంతో చలించి పోయారు. వెంటనే అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మేజోళ్లు సరిగా లేకపోయినా అల్లాహ్ తనకు వడివడిగా నడిచేందుకు రెండు కాళ్లను ఇచ్చాడని ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ దైవం సమక్షంలో మోకరిల్లి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

పై రెండు కథల్లోనూ మనకు ఎన్నో జీవిత గుణపాఠాలున్నాయి. మొదటి గాథలో ఖలీఫా సమాధానాలు ప్రతి ఒక్కరికీ కనువిప్పు అయితే రెండో గాథలో హజ్రత్ సాదీ అలై (రహ్మా) కృతజ్ఞతాభావం మనకు ఆదర్శనీయం. ఒక్క గ్లాసెడు నీళ్లకు మూల్యం విశాలమైన రాజ్యం కంటే కూడా దిగదిడుపే అని ఖలీఫా మాటలు నిత్యసత్యం. మనం తాగే మంచి నీళ్లు మన నోటికాడికి ఉచితంగా అందుతున్నాయి. ఎలాంటి ఖర్చు లేకుండానే మనం మంచినీళ్లతో దాహం తీర్చుకుని ప్రాణాలతో బతుకుతున్నాం. దేవుడు ప్రసాదించిన అనంతమైన మహావరానికి గాను ఎన్ని కృతజ్ఞతలు తెలుపుకున్నా తక్కువే. మనం తాగే మంచినీళ్లే కాదు జీవితంలో మనకు లభించిన అనుగ్రహాల పట్ల ఎన్ని కృతజ్ఞతలు తెలుపుకున్నా వాటి మూల్యాన్ని చెల్లించుకోలేము. ఇక రెండో కథలో సాదీ అలై రహ్మా తన అసంతృప్తి పట్ల పశ్చాత్తాపం చెంది రెండు కాళ్లూ లేని ఒక అవిటి వాడిని చూసి చలించిపోయిన తీరు మనకు స్ఫూర్తిదాయకం. మంచి ఆయురారోగ్యాలు, చూడటానికి కళ్లూ, నడవడానికి కాళ్లూ, వినడానికి చెవులూ, పని చేయడానికి చేతులూ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అనుగ్రహ వరాలు అల్లాహ్ మనకు ప్రసాదించాడు. నయాపైసా ఖర్చు లేకుండా మనకు ఇవన్నీ దక్కుతున్నాయి. వీటికిగాను అల్లాహ్ కృతజ్ఞతలు తెలుపుకోవాలేకాని ఎదుటివారికి దక్కినవి మనకు దక్కలేదని, అసూయాద్వేషాలు పెంచుకుని నిరాశానిస్పృహలతో జీవితం గడపరాదు. ప్రాపంచిక వ్యవహారాల్లో మన కంటే తక్కువ వారితో పోల్చుకోవాలని ఈ కథ చెప్పకనే చెబుతుంది. ధార్మిక వ్యవహారాల్లో మనకంటే ముందున్న వారిని చూడాలని ప్రవక్త చెప్పారు. ఇలా చేయడం వల్ల అసంతృప్తి, అసూయ ద్వేషాలు దరిచేరవు. కృతజ్ఞతాభావం పెల్లుబుకుతుంది. అత్మసంతృప్తికి మించిన సంపద ఈ ప్రపంచంలో మరొకటి లేనేలేదు. సమాజంలో జరుగుతున్న నేరాలకు అశాంతి మూల కారణం. అసంతృప్తి వల్లే అశాంతి, అసూయ, విద్వేషం పెరుగుతాయి. అందుకే మనం నిత్యం మనకు ప్రసాదించిన, మనకు దక్కిన భాగ్యాలు, బహుమానాలు, ప్రసాదాలకు నిత్యం కృతజ్ఞతాపూర్వకంగా మసలుకోవాలి. ఎలాంటి ఖర్చులేకుండా ఈ మహా అనుగ్రహాలను దేవుడు మనకు ప్రసాదించాడు. జీవితంలో ఉన్నతి కోసం పరిశ్రమించడంలో తప్పు లేదు కాని ఎదుటివారి ఉన్నతిని చూసి అసూయతో రగిలిపోవడం, మనకు లేదని నిరాశచెందడం మహా పాపమవుతుంది. లేనిదానికోసం అర్రులు చాచడం కన్నా మనకున్న దాంట్లో తృప్తిగా బతకడంలోనే హాయి ఉంటుంది. మనకు లభించిన అనుగ్రహాలపట్ల, మనం సాధించిన ఉన్నతిపట్ల అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. మనం పీల్చుకుంటున్న గాలి, ఆహారం తినేముందు, ఇంట్లోకి ప్రవేశించే ముందు, మంచి ఆరోగ్యం ప్రసాదించినందుకు, కంటినిండా నిద్ర పట్టినందుకు, సంతానం కలిగినందుకు ఇలా అడుగడుగునా అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. కృతజ్ఞతలు తెలుపుకునే ఒక మార్గం నిత్యం మన నాలుకపై 'అల్ హందులిల్లాహ్' పఠిస్తూ ఉండాలి. ఇలా కృతజ్ఞతలు తెలుపుకునే దాసుడి పట్ల అల్లాహ్ సంతుష్టుడవుతాడు. ''మీరు గనక కృతజ్ఞులైతే, నేను మిమ్మల్ని ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాను. ఒకవేళ కృతఘ్నుతకు పాల్పడితే నా శిక్ష చాలా కఠినముగా ఉంటుంది.'' (దివ్యఖుర్ఆన్ 14:07) కనుక అల్లాహ్ అనుగ్రహాల వర్షం మనపై కురవాలంటే ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకునే దాసులుగా మారుదాం.




ముహమ్మద్ ముజాహిద్ 96406 22076

తక్షణమే ఎస్‌టిల రిజర్వేషన్ పెంపు జిఒ



మనతెలంగాణ/హైదరాబాద్ : ఎస్‌టిల రిజర్వేషన్ పెంపు జిఒను వెంటనే జారీ చేయాలని మాజీ ఎంపి రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ నేతలతో కలిసి శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో గిరిజనుల దుర్బర పరిస్థితులను తెలుసుకుని హైకోర్టు కూడా జిఒ(విత్ రెస్ట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ జిఒ) విడుదల చేయాలని ప్రభుత్వానికి సూచించిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో గిరిజనుల రిజర్వేషన్లను 6.6శాతం నుంచి పదిశాతానికి పెంచుతూ రూపొందించిన బిల్లును మైనార్టీ రిజర్వేషన్ల పెంపు బిల్లుతో కలిపి కేంద్రానికి పంపించారన్నారు. కేంద్రం విభేదిస్తున్న మైనార్టీ రిజర్వేషన్ల బిల్లుతో ఎస్‌టిల రిజర్వేషన్ల పెంపు బిల్లును పంపించాల్సిన అవసరం లేదన్నారు. ఇలా పంపడం వల్ల రాష్ట్రంలో గిరిజనులు గత నాలుగేళ్లుగా అన్యాయానికి గురవుతున్నారు. గోండు, కోయ, కొలాం తెగల గిరిజనులకు నిజంగా అన్యాయమే జరిగితే దానిని గుర్తించి నిర్ధారిస్తే వారికి స్పెషల్ ప్యాకేజితో సహా సూపర్‌న్యూమరి పోస్టులిచ్చి వారి అపోహలను తొలగించాలని ఆయన కోరారు. వారికి మంత్రి వర్గంలో స్థానంతో పాటు జిసిసి చైర్మన్, ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వాలన్నారు.

తమ్మిడిహట్టి నుంచి సుందిళ్లకు గ్రావిటీ కెనాల్



- త్వరలోనే ప్రభుత్వం చేతికి డిపిఆర్
- తుది మెరుగులు దిద్దుతున్న వ్యాప్కోస్

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రాణహిత నీటిని తమ్మిడిహట్టి నుంచి సుందిళ్ళ వరకు గ్రావిటీతో తరలించే మార్గంపై వ్యాప్కోస్ తయారు చేస్తున్న డిపిఆర్ ప్రక్రియ చివరి దశకు చేరింది. మరో నెల రోజుల్లో తుది మెరుగులు దిద్ది ప్రభుత్వానికి సమర్పించనుంది. ప్రాణహిత వద్ద నీరు సరిపడా లేకేపోవడంతో మేడిగడ్డ వద్ద బ్యారేజిని కడుతున్నా, ఎక్కువ వర్షం వచ్చినప్పుడు ఆ నీటిని వృధా పోనీయరాదన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ మార్గం అందుబాటులోకి వస్తే తక్కువ ఖర్చులో నీటి తరలింపు జరుగుతుంది. ఏడాదిన్నర క్రితం వ్యాప్కోస్ ఈ ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌పై సర్వే నిర్వహించినా డిపిఆర్‌ను సమర్పించడంలో ఆలస్యం కావడంతో రాష్ట్ర అధికారుల ఒత్తిడి మేరకు వ్యాప్కోస్ అధికారులు ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రాణహిత నుంచి నీటిని నేరుగా సుందిళ్ల బ్యారేజికి గ్రావిటీ కాలువ ద్వారా తరలిస్తే లిఫ్టు అవసరం ఉండదని వ్యాప్కోస్ గతంలోనే వ్యాఖ్యానించింది. ఇప్పటికే ప్రాణహిత నుంచి (పూర్వ ఆదిలాబాద్ జిల్లాలో) 2 లక్షల ఎకరాలకు నీరిచ్చేందుకు వీలుగా అలైన్‌మెంట్ సర్వే జరిగింది. రీడిజైనింగ్‌ను కేవలం ఆదిలాబాద్ జిల్లా వరకే పరిమితం చేసి, ఆయకట్టును పెంచి 2 లక్షల ఎకరాలకు నీరివ్వాలన్నది ప్రధాన ఉద్దేశం. ఈ ప్రత్యామ్నాయం ప్రకారం ప్రాణహితకు వచ్చే మెరుపు వరద నీటిని సుందిళ్ల వరకు తీసుకువెళ్లేందుకు పాత కాలువలను కొంత పొడిగించాల్సి ఉంటుంది. మధ్యలో 10 నుంచి 15 మీటర్ల మేర నీటిని లిఫ్టు చేసే ఏర్పాట్లు చేస్తే జైపూర్ వాగు ద్వారా సుందిళ్ల వరకు చేరుకుంటాయి. ఈ వాగుకు, ప్రాణహిత మెయిన్ కెనాల్‌కు లింకు కలిపే యత్నంలో వీలైనంత మేర లిఫ్టు అవసరం లేకుండా వ్యాప్కోస్ తన డిపిఆర్‌లో ప్రత్యామ్నాయాన్ని సూచించినట్లు తెలిసింది. 74 మీటర్ల లిఫ్టు చేయడం కంటే పదో, పదిహేను మీటర్లో లిఫ్టు చేస్తే ఆ మేర ప్రభుత్వానికి కూడా భారం తగ్గుతుందని నిపుణులు అంటున్నారు.

స్థానిక ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం చేస్తామని ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశం గౌడ్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో భేటీ అయి గ్రామాల, మండల, జిల్లా పరిషత్‌ల ఆర్థిక స్థితిగతులపై చర్చించారు. వాటి పరిస్థితులు మెరుగుపడడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల బలోపేతానికి అవలంబించాల్సిన విధానాలపై ప్రభుత్వానికి తగు సూచనలు చేస్తామని చెప్పారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లాపరిషత్‌ల వారీగా ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై రాష్ట్రమంతటా పర్యటించి తెలుసుకుంటామన్నారు. ప్రతి మండలంలో కొన్ని గ్రామపంచాయతీలను ఎంపిక చేసి అక్కడికి వెళ్లి అధ్యయనం చేస్తామన్నారు.

ఎంసెట్ ద్వారానే బిఎస్‌సి(ఫారెస్ట్రీ)

మనతెలంగాణ/హైదరాబాద్ : బిఎస్‌సి(ఫారెస్ట్రీ) కోర్సుకు కూడా ఎంసెట్ ద్వారానే ప్రవేశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎంసెట్ నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులకు మాత్రమే ఎంసెట్ వర్తిస్తుండగా తాజా ప్రభుత్వ ఉత్తర్వులతో బిఎస్‌సి(ఫారెస్ట్రీ) కోర్సుకు కూడా ఇదే ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. బాటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మ్యాథమెటిక్స్, బాటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో 10+2 విధానంలో ఇంటర్మీడియేట్ లేదా తత్సమాన విద్య పూర్తి చేసిన వారు లేదా చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నాలుగేళ్ల బిఎస్‌సి(ఫారెస్ట్రీ) కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ నాటికి 17 ఏళ్ల పూర్తి చేసుకుని 22 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. ఎస్‌సి, ఎస్‌టిలకు గరిష్ట వయో పరిమితి 25 ఏళ్లు.

ఎస్‌సి సబ్‌ప్లాన్‌కు రూ.21.68 కోట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : షెడ్యూలు కులాల సబ్‌ప్లాన్‌కు రూ.21.68 కోట్ల మేర కేంద్ర సాయాన్ని మంజూరు చేస్తూ ఎస్‌సి అభివృద్ధి శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017–18 బడ్జెట్ ప్రొవిజన్ సబ్‌ప్లాన్‌కు కేంద్రసహాయం కింద ఈ నిధుల్ని మంజూరు చేసింది. ఈ నిధులను డ్రా చేసి తెలంగాణ ఎస్‌సి కొ ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జమ చేసే అధికారాన్ని అసిస్టెంట్ అకౌంట్ అధికారికి ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కేంద్రం విడుదల చేసిన ఈ ప్రత్యేక సహాయం వినియోగానికి సంబంధించిన వివరాలను నిర్ణీత నమూనా ప్రకారం ప్రతి మూడు నెలలు ముగిసిన తర్వాత 15 రోజుల్లో కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖకు పంపించాల్సి ఉంటుంది. యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, ఎంతమంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూరింది, వినియోగించిన నిధుల వివరాలు, ఖర్చు చేయకుండా మిగిలిన సొమ్ము తదితరాలను పథకం వారిగా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సైనస్ బాధితులకు ఉచిత ఆపరేషన్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా రాష్ట్రంలో సైనస్ వ్యాధి తీవ్ర రూపం దాలుస్తోందని, చాలా మందికి ఈ వ్యాధిపట్ల అవగాహన లేకపోవడంతో ముదిరిన తర్వాత డాక్టర్లను సంప్రదిస్తున్నారని 'మా' ఇఎన్‌టీ ఆసుపత్రి డాక్టర్ మేఘనాథ్ తెలిపారు. వ్యాధి నివారణ కోసం ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నామని, ఇందుకోసం అవగాహన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. మూడు రోజుల అవగాహన కార్యక్రమాల అనంతరం ఉచితంగా అపరేషన్లు చేయనున్నామన్నారు. మార్చి రెండవ నుంచి ఏడవ తేదీ వరకు ఈ ఉచిత ఆపరేషన్లు ఉంటాయని తెలిపారు. సకాలంలో ఈ వ్యాధికి చికిత్స చేయకుంటే ప్రాణాపాయ స్థితికి లోనయ్యే ప్రమాదం కూడా ఉందన్నారు.

ఉర్దూ డిగ్రీ పుస్తకాల విడుదల

మన తెలంగాణ / హైదరాబాద్ : ఉర్దూ మీడియం డిగ్రీ పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో విడుదల చేశారు. బిఎ రెండో సంవత్సరం ఉర్దూ మీడియం హిస్టరి సబ్జెక్టుకు సంబంధించిన ఈ పుస్తకాలను నాంపల్లి ప్రభుత్వ డిగ్రీకాలేజీ అధ్యాపకురాలు డాక్టర్ సమీనా బషీర్ రాశారు. గత సంవత్సరం బిఎ హిస్టరి మొదటి సంవత్సరం పుస్తకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ సంవత్సరం రెండో సంవత్సరం పుస్తకాలు విడుదల చేశాఉరు. ఈ సందర్భంగా మంత్రి కడియం శ్రీ హరి మాట్లాడుతూ ఉర్దూ మీడియంకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని ఆయన ఆకాక్షించారు. పుస్తక రయచిత ను ఈ సందర్భంగా కడియం అభినందించారు.

నిరుద్యోగ భృతి?

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన సమీక్ష సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. నిరుద్యోగులకు స్పష్టమైన నిర్వచనం ఇవ్వడంతో పాటు వారిని గుర్తించడానికి అవసరమైన మార్గదర్శకాలను, విధివిధానాలను రూపొందించడంపై ముసాయిదాను తయారుచేయాల్సిందిగా సూచించినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఎంత మంది నిరుద్యోగులు ఉన్నారు, వారికి ప్రతీ నెలా ఎంత వరకు భృతి ఇవ్వవచ్చు, రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మేరకు ఆర్థిక భారం పడే అవకాశం ఉంది తదితరాలన్నింటినీ ఆ నివేదికలో పొందుపర్చాల్సిందిగా సూచించినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఈ ఆలోచన ప్రాథమిక దశలోనే ఉన్నప్పటికీ అధికారుల నుంచి నివేదిక అందిన తర్వాత స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అన్ని సెక్షన్ల ప్రజలను ఏదో ఒక పథకం రూపంలో ప్రభుత్వం చేరువైనా నిరుద్యోగుల విషయంలో ఉన్న అసంతృప్తిని తొలగించే ఉద్దేశంతో 'భృతి' రూపంలో ఒక పథకాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది. అన్ని జిల్లాల నుంచి వివరాలు తెప్పించుకోవడంతో పాటు సమగ్ర కుటుంబ సర్వేలోని వివరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తోంది. చదువుతో పాటు వయసును కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలతో సహా ఎక్కడా ఏ పనీ చేయకుండా ఉండడం, 'పే రోల్స్', ప్రావిడెంట్ ఫండ్ లాంటి వాటిల్లో పేర్లు నమోదు కాకుండా ఉండడం, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లబ్ది పొందకుండా ఉండడం... ఇలా కొన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రం మొత్తం మీద సుమారు పదిహేను లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా వేస్తున్న అధికారులు నెలకు రెండు వేల రూపాయల చొప్పున భృతి కల్పించినట్లయితే ప్రతీ నెలా ప్రభుత్వంపై సుమారు రూ. 3000 కోట్ల మేరకు భారం పడవచ్చని ప్రాథమిక అంచనా. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నెలకు రూ. 3000 చొప్పున నిరుద్యోగ భృతి కల్పించనున్నట్లు హామీ ఇచ్చింది. ఆ పార్టీకి హామీకి తగ్గకుండా ఉండాలని అధికార పార్టీ భావించినట్లయితే ఈ భారం మరో రూ. 1500 కోట్ల మేరకు పెరిగే అవకాశం ఉంది. బడ్జెట్ తయారీ పనులు దాదాపు ప్రారంభమైన నేపథ్యంలో తుదిరూపు ఇవ్వడానికి ముందుగానే దీనిపై ప్రభుత్వం ఒక స్పష్టతకు వచ్చి ఆ మేరకు నిధుల కేటాయింపు చేయాలని భావిస్తోంది. ఎలాగూ రానున్నది 'సంక్షేమ బడ్జెట్' అని స్వయంగా ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించినందున నిరుద్యోగ భృతికి కూడా చోటు లభించే అవకాశం ఉంది.

ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి

చాడ వెంకటరెడ్డి డిమాండ్



మన తెలంగాణ / హైదరాబాద్ : ఎస్‌సి వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్ళి సమస్యలపై ప్రధానితో మాట్లాడుతున్న సిఎం కెసిఆర్ ఎస్‌సి వర్గీకరణపై ఎందుకు మాట్లాడడం లేదని, అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్ళడంలో ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. గత 24 ఏళ్లుగా ఎస్‌సి వర్గీకరణ కోసం ఉద్యమం జరుగుతోందని, దాదాపు అన్ని పార్టీలు అంగీకరించడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానాన్ని కూడా ఆమోదించాయని, అయినా అభ్యంతరమేంటని ప్రశ్నించారు. మఖ్దుంభవన్‌లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్‌లతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చాడ మాట్లాడారు. ఎస్‌సి వర్గీకరణ డిమాండ్‌కు, ఇందుకోసం ఎంఆర్‌పిఎస్ మార్చి 13న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతును ఇస్తుందని చాడ ప్రకటించారు. ఎస్‌సి వర్గీకరణపై సిఎం కెసిఆర్‌కు లేఖ రాసినా ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఎంఆర్‌పిఎస్ నాయకురాలు భారతి మృతితో అయినా ప్రభుత్వం కళ్ళు తెరవడం లేదన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఎస్‌సి వర్గీకరణపై జాతీయ స్థాయిలో అన్ని పార్టీలతో సమన్వయం చేస్తున్నారని తెలిపారు.
వ్యవసాయ సంక్షోభంపై మార్చ్‌లో ప్రత్యక్ష ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. రైతు సమన్వయ సమితిలు టిఆర్‌ఎస్ కార్యకర్తల సమితులుగా మారాయని, వాటిని బలవంతంగా రైతులపై రుద్దుతున్నారని, ఇది తప్పుడు ఆలోచన అని ఆయన విమర్శించారు. రైతు సమన్వయ సమితుల పేరుతో టిఆర్‌ఎస్ అధికారాన్ని, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.4 వేల పెట్టుబడి సహాయం ఏమైందని ఆయన ప్రశ్నించారు. రుణాలు రీషెడ్యూల్ చేసిన రైతులకు కూడా రుణ మాఫీ వర్తింపజేయాలని, రుణాలపై వడ్డీని కూడా ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు.

బంద్‌కు మద్దతు కోరిన మందకృష్ణ

ఎస్‌సి వర్గీకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు మార్చి 13న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డిని కోరారు. మంద కృష్ణ మఖ్దుంభవన్‌లో శుక్రవారం చాడను కలిసి వర్గీకరణ కోసం ఎంఆర్‌పిఎస్ చేపడుతున్న ఉద్యమాన్ని వివరించారు.

అప్రూవర్ అవుతా

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖలో పేర్కొన్నారు. తనను చంపడానికి ప్రయత్నం చేస్తున్నారని, తెలుగుదేశం పార్టీతో పాటు టిఆర్ఎస్ పార్టీ కూడా వేధింపులకు గురి చేస్తున్నాయని, ఈ కేసు విచారణలో భాగంగా తన వాదన కూడా వినాలని, తక్షణమే ఈ కేసులో తాను అప్రూవర్‌గా మారడానికి అవకాశం ఇవ్వాలని ఆ లేఖలో మత్తయ్య పేర్కొన్నారు. తన దగ్గర ఉన్న కొన్ని కీలకమైన వాస్తవాలు బయటకి చెప్పే అవకాశాన్ని కల్పించాలని కోరారు. పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కును కాపాడాలని కోరారు. అసలు ఓటుకు నోటు కేసుతో తనకు సంబంధమే లేదని, తనను ఉపయోగించుకొని చంద్రబాబుని ఇరికించాలని చూశారని వ్యాఖ్యానించారు. క్రిస్టియన్స్ సమస్యలపైనే తాను స్టీఫెన్‌సన్‌ని కలిశానని వెల్లడించారు. కేసు హైకోర్టులో విచారణలో ఉన్న సమయంలో తెలుగుదేశం పార్టీ తనకు సహకరించిందని, కానీ సుప్రీంకోర్టులో అలాంటి సహకారం లేదని వాపోయారు.
తన కుటుంబానికి ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. కోర్టు విచారణకు హాజరుకాకుంటే వారెంట్ జారీ అవుతుందని, ఆ తరువాత అరెస్టు చేసే భయం కూడా ఉందని మత్తయ్య తన ఆవేదనను వ్యక్తంచేశారు.
ఈ కేసులో తనను కుట్ర ప్రకారమే ఇరికించారని పేర్కొన్నారు. సాక్షులుగా ఒకే వర్గంవారు ఉండడంతో కేసు నీరుగారే పరిస్థితి ఉంటుందనే ఉద్దేశ్యంతో తనను సాక్షిగా ఇరికించినట్లు ఎసిబి అధికారి స్వయంగా తనతో చెప్పారని వెల్లడించారు. తనకి కేటిఆర్ ఫోన్ చేసిన సమయంలో ఆయన్ని ఇరికించాలని ఎపి ప్రభుత్వం చూసిందని ఆరోపించారు.

రాజ్యసభకు సంతన్న?

(మొదటిపేజీ తరువాయి)

సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన కెసిఆర్ ఆమరణ దీక్ష సందర్భంగా ఆయన అధినేత వెన్నంటే ఉన్నారు. దశాబ్దానికి పైగా సిఎం కెసిఆర్ వెంటే ఉన్నప్పటికీ ఎప్పుడూ తెరవెనక ఉండేందుకే ప్రాధాన్యతనిచ్చేవారు. పార్టీలో ఎందరో ఉద్యమకారులకు పదవులు రావడంలో ముఖ్యపాత్ర పోషించిన సంతన్నను ఏదైనా ప్రాధాన్యత కలిగిన పదవిలో చూడాలని కార్యకర్తలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో వచ్చే పార్లమెంటు సాధారణ ఎన్నికల ముందు, తరువాత ఢిల్లీలో చోటు చేసుకునే పరిణామాలు ఎప్పటికప్పుడు అధినేత దృష్టికి తీసుకువచ్చేందుకు ఒక నమ్మకమైన వ్యక్తి కూడా అవసరమని, ఆ పాత్రను నెరవేర్చేందుకు సంతోష్‌ను రాజ్యసభకు పంపడం సమంజసంగా ఉంటుందని టిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సైతం అభిప్రాయపడుతున్నారు. మూడు సీట్లలో రెండింటిని వెనుకబడిన తరగతుల(బిసి) అభ్యర్థులకు కేటాయించాలని టిఆర్‌ఎస్ భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒక రాజ్యసభ సీటును యాదవులకు కేటాయిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. యాదవుల నుండి మాజీ ఎంఎల్‌ఎలు నోముల నర్సింహయ్య, జైపాల్ యాదవ్, గొర్రెల, మేకల పెంపకందారుల ఫెడరేషన్ చైర్మన్ కన్నెబోయిన యాదవ్‌ల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మరో స్థానానికి ముదిరాజ్‌కు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. అదే సమయంలో మైనారిటీల పేర్లు కూడా సిఎం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

రిటైరయ్యేది వీరే

తెలంగాణ నుండి ఖాళీ అయ్యే స్థానాల్లో రాపోలు ఆనంద్ భాస్కర్, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి (కాంగ్రెస్), సి.ఎం.రమేశ్(టిడిపి) ఉన్నారు. ఇందులో పాల్వాయి గత ఏడాది మరణించినప్పటికీ ఎన్నికలు నిర్వహించలేదు. ఎపి నుండి రిటరయ్యే ముగ్గురిలో టి.దేవేందర్‌గౌడ్(టిడిపి), రేణుక చౌదరి , చిరంజీవి(కాంగ్రెస్)లు ఉన్నారు. రెండు రాష్ట్రాల నుండి రిటైరవుతున్న ఆరుగురిలో నలుగురు తెలంగాణకు చెందిన వారే కావడం విశేషం. మన రాష్ట్రం నుండి రాజ్యసభకు ఎన్నిక కావాలంటే ఒక్కో అభ్యర్థికి 31 ఓట్లు అవసరమవుతాయి. మూడు స్థానాలు గెలుచుకోవాలంటే 93 ప్రస్తుతం టిఆర్‌ఎస్‌కు అధికారికంగా 82 మంది ఎంఎల్‌ఏలు, ఇతర పార్టీల నుండి చేరిన మరో 8 మందిని కలుపుకొని 90 మంది ఎంఎల్‌ఏలు ఉన్నారు. ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఎంఐఎంకు ఏడుగురు ఎంఎల్‌ఏలను కలుపుకొని మొత్తం 97 మంది మద్దతుంది. మిగిలిన ఏ పార్టీకీ (విపక్ష పార్టీలు కలిసినా) స్వంతంగా రాజ్యసభ సభ్యుడ్ని గెలిపించుకునేంత సంఖ్యాబలం లేదు. ప్రస్తుతం రాజ్యసభలో ముగ్గురు సభ్యులున్న టిఆర్‌ఎస్ బలం రెట్టింపై ఆరుగురికి చేరుకోనుంది.

నిదానంగా..నిర్దుష్టంగా

(మొదటిపేజీ తరువాయి)

యజమానులను గుర్తించడం, వివరాలను పరిశీలించడం, వ్యవసాయేతర భూముల వివరాలను నమోదుచేయడం లాంటి పనులన్నీ చేయడానికి కొంత సమయం పడుతుంది కాబట్టి పాస్ పుస్తకాల తయారీ పక్కాగా జరిగిన తర్వాతే పంపిణీ కార్యక్రమం చేపట్టాలి' అని సిఎం స్పష్టం చేసినట్లు ఆ ప్రకటన పేర్కొనింది. వ్యవసాయ భూమి కలిగిన రైతుకు అదే గ్రామంలో వ్యవసాయేతర భూమి ఉన్నట్లయితే ఆ వివరాలను కూడా పాస్‌బుక్‌లో నమోదు చేయాలని, ఇందుకోసం అదనంగా ఒక కాలమ్‌ని పెట్టాలని ఆదేశించారు. ప్రతి రైతు ఆధార్ నెంబర్‌ను పాస్‌బుక్‌కు అనుసంధానం చేయాలని, భూరికార్డులకు దీన్నిఅనుసంధానం చేయడానికి మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు కొన్ని జిల్లాల్లోని రైతులు ముందుకు రావడంలేదని, ఒకవేళ ఆధార్ నెంబర్ లేనట్లయితే ఆ భూముల్ని 'బినామీ ఆస్తు'లుగా గుర్తించాల్సి ఉంటుందని, ఇప్పటికైనా ఆ నెంబర్లను అధికారులకు ఇవ్వాలని స్పష్టంచేశారు. స్వంతభూమితో పాటు కొద్ది మంది రైతులు అసైన్డ్ భూముల్ని కూడా సాగుచేస్తున్నందున ఆ వివరాలను కూడా సేకరించాలని, కలెక్టర్లతో మాట్లాడి కచ్చితమైన వివరాలను తెప్పించాలని, వారికి కూడా పాస్‌బుక్‌లను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అసైన్డ్ భూములు కలిగినవారికి కూడా భూ యాజమాన్య హక్కులపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

కాళేశ్వరంపై పిటిషనర్‌కు మొట్టికాయలు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చారని పిటిషనర్‌ను కోర్టు ప్రశ్నించింది. తెలంగాణ ప్రభుత్వం తరపున మాజీ అటార్నీజనరల్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వాదనలో పసలేదని, ప్రాజెక్టుకు ప్రస్తుతం అన్ని అనుమతులు వచ్చాయని కోర్టుకు తెలిపారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సంజయ్ ఉపాధ్యాయ వాదనలు వినిపిస్తూ.. ప్రాజెక్ట్ అనుమతులపై తాము అభ్యంతరాలు తెలిపిన తరువాతనే, తెలంగాణ ప్రభుత్వం వేగంగా అనుమతులు సంపాదించిందని కోర్టుకు తెలిపారు. చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ లో పర్యావరణ నిపుణులు లేకపోవడం వల్ల, మహారాష్ట్ర కు ఈ ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధం ఉన్న కారణంగా ఢిల్లీ గ్రీన్ ట్రిబ్యునల్ ని ఆశ్రయించామని పేర్కొన్నారు. అయితే మీరు ఫోరం హంటింగ్ (అనుకూల తీర్పు కోసం న్యాయస్థానాలు మార్చడం) చేస్తున్నారా అంటూ పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దాఖలులోనే ఆలస్యం చేశారని, ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమయ్యి 9సంవత్సరాలు అయింది, మీకేమయినా అభ్యంతరాలు ఉంటే ఆరునెలల లోపు సంప్రదించాల్సిందని కోర్టు పేర్కొంది. సరియైన సమయంలో కోర్టును ఆశ్రయించామన్న పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలతో సుప్రీంకోర్టు ధర్మాసనం విభేదించింది. ఒక చోట మీరు వేసిన పిటీషన్ పై అనుకూలంగా తీర్పు రాకపోతే మరో చోటికి వస్తారా అంటూ పిటీషనర్ కి చురకలంటించింది. కేసు విచారణకు అర్థం కాదంటూ, పిటిషనర్ ఆలోచన సరిగా లేదంటూ కోర్టు తిరస్కరించింది.

కుటిల ప్రయత్నాలకు చెంపపెట్టు : హరీష్‌రావు

కాళేశ్వరం ప్రాజెక్టు పై దాఖలయిన పిటిషన్ పై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన వెంటనే నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కుటిల యత్నాలకు సుప్రీం తీర్పు చెంపపెట్టు అన్నారు. ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కాంగ్రెస్ 100 పైగా పిటిషన్లు వేసిందని గుర్తు చేశారు. పిటిషన్ల వెనుక ఎవరున్నది త్వరలో అసెంబ్లీలో బయటపెడతామన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పాకులాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది చివరి కల్లా కాళేశ్వరం నీటిని రైతులకు అందిస్తామన్నారు. శుక్రవారం సుప్రీంకోర్టులో జరిగిన విచారణను మంత్రి హరీష్ రావు ప్రత్యక్షంగా విన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశంలో 3 షిఫ్టుల్లో ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చేపడుతున్న ప్రభుత్వం తెలంగాణ మాత్రమేనని తెలిపారు. శుక్రవారం నాటి తీర్పుతో తెలంగాణ రైతుల కల సాకారం కానుందన్నారు. 2018 చివరికల్లా కాళేశ్వరం ఫలాలను రైతులకు అందిస్తామని స్పష్టం చేశారు.

రైతు సమితులకు సమన్వయకర్తలు

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్‌లకు జాబితా పంపగా వారు వ్యవసాయ శాఖకు పంపారు. సిఎం కె. చంద్రశేఖర్‌రావు జిల్లా సమితుల జాబితాలను వ్యవసాయ శాఖ నుంచి తెప్పించుకుని స్వయంగా పరిశీలించి మార్పులు చేర్పులు చేసి సమన్వయకర్తలను ఆయనే ఎంపిక చేశారు. సామాజిక వర్గాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా రైతు సమితుల సమన్వయకర్తలను నియమించినట్లు స్పష్టమౌతోంది. మొత్తం 30 జిల్లా రైతు సమన్వయ సమితి సమన్వయకర్తలలో ఒసిలు 14 మంది ఉండగా అందులో రెడ్డి వర్గం నుంచి 12 మంది, వెలమ నుంచి ఒకరు, కమ్మ సామాజిక వర్గం నుంచి ఒకరిని ఎంపిక చేశారు. బిసిలు 10 మంది ఉండగా అందులో పెరిక వర్గం నుంచి ముగ్గురు, మున్నూరు కాపు నుంచి ఇద్దరు, గౌడ వర్గం నుంచి ఒకరు, యాదవల నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గం నుంచి ముగ్గురి చొప్పున, మైనార్టీ వర్గం నుంచి ఒకరిని జిల్లా సమితి సమన్వయకర్తగా తీసుకున్నారు. ఈ విషయంలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు సూచించిన వారిని కూడా సిఎం పక్కన పెట్టినట్లు తెలిసింది. రాష్ట్ర రైతు సమన్వయ సమితికి ఛైర్మన్‌గా నామినేట్ అవుతారని భావిస్తున్న ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డి నల్లగొండ జిల్లా రైతు సమితికి పాశం రాంరెడ్డి, యడవెల్లి విజేందర్ రెడ్డి పేర్లను సూచించారు. వీరిద్దని కాదని సిఎం కెసిఆర్ ఎస్‌టి వర్గం నుంచి ఇ. రాంచందర్ నాయక్‌ని ఎంపిక చేశారు. కొంతమంది ప్రజాప్రతినిధులు రెండు, మూడు పేర్లను సూచించగా సిఎం సున్నితంగా తిరస్కరించి, ఆయన అనుకున్న వారికే అవకాశం కల్పించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

గుత్తానే చైర్మన్..!



తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితిని కంపెనీల చట్టం కింద రిజిస్టర్ చేసే ప్రక్రియను వ్యవసాయ శాఖ వేగవంతం చేసింది. రిజిస్ట్రేషన్ శుక్రవారం పూర్తవుతుందని తెలిసింది. అనంతరం సిఎం ఆదేశిస్తే గుత్తా సుఖేందర్ రెడ్డిని ఛైర్మన్‌గా నామినేట్ చేసినట్లు ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఏదైనా సాంకేతిక సమస్య వచ్చినట్లయితే ఈ నెల 25న రాజేంద్ర నగర్‌లో జరిగే ప్రాంతీయ రైతు సమన్వయ సమితి సదస్సులో సిఎం కెసిఆర్ గుత్తాను ఛైర్మన్‌గా ప్రకటిస్తారని తెలిసింది. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన ఈ కార్పొరేషన్‌లో 10 మంది రైతు ప్రతినిధులు ఉన్నారు. కార్పొరేషన్ రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత బై లాస్ రాసుకోనున్నారు. ఈ క్రమంలో రైతు ప్రతినిధుల సంఖ్య పెంచుకునే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

జిల్లా రైతు సమన్వయ సమితులకు ఎంపికైన కో ఆర్డినేటర్‌లు

జిల్లా	కో ఆర్డినేటర్ పేరు	కులం
జగిత్యాల	చీటి వెంకటరావు	ఒసి,వెలమ
సిరిసిల్ల	గడ్డం నర్సయ్యా	బిసి,మున్నూరు కాపు
పెద్దపల్లి	కోట రాంరెడ్డి	ఒసి, రెడ్డి
కరీంనగర్	గుండెల్లి తిరుపతి	బిసి, ముదిరాజ్
సిద్దిపేట	వి.నాగిరెడ్డి	ఒసి, రెడ్డి
మెదక్	టి.సోములు	బిసి, మున్నూరు కాపు
సంగారెడ్డి	వెంకటరాంరెడ్డి	ఒసి, రెడ్డి
ఆదిలాబాద్	అడ్డి భోజిరెడ్డి	ఒసి,రెడ్డి
మంచిర్యాల	యం.గురవయ్య	బిసి, పెరిక
ఆసిఫాబాద్	బసవత్ కార్ విశ్వనాద్	ఎస్‌సి
నిర్మల్	ఎన్.వెంకటరాంరెడ్డి	ఒసి, రెడ్డి
నిజామాబాద్	బనావత్ మంజుల	ఎస్‌టి, లంబాడ
కామారెడ్డి	డి.అంజిరెడ్డి	ఒసి, రెడ్డి
వరంగల్ అర్బన్	ఇ. లలితా యాదవ్	బిసి, యాదవ్
వరంగల్ రూరల్	బొల్లె బిక్షపతి	ఎస్‌సి
భూపాలపల్లి	పల్లా బుచ్చయ్యా	బిసి, పెరిక
మహబూబాబాద్	భూక్యా బాలజీ	ఎస్‌టి, లంబాడ
జనగాం	ఐ.రమణ రెడ్డి	ఒసి,రెడ్డి
ఖమ్మం	ఎన్. వెంకటేశ్వర్‌రావు	ఒసి, కమ్మ
కొత్తగూడెం	అంకిరెడ్డి కృష్ణారెడ్డి	ఒసి, రెడ్డి
నల్గొండ	ఈ.రాంచందర్ నాయక్	ఎస్‌టి, లంబాడ
యదాద్రి	కొల్పుల అమరేందర్	బిసి, ముదిరాజ్
సూర్యాపేట	ఎస్.ఎ.రజాక్	ముస్లిం, మైనార్టీ
మహబూబ్‌నగర్	ఎస్.బస్వరాజ్‌గౌడ్	బిసి, గౌడ్
నాగర్ కర్నూల్	పోకల మనోహర్	బిసి, పెరిక
గద్వాల	కె. వెంకటరాములు	బిసి, కురుమ
వనపర్తి	పి. జగదీశ్వర్‌రెడ్డి	ఒసి,రెడ్డి
రంగారెడ్డి	వంగేటి లక్ష్మారెడ్డి	ఒసి,రెడ్డి
వికారాబాద్	కె.మహేష్ రెడ్డి	ఒసి,రెడ్డి
మేడ్చల్	నారెడ్డి నందారెడ్డి	ఒసి,రెడ్డి



మెట్రోరైలులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

మన తెలంగాణ/అమీర్‌పేట : హైదరాబాద్ మెట్రోరైలు విభాగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని వందమంది నుండి కోటిన్నర డబ్బులు దండుకుని మోసం చేసిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాజేందర్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రవిచంద్ర అలియాస్ రవివర్మ, ఆశాలత అలియాస్ అమృత అమీర్‌పేట ఈస్ట్ శ్రీనివాస్ కాలనీలో ఏషియన్ బ్రైట్ కేరియర్ కన్సల్టెన్సీ పేరుతో సంస్థను నెలకొల్పారు. మెట్రో రైల్లో టికెట్ కౌంటర్, ట్రాక్ ఇన్‌చార్జి, అసోసియేట్, ఇంటిగ్రేట్ అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని అనేకమందిని నమ్మించారు. వారి మాటలు నిమ్మ 2016లో ఒకొక్కరి నుండి లక్ష నుండి 2 లక్షల వరకు డబ్బులు వసూలు చేశారు. ఈ విధంగా దాదాపు వంద మందికి పైగా యువకుల నుండి డబ్బులు తీసుకుని ఉద్యోగాల విషయంలో మాయ మాటలు చెపుతూ వచ్చారు. మెట్రోరైలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా వారికి రావలసిన ఉద్యోగాలు రాకపోవడంతో కొందరు బాధితులు గట్టిగా నిలదీశారు. దీంతో చెల్లించిన డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పారు. వారు ఇస్తామన్న సమయానికి డబ్బులు ఇవ్వక పోవడంతో వారిని మరోసారి కలిసి నిలదీయగా చెల్లించవలసిన జాబితాలో మీపేరు లేవని, మీరు చెల్లించిన డబ్బులు మధ్య వర్తులైన విజేత్‌రెడ్డి, అనితారెడ్డిలకు ఇచ్చామని వారిని అడగండి అంటూ చెప్పడంతో బాధితులు నలుగురు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుట్కా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

మన తెలంగాణ/హైదరాబాద్ / కార్వాన్ : నిషేధిత గుట్కా తయారీ కేంద్రంపై టప్పాచబుత్ర పోలీసులు చేసి నిందితుడిని అరెస్టు చేసి పెద్ద మొత్తంలో గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. కుమ్మరివాడి ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ లతీఫ్ (50) ఇంట్లో నిషేధిత గుట్కా తయారు చేస్తున్నాడన్న సమాచారంలో ఎస్ఐ ఎం.సాయికుమార్ సిబ్బందితో కలిసి గురువారం రాత్రి దాడి నిర్వహించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి 16 గుట్కా బస్తాలు, 2 టొబాకో బస్తాలు, 2 గుట్కా ప్యాకింగ్ యంత్రాలు, సాగర్ గుట్కా బస్తా, ఎండిఎం గుట్కా బస్తా, 2 బాబా 120 టొబాకో లేబుల్ రోల్స్, జర్దా బస్తా, స్వాగత్ గోల్డ్ జర్దా బస్తా, ఒక బ్లూ బుల్ జర్దా బస్తా, 8 రాజిగందా లేబుల్ రోల్స్, 20 ఆర్ఆర్ గుట్కా లేబుల్ రోల్స్, 10ఖాళీ ప్యాకింగ్ కవర్లు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన నిందితుడిని శుక్రవారం కోర్టుకు రిమాండ్ చేశారు.

అప్పుల బాధతో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి, చావుబతుకుల మధ్య భార్య



మన తెలంగాణ / రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : అప్పుల బాధ కుటుంబంలో విషాదాన్ని నింపింది. నమ్ముకున్న వ్యవసాయం కలసిరాక పెట్టుబడి కోసం చేసిన అప్పులు రోజు రోజుకు పెరుగుతుండటంతో ఆందోళన చెందిన రైతు దంపతులు బలవన్మరణానికి ప్రయత్నించగా భర్త మృతి చెందగా భార్య చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. మొయి నాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో చోటు చేసుకున్న సంఘటన తీవ్ర విషాదం నింపింది. గ్రామానికి చెందిన ఆలూరి శ్రీశైలం (45), ఆలూరి సావిత్రి (38) భార్య, భర్తలు వారికి కూతురు కల్పన, కుమారుడు ప్రవీణ్ కుమార్ ఉన్నారు. గత సంవత్సరం కూతురు కల్పన పెళ్లికి సైతం అప్పులు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు మూడు లక్షలకు పైగా అప్పులు కావడం, తీసుకున్న అప్పులు ఎలా తీర్చాలన్న దానిపై భార్య, భర్తల మధ్య ఇటీవల గొడవ జరిగింది. అప్పులబాధతో జీవితంపై విరక్తి చెంది గురువారం అర్ధరాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకుని భార్య, భర్తలు ఇద్దరు నిప్పంటించుకున్నారు. ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా శుక్రవారం ఉదయం భర్త శ్రీశైలం మృతి చెందారు. సావిత్రి పరిస్థితి విషమంగానే ఉంది. శ్రీశైలం సోదరుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.23.39 లక్షలు



మన తెలంగాణ/నార్కట్‌పల్లి : (నల్లగొండ జిల్లా) చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంకు భక్తులు విచ్చేసి దేవుడికి సమర్పించిన కానుకల హుండీలను శుక్రవారం నాడు ఆలయ సిబ్బంది లెక్కించగా గట్టుకింద్ర శ్రీ అమ్మవారి ఆలయ హుండీ రూ.6,38,259, గట్టుపైన శ్రీ స్వామివారి హుండీ ఆదాయం 21 రోజులకు గాను రూ. 17,00,365 మొత్తం రూ.23,39,624 దేవాలయానికి వచ్చినట్టు దేవాలయ చైర్మన్ నల్ల వెంకన్న, ఆలయ కార్య నిర్వాహక అధికారి సైకం అంజనారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి రామరావు, ఆలయ ధర్మ కర్తలు బాల భిక్షం, మేకల వెంకట్‌రెడ్డి, రేగట్టే నర్సింహారెడ్డి, మర్రి నర్సింహ, గద్దె లతీఫ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డిఇ ఇళ్లపై రెండోరోజూ ఎసిబి దాడులు

మన తెలంగాణ/వరంగల్ క్రైం : ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న సమాచారంతో ఆదిలాబాద్ నగరపాలక సంస్థ డిఇ కొండల్‌రావు నివాసాలపై శుక్రవారం ఎసిబి దాడులు రెండవరోజు కొనసాగాయి. శివనగర్‌లోని కొండల్‌రావు ఇంటిపై ఏకకాలంలో గురువారం ఎసిబి అధికారులు ఆరుచోట్ల గురువారం దాడులు నిర్వహించగా శుక్రవారం రోజున శివనగర్‌లో నివాసాలతో పాటు కొండల్‌రావుకు చెందిన వివిధ బ్యాంకు లాకర్లలో ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండల్‌రావు లెక్కకు మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే సమాచారంతో ఆదిలాబాద్, కొత్తగూడెం, నగరంలోని గిర్మాజీపేట, శివనగర్, రెడ్డికాలనీ, శ్రీనివాసకాలనీ, కృష్ణాకాలనీలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు దాడులు నిర్వహించగా శుక్రవారం సైతం పెద్ద ఎత్తున కొండల్‌రావుకు సంబంధించిన ఆస్తులను గుర్తించారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, ఎస్‌బిహెచ్ బ్యాంకులలో లాకర్లను తెరువగా రూ.26 లక్షల నగదు, కిలో 390 గ్రాముల బంగారాన్ని ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు శుక్రవారం సాయం త్రం వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడుల్లో ఎసిబి డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్, వరంగల్ రేంజ్ డిఎస్పి సత్యనారాయణ, సిఐ వాసాల సతీష్, క్రాంతికుమార్, ఎసిబి సిఐ రమణమూర్తి, రామలింగారెడ్డి, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి పండ్ల (ట్రేల) గోదాంకు నిప్పు



మన తెలంగాణ/హయత్‌నగర్ : ప్రమాదవశాత్తు మామిడి పండ్ల (ట్రేల) గోదాంకు నిప్పంటుకుని పూర్తిగా ధ్వంసమైన సంఘటన హయత్‌నగర్ డివిజన్ ఆంధ్రాబ్యాంక్ కాలనీ పరిధిలో చోటు చేసుకుంది. హయత్‌నగర్ డివిజన్ ఆంధ్రాబ్యాంక్ కాలనీలో గత కొంత కాలంగా ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన షరీఫ్ మామిడి పండ్లను నిల్వ ఉంచడానికి సుమారు రూ.50లక్షల వ్యయం గల ట్రేలను గోదాంలో ఉంచాడు. శుక్రవారం ప్రమాదవశాత్తు గోదాంకు నిప్పంటుకోవడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి బాధితులను పరామర్శించారు.

గిట్టుబాటు ధర కోసం కదం తొక్కిన పసుపు రైతు



కలెక్టరేట్ వద్ద రైతుల ఆందోళన



రైతు ఆత్మహత్యాయత్నం



భైంసాలో కంది రైతుల ధర్నా

- జగిత్యాల కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా
- గేట్‌కు ఉరేసుకునేందుకు రైతు యత్నం

మన తెలంగాణ/జగిత్యాల : పసుపు పంటకు మద్దతు ధర కోసం రైతులు కదం తొక్కారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి పసుపు రైతులు శుక్రవారం జగిత్యాలకు తరలివచ్చి మహా ధర్నా నిర్వహించారు. ట్రాక్టర్లలో, ఎండ్ల బండ్లలో భారీగా తరలివచ్చిన రైతులు పాత బస్టాండ్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. మూడు గంటల పాటు కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించడంతో జగిత్యాల కరీంనగర్ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టౌన్ సిఐ ప్రకాష్ ఆధ్వర్యంలో రైతులకు నచ్చజెప్పాలని ఎంత ప్రయత్నించినా వారు ససేమిరా అంటూ కలెక్టర్ ప్రధాన ద్వారాన్ని ఎక్కి లోనికి చొరబడేందుకు యత్నించారు. ఓ సందర్భంలో రాజిరెడ్డి అనే రైతు మెడకు కండువాతో కలెక్టరేట్ గేటుకు ఉరి వేసుకునే ప్రయత్నం చేయగా తోటి రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఓ వైపు వర్షాభావ పరిస్థితులతో పంట విస్తీర్ణం తగ్గడంతో పాటు అకాల వర్షాలతో వరి ధాన్యానికి దోమపోటు సోకడం, మొక్కజొన్న ఇతర పంటలన్నీ నెలకొరిగి సగానికిపైగా దిగుబడి తగ్గిందన్నారు. ఖరీఫ్ పంట కోల్పోయి తీవ్ర నష్టాల్లో ఉన్న రైతుకు కనీసం వాణిజ్య పంట అయిన పసుపుకు సరైన ధర వస్తే కొంత ఉపశమనంగా ఉంటుందని భావించిన తమకు నిరాశే మిగిలిందన్నారు. నెల రోజుల క్రితం క్వింటాల్‌కు రూ.10వేల ఉన్న పసుపు ధర ప్రస్తుతం రూ.4 నుండి 5వేల వరకు మాత్రమే పలుకుతుందన్నారు. ఈ ధరతో కనీసం పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. పసుపు ఎకరానికి రూ.1లక్ష నుండి రూ.1లక్ష50వేల వరకు పెట్టుబడికి ఖర్చు అయ్యే పరిస్థితిలో కనీస మద్దతు ధర లేకపోవడంతో తాము దిక్కులేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపుకు కనీసం రూ.15వేలు మద్దతు ధర కల్పించి తమను ఆదుకోవాలని కోరారు. అదే విధంగా వరి ధాన్యానికి, మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ. 2500 మద్దతు ధర కల్పించినట్లయితే రైతుకు గిట్టుబాటు అవుతుందన్నారు. రైతులకు కనీస మద్దతు ధరను కల్పించి ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. ఈ ధర్నాకు జగిత్యాల మండలం లక్ష్మీ పూర్ అంతర్గాం, రాంపూర్, రాయికల్, సారంగాపూర్ మండలాల నుండి భారీ ఎత్తున రైతులు పాల్గొన్నారు.

భైంసాలో కంది రైతుల ఆందోళన

మన తెలంగాణ/ భైంసా: మార్క్‌ఫెడ్ కేంద్రంలో నిలువ ఉన్న తమ కందుల కొనుగోలును తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా భైంసా పట్టణంలో పెద్ద మొత్తంలో రైతులు శుక్రవారం రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఈ నెల 20వ తేదీ వరకు టోకెన్‌లు పొందిన రైతులు కందులను కేంద్రానికి తీసుకువచ్చినా అధికారులు కొనుగోలు చేపట్టడం లేదు. దీంతో రైతులు ఆగ్రహానికి గురై బస్టాండ్ దుట రోడ్డెక్కి రాస్తారోకో చేపట్టారు. దాదాపు గంటపాటు రాస్తారోకో చేయడంతో పెద్ద మొత్తంలో వాహనాలు నిలిచిపోయాయి. పట్టణ ప్రధాన రహదారి కావడంతో ప్రజలు ఇబ్బందులపాలయ్యారు. విషయం తెలుసుకున్న పట్టణ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ పున్నంచందర్‌లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కందుల కొనుగోలు కేంద్రానికి రైతులను తీసుకెళ్ళారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న మార్క్‌ఫెడ్ అధికారి కోటేశ్వర్‌రావ్ భైంసాకు చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ళు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు. రైతులు సహకరించాలని కోరారు. భైంసా పట్టణంలో రైతుల వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు ప్రతిసారి పరిహాసంగా మారుతుందని అన్నారు. గతంలో మినుముల కొనుగోళ్ళలో సైతం మార్క్‌ఫెడ్ అధికారుల తీరును ఎండగట్టి రైతులు పలుమార్లు రోడ్డెక్కారు.

కందుల దళారులను పట్టించిన టిజెఎసి


508 అక్రమ కందుల బస్తాలు సీజ్



మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి : నల్లగొండ వ్యవసాయ మార్కెట్‌లో దళారులకు సంబంధించిన 508 కంది బస్తాలను నల్లగొండ జెఎసి నాయకులు పట్టుకున్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ నల్లగొండ మార్కెట్ యార్డును సందర్శించి మార్కెట్‌కు వచ్చిన కందులను పరిశీలించారు.ఈసందర్భంగా మార్కెట్‌లోకి బినామీ పేర్లతో దళారులు అక్రమంగా చేరవేసిన కందుల బస్తాలను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హాకా అధికారులు బస్తాలన్నింటినీ పరిశీలించి 508 అక్రమ కందుల బస్తాలను గుర్తించారు. వీటిని వివిధ రైతుల పేరుతో రిజిస్ట్రర్‌లో నమోదు చేయించి విక్రయానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీనిపై హాకా అధికారు లు స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా నల్లగొండ ఆర్ఐ సందీప్‌కు మార్ దళారుల బస్తాలను సీజ్ చేశా రు. ఈసందర్భంగా జెఎసి జిల్లా కో కన్వీనర్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు మాట్లాడుతూ అక్రమ కందుల బస్తాల దగ్గరకు వెళ్లి పరిశీలించగా మొత్తం బస్తాలను దళారులు మార్కెట్ బయటనే తూకం వేసుకొని తెచ్చినట్టు తెలిసిందని, దీంతో వెంటనే ఈ విషయాన్ని మార్కెట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

సాక్షర భారత్‌లో భారీ కుంభకోణం : రూ.1.13 కోట్లు స్వాహా

మన తెలంగాణ/సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి సాక్షర భారత్‌లో భారీ కుంభకోణం బయటపడింది. రూ.1,13,74,000 గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు డిడిగా పనిచేసిన ఉషామార్త స్వర్ణలత స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రస్తుత డిడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళా సిబ్బందిపై సంగారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేంద్ర ప్రభుత్వం సాక్షర భారత్ పేరుతో వయోవృద్ధులకు అక్షరాలు దిద్దించి చదువు నేర్పించాలనే సదుద్దేశ్యంతో సాక్షర భారత్‌ను ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో విలేజ్ కోఆర్డినేటర్, మండలంలో మండల కోఆర్డినేటర్ (ఎంసిఓ)లను నిర్వహించి గ్రామాల్లో వయోజన విద్యా కార్యాలయంలో వయోవృద్ధులకు చదువును నేర్పించేందుకు ఏర్పాటు చేసింది. దీనిలో పనిచేసే విసిఓలకు ప్రతి నెల రూ.2వేలు, ఎంసివొలకు రూ.6వేలను వేతనాలుగా అందిస్తోంది. అందులో కొంతమంది సరిగ్గా పనిచేయడం లేదనే నెపంతో ఇతర ఖాతాలకు మళ్లించి డిడి ఉషామార్త స్వర్ణలతతో పాటు మరో ఇద్దరు అధికారిణిలు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఉమ్మడి జిల్లా నుండి వరంగల్ డిప్యూటేషన్ వేయగా అక్కడ సస్పెండ్‌కు గురయ్యారు. కాగా ఏప్రిల్ 2014 నుండి సెప్టెంబర్ 2016 వరకు విసిఓలు, ఎంసిఓలకు ఇచ్చే వేతనాలను ఇవ్వకుండా ఆడబ్బులను వేరే ఖాతాలోకి మళ్లించి స్వాహా చేశారు. ఈ మేరకు ప్రస్తుత డిడి రామేశ్వర్‌రావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు వివరాలను త్వరలో వెల్లడిస్తామని పట్టణ సిఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.



స్వర్ణలత

అన్ని గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు నడిపిస్తాం

- యాదాద్రిలో మరో డిపో నిర్మాణం : మంత్రి మహేందర్‌రెడ్డి

మన తెలంగాణ/యాదాద్రి : పేదల సంక్షేమం కోసం, ప్రజల సౌకర్యార్ధం ప్రతి గ్రామానికి పల్లె బస్సులు నడిపించేలా చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి లక్ష్మి నరసింహుని దర్శించుకున్న ఆయన యాదగరిరిగుట్ట డిపో ను సందర్శించి స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతతో కలిసి అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ గతంలో ఏ ప్రభుత్వంలో కేటా యించని విధంగా బడ్జెట్‌లో వెయ్యి కోట్లను కేటాయించి నూతన బస్సులను అందించి ఆర్టీసి అభివృద్ధి సంక్షే మానికి కృషి చేశాడన్నారు. కాగా ఆలయ అభివృద్ధిలో భాగంగా సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు 15 ఎకరాల స్థలంలో యాదాద్రికి నూతన డిపో ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న డిపో బస్టాండ్‌ను యధావిధిగా కొనసాగిస్తామన్నారు. ప్రభు త్వ విప్ గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ సుమలత, ఎంపిపి గడ్డమీది స్వప్న, జడ్‌పిటిసి కర్రె కమలమ్మ, ఆర్టీసి డిఎం రఘు పాల్గొన్నారు. .

కార్మిక హక్కులను హరిస్తే ఉద్యమిస్తాం

- రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి

మన తెలంగాణ /గోదావరిఖని : జాతీయ కార్మిక ఉద్యమాలకు పురిటిగడ్డగా రామగుండం పారిశ్రామిక ప్రాంతం అడ్డాగా చరిత్ర పుటల్లోకి ఎక్కిందని తెలంగాణ హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం రామగుండం రైల్వేస్టేషన్ ఆవరణలోని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఏర్పాటు చేసిన 2018 పాకెట్ డైరీ ఆవిష్కర ణ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా హాజరైన బహిరంగ సభలో నాయిని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ వారి హక్కులను కాలరాస్తున్నదని ఆరోపించారు. వ్యతిరేక విధానాలపై హెచ్ఎంఎస్ పక్షాన అనేక పోరాటాలు చేసి ఆపుతున్నామని, రైల్వే మజ్దూర్ యూనియన్ ను స్థాపించి పర్మినెంట్ కార్మికులకు, కాంట్రాక్టు కార్మికుల పక్షాన నిలుస్తూ వారి హక్కులను కాపాడుకుంటున్నామని తెలిపారు. రైల్వే కార్మికుల హక్కులను హరిస్తే రైల్వే శాఖను నిర్వీర్యం చేస్తే అగ్నిగుండంలా ఉద్యమాన్ని ఉవ్వెత్తున చూపిస్తామని అన్నారు. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం రైల్వేను ప్రైవేటు పరం చేసేందుకు సన్నాహాలు చేస్తుందని అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ వీరోచిత పోరాటాలకు సిద్ధంగా ఉందని అన్నారు. రామగుండం మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ యాదవ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ రైల్వే జనరల్ సెక్రటరీ డా. సిహెచ్. శంకర్ రావు, ఎం. రామారావు, రవీందర్, శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం యూనియన్ నాయకులు హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డిని గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

బహిరంగ ప్రకటన

ఇందుకు సంబంధించిన వారందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా డా॥ మహ్మద్ అహ్మద్ అలీ ఖాన్ సంస్థ యొక్క భాగస్వామిగా భారతీయ భాగస్వామ్య చట్టం 1932 యొక్క సెక్షన్ 33 క్రింద తొలగించబడినారు. 18-01-2018 నుండి వర్తించు విధంగా సంస్థతో అతనికి ఎటువంటి అనుబంధం లేదు మరియు సంస్థ తరపున మరియు కొరకు ఏవిధమైన వ్యాపార లావాదేవీ నిర్వర్తించుటకు లేదా ఎవరి నుండైనా డబ్బు స్వీకరించుటకు లేదా మరేవిధంగానైనా వ్యవహరించుటకు అతనికి ఎటువంటి అధికారం లేదు.
అతనితో ఎవరైన ఏవిధంగానైనా వ్యవహరిస్తే అది వారి స్వంత బాధ్యతపై చేయుచున్నట్లుగా భావించబడుతుంది మరియు దానికి సంస్థ ఎటువంటి బాధ్యత వహించదని దయచేసి గమనించవలెను.

కాంటీ మెడికల్ & జనరల్ స్టోర్స్ కొరకు
ప్రదేశం: హైదరాబాద్ సం/- డా॥ అల్తాఫ్ వసీమ్
తేది: ఫిబ్రవరి 23, 2018. భాగస్వామి

బహిరంగ ప్రకటన

ఇందుకు సంబంధించిన వారందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీమతి ఎర్మీరా సిద్ధిఖి సంస్థ యొక్క భాగస్వామిగా భారతీయ భాగస్వామ్య చట్టం 1932 యొక్క సెక్షన్ 33 క్రింద తొలగించబడినారు. 18-01-2018 నుండి వర్తించు విధంగా సంస్థతో ఆమెకు ఎటువంటి అనుబంధం లేదు మరియు సంస్థ తరపున మరియు కొరకు ఏవిధమైన వ్యాపార లావాదేవీ నిర్వర్తించుటకు లేదా ఎవరి నుండైనా డబ్బు స్వీకరించుటకు లేదా మరేవిధంగానైనా వ్యవహరించుటకు ఆమెకు ఎటువంటి అధికారం లేదు.
ఆమెతో ఎవరైన ఏవిధంగానైనా వ్యవహరిస్తే అది వారి స్వంత బాధ్యతపై చేయుచున్నట్లుగా భావించబడుతుంది మరియు దానికి సంస్థ ఎటువంటి బాధ్యత వహించదని దయచేసి గమనించవలెను.

కాంటీ మెడికల్ & జనరల్ స్టోర్స్ కొరకు
ప్రదేశం: హైదరాబాద్ సం/- డా॥ అల్తాఫ్ వసీమ్
తేది: ఫిబ్రవరి 23, 2018. భాగస్వామి

O/o THE SUPERINTENDING ENGINEER
TELANGANA STATE EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION: HYDERABAD.
e-procurement Notice
Short Tender Notice No. SE/TSEWIDC/HYD/NIT/1091 to 1095/2017-18, Dt. 22.02.2018
Tenders are invited from all eligible contractors for 1) Providing Lecturer Halls, Computer Room etc., in 3rd Floor & Dining Hall in Ground Floor of SIEMAT Building in SCERT Premises (117.00) 2) R&M to Govt. BCBH at Musheerabad and Balkampet at Mahendra Hills (22.85) 3) C/o (Toilet Block & Bath Rooms) T.S. Residential School (Girls) at NRR Puram Site-III Borabanda (31.00) 4) C/o of Toilet Blocks in Govt. City College, Nayapur (13.00) 5) C/o Hall for TSKC Lab & GDC, Khairatabad (11.00) in Hyderabad District.
Sl.no. 1 to 3 (2nd call) & 4 & 5 (3rd call)
Last date for submission and receipt Bid in online : 02.03.2018 upto 5.00 PM
Note: Price Adjustment is applicable only as per GO Ms.No.94 of Transport, Roads & Buildings (R.1) Dept., dt. 16.04.08 i.e., only for steel & Cement.
For full details can be viewed at https://tender.telangana.gov.in or contact in person at the office of the Superintending Engineer, TSEWIDC, 3rd Block, 4th Floor, Rajiv Vidya Mission Building, SCERT Compound, Opp: E-Gate, LB Stadium, Hyderabad. Phone No. 23326692
Sd/- Superintending Engineer,
TSEWIDC, Hyderabad

BEFORE THE DEBTS RECOVERY 'TRIBUNAL-2
TRIVENY COMPLEX, ABIDS
AT: HYDERABAD
O.A.No.3805 of 2017
BETWEEN
M/s. Canara Bank, SME Branch, Kukatpally, Hyderabad. .... Applicant
And
Sri G. Ramanjaneya Raju . .... Respondent
To
Sri G. Ramanjaneya Raju Flat No.104, 1st Floor, Block-A Raghava Estate, IDA Jeedimetla Quthbullapur Mandal Medchal-Malkajgiri District. .... Respondent
Whereas the above applicant filed the Original Application against you for recovery of a sum of Rs.26,37,171/-.The above Case is posted to 16-03-2018 for your appearance. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at 10.30 A.M., on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined exparte.
"BY ORDER OF THE COURT"
COUNSEL FOR PLAINTIFF
A. Manohar Reddy
Advocate
Flat No.401, Magna's Lake View Apts.
beside Cyber City Convention Centre, Hi-Tex,
HYDERABAD - 500 084. Mobile: +91 9393366440.

TELANGANA
EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION
(AN ENTERPRISE OF GOVT. OF TELANGANA)
DISTRICT COLLECTORATE PREMISES :: NAMPALLY STN.ROAD, HYDERABAD
(e-procurement)
Tender Notice No.HD/EE/TSEWIDC/HYD/NIT/33 (4th call) 35 to 39 (3rd call) & 41 to 56(1st call) /2017-18, Dt: 23.02.2018
Tenders are invited from all eligible contractors for the works 1. Repairs to toilet block at State Institute and Technical Education, Hyderabad(2nd call) - Rs.3.00(L) (4th call) 2. Repairs works of building which includes roof of class rooms, electrical wiring and other repairs to Govt. Mahabubia Jr. College (G) Hyd - Rs.6.00(L)(3rd call) 3. Construction of Shed for R.O.Plant, Ground Leveling work and toilets for boys in GJC SP Road at West Marredpally, Secunderabad. -Rs.10.00(L) (3rd call) 4. Certain repairs works to office building of the Commissioner of Intermediate Education, TS, Nampally., Hyd - Rs.3.00(L) (3rd call) 5. Construction of girls toilets no.4 and repairs works of toilets to new GJC Malakpet Hyd - Rs.7.50(L) (3rd call) 6. Repairs works of toilets electrical wiring and other repairs to GJC at Kachiguda, Hyd - Rs.6.00(L) (3rd call) Repairs & Maintenance to Anganwadi Centres(from 7 to 17) at 7.Sri Sai Nagar, Saidabad(M) Hyd - Rs.1.10(L) 8. BJ Basti(Falaknuma), Uppuguda, Bandlaguda(M) Hyd -Rs. 6.70(L) 9. New Durga Nagar, Amberpet(M) Hyd - Rs.4.10(L) 10. BJR Nagar(F) Shaikpet(M) Hyd - Rs.0.70(L) 11. Habeeb Fatima Nagar-II, Khairtabad(M) Hyd - Rs. 2.25(L) 12. NSB Nagar Khairtabad(M) Hyd - Rs. 5.00(L) 13. SPR Hills, Khairtabad(M) Hyd - Rs. 1.50(L)14. Naveenagar, Rahmat Nagar, Khairtabad(M), Hyd - Rs. 3.00(L) 15. Bheemaudham Himayathnagar(M), Hyd - Rs.4.10(L) 16. ACs Nagar-II, Addagutta, Marredpally(M) Hyd - Rs. 2.00(L) 17. MG Nagar-I, Mettuguda, Marredpally(M) Hyd - Rs. 1.60(L) Drilling of Bore-well & Fixing of SMPS(from 18 to 21) 18. Patigadda Dhobighat Neck less Road, Khairatabad (M), Hyd. - Rs. 2.50(L) 19. Thotaguda Dhobighat, Charminar (M), Hyd. - Rs. 2.50(L)20. Puranapool, Bhajrangh Dhobighat, Charminar (M), Hyd. - Rs. 2.50(L) 21. Devunikunta Dhobighat, Asifnagar (M), Hyd. - Rs. 2.50(L) 22. Developing sports infrastructure (Preparation of Volley Ball court) at GDC Hussaini Alam Play Field, Hyd - Rs. 0.80(L) in Hyderabad District on e-procurement platform of Government of Telangana. Further Details are can be seen 'e' procurement market place i.e., www.tender.telangana.gov.in.
1. Bid documents download starts from : 26.02.2018 after 12.00 PM
2. Bid documents download end date : 05.03.2018 upto 5.00 PM
3. Last date for submission of hard copies : 06.03.2018 upto 12.00 PM
4. Bid opening date : 06.03.2018 at 01.00 PM
Executive Engineer,
TSEWIDC, Hyderabad.

GOVERNMENT OF INDIA MINISTRY OF FINANCE
DEPARTMENT OF FINANCIAL SERVICES
DEBTS RECOVERY TRIBUNAL- I
OFFICE OF THE RECOVERY OFFICER
3rd FLOOR, TRIVENI COMPLEX, ABIDS,
HYDERABAD-500 001
R.P. No. 215/2014
IN
O.A. No.441/2011
Between
Lakshmi Vilas Bank Ltd,Bank Street, Koti, Hyderabad. ..Certificate Holder
And
M/s. Sanghi Threads Pvt. Ltd & Others Certificate Debtor
To
1.M/s. Sanghi Threads Pvt. Ltd,Rep by its Director Mr. Sudhir Sanghi, Sanghi Nagar, P.O. Hayatnagar Mandal, R.R.Dist, Telangana .....Certificate Debtor No 1
2.Sri Sudhir Sanghi,Sanghi Threads Pvt. Ltd, 4-3-352. Bank Street, Koti , Hyderabad. ....Certificate Debtor No 2
3.Siddharth Sanghi, Sanghi Threads Pvt. Ltd,4-3-352, Bank Street. Koti , Hyderabad. ......Certificate Debtor No.3
4.Usha Sanghi, Sanghi Threads Pvt, Ltd, 4-3-352, Bank Street,Koti , Hyderabad ... Certificate Debtor No.4
NOTICE OF DEMAND TO DEFENDANT / CERTIFICATE DEBTOR
Take notice that R.P.No.215/2014 in 0 A.No.441/2011 has been forwarded by the Honourable Presiding Officer, Debts Recovery Tribunal and Hyderabad for recovery of an amount of **Rs.2,22,21,242.70 ps.** (Rupees Two Crore twenty Two lakhs twenty one thousand two Hundred forty two and paise seventy only) plus interest and costs from you. You, the Defendant is hereby required to pay the amount of this notice by way of Demand Draft to be drawn in favour of **The Recovery Officer Debts Recovery Tribunal, Hyderabad"** within 15 days from the date of publication of this notice. In case of default, steps will be taken under Rule 4 and 5 of the second schedule of Income Tax Act, 1961 and section 25 to 29 of Recovery of Debts Due to Banks & Financial Institutions Act. 1993
Date: 05.02.2018 (D.ANAND)
Place: Hyderabad Recovery Officer

GOVERNMENT OF INDIA
MINISTRY OF FINANCE
DEPARTMENT OF FINANCIAL SERVICES
DEBTS RECOVERY TRIBUNAL-1
3RD FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD - 500001
R.C. No. 146/2016 IN O.A. No.450/2011
Vijaya Bank,Basheerbagh,Hyderabad. .....Certificate Holder
Versus
Sri A. Yadagiri & Others ....Certificate Debtors
To,
1. Sri A. Yadagiri , S/o Shamaiah, Flat No. 502, Monica Castle, Moosarambagh, Hyderabad.
And C /o Dines Opticals, H.No.8/33/A, Opp. Bus stop, Dilshuknagar, Hyderabad. ...Certificate Debtor No.1
2. Smt. A. Parmimala, W/o Yadagiri, Flat No.502, Monica Castle, Moosarambagh, Hyderabad. ...Certificate Debtor No.2
3. R.V. Radha Krishna, S/o R. Appa Rao, H.No.12-11-1247, Boudhanagar, Warsiguda, Hyderabad.
And Sr. Draftsman,HAL-Avionics Division, Hyderabad. Certificate Debtor No.3
NOTICE OF DEMAND TO CERTIFICATE DEBTORS
Take notice that **R.P.No.146/2016 in O.A.No.450/2011** has been forwarded by the Honourable Presiding Officer, Debts Recovery Tribunal, Hyderabad for recovery of an amount of **Rs. 37,34,482/- (Rupees Thirty Seven Lakhs Thirty Four Thousand Four Hundred And Eighty Two Only)** plus interest and costs from you. You, the Defendant is hereby required to pay the amount of this notice by way of Demand Draft to be drawn in favour of **"The Recovery Officer, Debts Recovery Tribunal-1, Hyderabad"** within 15 days from the date of publication of this notice. In case of default, steps will be taken under Rule 4 and 5 of the second schedule of Income Tax Act, 1961 and section 25 to 29 of Recovery of Debts Due to Banks & Financial Institutions Act, 1993.
Date :08-02-2018, Place : Hyderabad. Sd/- (D. ANAND) Recovery Officer

ప్రయోగాత్మక చిత్రంలో శర్వానంద్



యంగ్ హీరో శర్వానంద్ ఏ సినిమాలు పడితే ఆ సినిమాలు ఒప్పుకోడు. రొటీన్‌కు భిన్నంగా ఉండే కథలవైపే అతను మొగ్గుచూపుతాడు. ఇప్పుడు అతను ఓ ప్రయోగాత్మక చిత్రానికి ఓకే చెప్పాడు. ఈ సినిమాలో శర్వానంద్ 20 ఏళ్ల వయసులో ఉన్న యువకుడిగా, 40 ఏళ్ల వయసులో ఉన్న మధ్యవయస్కుడిగా కనిపించబోతున్నాడు. హను రాఘవపూడి దర్శకత్వంలో అతను ఈ సినిమా చేయబోతున్నాడు. ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రం కోసం శర్వానంద్ సిద్ధమవుతున్నాడు . ముందుగా 20 ఏళ్ల యువకుడిగా కనిపించేందుకు 10 కిలోల బరువు తగ్గుతున్నాడట. పోనీటెయిల్ హెయిర్ స్టైల్‌తో యూత్ లుక్‌లో అదరగొట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక 40 ఏళ్ల వ్యక్తిలా కనిపించేందుకు ఆతర్వాత మళ్లీ బరువు పెరుగుతాడట. అప్పుడు ఆర్మీ ఆఫీసర్‌లా కనిపిస్తాడట. మన తెలుగులో ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సినిమాలు తక్కువే కాబట్టి ఈ సినిమాపై ప్రేక్షకుల అంచనాలు ఎక్కువగానే ఉంటాయి. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా సాయి పల్లవి నటించనుంది. కొద్దిరోజుల్లో ఈ చిత్రం షూటింగ్ కోల్‌కతాలో ప్రారంభంకానుంది. ఆతర్వాత షూటింగ్ స్పాట్ నేపాల్‌కు మారనుంది. నేపాల్‌లో ఆర్మీకి సంబంధించిన సీన్లను చిత్రీకరిస్తారు. శర్వానంద్ ఎంచుకునే కథలు డిఫరెంట్‌గానే ఉంటాయి కనుక ఈ సినిమా నుంచి మనం ఎక్కువ వినోదాన్ని ఆశించవచ్చు.

రసవత్తరంగా సమ్మర్ సమరం



మహేష్‌బాబు





నాని

నితిన్

అల్లుఅర్జున్, అను ఇమాన్యుయల్

రజనీకాంత్

ఈ వేసవి సినీ లవర్స్‌కు పండుగలా మారనుంది. వరుసగా స్టార్ హీరోల సినిమాలతో ఈ సమ్మర్ సమరం ఆసక్తికరంగా మారనుంది. ఏకంగా అరడజను స్టార్ల సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. మార్చి 30 నుంచి ఈ సినిమాలతో ప్రతి వారం ఓ దండయాత్రలా మారనుంది. వారానికో పెద్ద సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. సమ్మర్ ఫీవర్ ఈ ఏడాది రసవత్తరంగా ఉండనుంది. స్కూళ్లు, కాలేజీలకు వేసవి సెలవులను పురస్కరించుకొని బడా స్టార్లు బిగ్ మూవీలతో ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఈ వేసవిలో మొదటగా రామ్‌చరణ్ చిత్రం 'రంగస్థలం' విడుదలకానుంది. మార్చి 30న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. చరణ్‌సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. 1985 నాటి కథ, గ్రామీణ నేపథ్యం, డిఫరెంట్ గెటప్స్, ఆసక్తికరమైన స్టోరీ లైన్ ఈ సినిమాకు ప్లస్ పాయింట్స్. ఈ చిత్రం ఇప్పటికే రూ.80 కోట్ల ప్రీరిలీజ్ బిజినెస్ చేసింది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ చెవిటివాడిగా నటిస్తుండగా... సమంత గ్రామీ ణ ప్రాంత అమ్మాయిగా కనిపించనుంది. జగపతి బాబు, ఆది పినిశెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. 'రంగస్థలం' విడుదలైన వారం రోజులకే ఏప్రిల్ 5న నితిన్ చిత్రం 'ఛల్ మోహన్ రంగ' ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రేష్ఠ్ మూవీస్, పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథను అందించాడు. కృష్ణచైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నితిన్‌కు 25వ సినిమా కావ డం విశేషం. మేఘా ఆకాష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం సమ్‌థింగ్ స్పెషల్‌గా తెరకెక్కుతోందని ఫిల్మ్‌మేకర్స్ పేర్కొన్నారు. నితిన్ సినిమా వచ్చిన వారానికి అంటే ఏప్రిల్ 12న నాని సినిమా 'కృష్ణార్జున యుద్ధం' విడుదలకానుంది. వరుస విజయాలతో ఊపుమీదున్న ఈ హీరో ఈ చిత్రంతో మరో హిట్‌ను అందుకుంటానని నమ్మకంగా చెబుతున్నాడు. పైగా ఇందులో నానీది డ్యూయల్ రోల్. కృష్ణ, అర్జున్ అనే రెండు పాత్రలు పోషిస్తున్నాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వం లో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మంచి అంచనాలున్నా యి. ఇక ఇప్పటివరకు చెప్పుకున్న సినిమాలు ఒక ఎత్తు అయితే ఏప్రిల్ 20 నుంచి వస్తున్న సినిమాలో మరో ఎత్తు. ఎందుకంటే నాని సినిమా వచ్చిన వారం రోజులకు మహేష్‌బాబు నటిస్తున్న 'భరత్ అనే నేను' సినిమా వస్తోంది. 'స్పైడర్' సినిమాతో నిరాశచెందిన ఈ సూపర్‌స్టార్ ఈ చిత్రంతో ఖచ్చితంగా బ్లాక్‌బస్టర్ హిట్ కొడతాననే ధీమాతో ఉన్నాడు. 'శ్రీమంతుడు' వం టి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత మహేష్‌కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటాయి. బాలీవుడ్ బ్యూటీ కైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్నాడు. ఆతర్వాత ఏప్రిల్ 27న సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కాలా' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. రజనీ వరుస ఫ్లాపుల నేపథ్యంలో ఈ చిత్రంపై ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. 'కబాలి' చిత్రాన్ని తెరకెక్కించిన రంజిత్ ఈ చిత్రానికి దర్శకుడు. ఈ చిత్రాన్ని తెలుగులో భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు టాలీవుడ్ పెద్దలు. ధనుష్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ మార్చి 10న విడుదలకానుంది. టీజర్‌తో సినిమా ప్రమోషన్‌ను మొదలు పెడుతున్న ఫిల్మ్‌మేకర్స్ 'కాలా'ను అత్యధిక థియేటర్లలో విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 'కాలా' రిలీజైన వారం రోజుల తర్వాత మే 4న అల్లు అర్జున్ నటిస్తున్న 'నా పేరు సూర్యనా ఇల్లు ఇండియా' సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ మూవీతో ప్రముఖ రచయిత వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష శ్రీధర్ నిర్మాతగా బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతానికి సమ్మర్‌లో రిలీజవుతున్న సినిమాలు ఇవి. స్టార్ హీరోలు వారానికి ఒకరు చొప్పున బాక్సాఫీస్ బరిలోకి దిగి సత్తాచాటబోతున్నారు. ఆతర్వాత మే, జూన్ నెలలో మరికొంతమంది హీరోలు తమ సినిమాలను విడుదల చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. కాకపోతే వాళ్ల సినిమాల రిలీజ్ డేట్స్ ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు.



అఖిల్

బర్త్‌డే రోజునే ఆ ప్రకటన

అక్కినేని అఖిల్ నటించిన రెండవ సినిమా 'హలో' అతని ఆశలను పూర్తిగా తీర్చలేకపోయింది. ఈ చిత్రానికి హిట్ టాక్ వచ్చినా కమర్షియల్‌గా సక్సెస్ కాలేకపోయింది. అందుకే తన మూడో సినిమా విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం అఖిల్‌కు ఏర్పడింది. అయితే జనవరి 10న తన మూడో సినిమాను ప్రకటిస్తానని చెప్పాడు ఈ యంగ్ హీరో. ఆతర్వాత రెండు, మూడు డేట్స్ మారాయి కానీ కొత్త ప్రాజెక్ట్ ఖరారు కాలేదు. ఈలోగా పలువురు దర్శకుల పేర్లు అఖిల్ మూడో సినిమాతో లింక్ అయి వినిపించాయి. కానీ వీటిలో ఏదీ ఫైనల్ కాలేకపోయింది. ఇటీవల అయితే కొరటాల శివతో అఖిల్ మూవీ అంటూ ప్రచారం కూడా జరిగింది. కానీ ఇప్పట్లో అతని మూడో సినిమా గురించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం లేదట. అఖిల్ పుట్టినరోజైన ఏప్రిల్ 8న ఈ ప్రకటన వస్తుందని తెలిసింది. ఆ రోజున తన కొత్త సినిమా గురించి ఈ యంగ్ హీరో తెలియజేస్తాడు. ఇటీవల వరుణ్‌తేజ్ హీరోగా 'తొలిప్రేమ'తో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన వెంకీ అట్లూరితో కూడా అక్కినేని టీమ్ చర్చలు జరుపుతున్నట్లుగా తెలిసింది. ఓ క్యూట్ లవ్‌స్టోరీని సిద్ధం చేస్తే సినిమా చేద్దామనే ఆఫర్ వెంకీ అట్లూరికి అందినట్లు టాక్ వినిపిస్తోంది.



కైరా అద్వాని

టాలీవుడ్‌పైనే దృష్టి



మలైకా అరోరా

తెలుగులో ఇద్దరు టాప్ స్టార్స్‌తో నటించే అదృష్టాన్ని దక్కించుకున్న లక్కీ బ్యూటీ కైరా అద్వాని. బాలీవుడ్‌లో మూడు సినిమాలు చేసిన ఈ భామకు టాలీవుడ్‌లో కెరీర్ ప్రారంభంలోనే మహేష్‌బాబు, రామ్ చరణ్‌తో సినిమా అవకాశాలను దక్కించుకుంది. ప్రస్తుతం మహేష్‌తో 'భరత్ అను నేను' చిత్రంలో నటిస్తోంది ఈ భామ. అందాలొలికించడంలో ఏమాత్రం వెనుకాడని ఈ భామకు తెలుగు ఫిల్మ్‌మేకర్స్ మంచి ఆఫర్లు ఇస్తున్నారు. మహేష్, చరణ్ సినిమాలు కనుక హిట్ అయితే కైరా అద్వాని ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారే అవకాశం ఉంది. ఇక ఈ భామ బాలీవుడ్‌లో చేసిన ఎంఎస్ ధోని తప్ప మిగిలిన రెండు సినిమాలు నిరాశపరిచాయి. దీంతో ఈ భామ ప్రస్తుతం తన దృష్టినంతా టాలీవుడ్‌పైనే పెట్టింది. తెలుగులో స్టార్లతో సినిమాలు కాబట్టి ఎలాగైనా మంచి హిట్స్‌ను అందుకోవాలని కైరా తహతహలాడుతోంది. ఈ రెండు కాకుండా మరో భారీ ఆఫర్ కూడా ఆమె కోసం ఎదురుచూస్తోందట. కానీ దాని గురించి ఈ హాట్ బ్యూటీ ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. 'భరత్ అను నేను'లో కైరా పాత్ర ఎంతో ఆసక్తికరంగా ఉంటుందట. ఇందులో ప్రతిపక్ష నాయకుడు ప్రకాష్‌రాజ్ కూతురిగా ఆమె నటిస్తోందని తెలిసింది. గ్లామర్‌తో పాటు నటనకు స్కోప్ ఉండేలా దర్శకుడు కొరటాల శివ ఆమె పాత్రను తీర్చిదిద్దాడట. 'శ్రీమంతుడు'లో శృతిహాసన్, 'జనతాగ్యారేజ్'లో సమంతల కన్నా ఈ సినిమాలో కైరా పాత్రకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని తెలిసింది.

నమ్రత నా పట్ల దురుసుగా ప్రవర్తించేది!



నమ్రత శిరోద్కర్

మహేష్‌బాబు భార్య నమ్రతా శిరోద్కర్ ఒకప్పుడు బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా రాణిం చింది. అప్పట్లో టాప్ మోడల్‌గా క్రేజ్ తెచ్చుకున్న ఆమె చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించి గ్లామరస్ తారగా ఎంతో పేరుతెచ్చుకుంది. 90వ దశకం చివరి వరకు హీరోయిన్‌గా ఆమె హవా బాగానే కనిపించింది. అయితే వివాదాలకు దూరంగా ఉండే ఆమెపై ఇప్పుడు ఓ భామ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆమె ఎవరో కాదు... 'అతిథి' చిత్రంలో మహేష్‌బాబుతో కలిసి 'రాత్రయినా నాకు ఓకే...' అంటూ ఆడిపాడిన ఐటమ్ భామ మలైకా అరోరా. మలైకా అరోరా మోడలింగ్‌లోకి ప్రవేశించిన కాలంలో అప్పటికే నమ్రతా శిరోద్కర్ టాప్ మోడల్. అలాంటి సమయంలో ఆమె పట్ల సీనియర్ అయిన నమ్రత దురుసుగా ప్రవర్తించేదట. మెహర్ జెస్సియా అనే టాప్ మోడల్‌తో కలిసి నమ్రత ఈవిధంగా ప్రవర్తించేదట. నేహాధుపియా నిర్వహిస్తున్న ఓ టివి కార్యక్రమంలో ఈ విషయాలను చెప్పింది మలైకా అరోరా. తన కెరీర్ ప్రారంభంలో ఇలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రస్తుతం వారిద్దరూ నా బెస్ట్‌ఫ్రెండ్స్ అంటూ చెప్పింది ఈ బ్యూటీ. ఇక సల్మాన్ సోదరుడు అర్బాజ్‌ఖాన్‌ను వివాహం చేసుకున్న మలైక ఇటీవల విడాకులు తీసుకుంది. ప్రస్తుతం ఆమె టివి షోలకు వ్యాఖ్యతగా వ్యవహరించడంతో పాటు అప్పుడప్పుడు సినిమాల్లో ఐటమ్‌సాంగ్స్‌లో మెరుస్తోంది.

మరో మైలురాయిగా...



విజయ్ దేవరకొండ

'అర్జున్‌రెడ్డి' చిత్రంతో యంగ్‌స్టార్‌గా ప్రేక్షకుల్లో మంచి పేరు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ పూర్తిచేసుకొని పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. జిఏ2, యువి పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్‌కెఎన్ ఈ చిత్రంతో నిర్మాతగా పరిచయమవుతున్నారు. అదేవిధంగా రాహుల్ సంకృత్యాన్ దర్శకుడిగా తెరంగేట్రం చేస్తున్నారు. విజయ్ కెరీర్‌లోనే మరో మైలురాయిగా నిలిచిపోయే ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్‌ను త్వరలో విడుదల చేస్తారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఎస్‌కెఎన్ మాట్లాడుతూ ''విజయ్ దేవరకొండకున్న క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానికి తగ్గట్టుగానే అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేవిధంగా దర్శకుడు రాహుల్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నాడు. విజయ్ మ్యానరిజమ్స్, బాడీలాంగ్వేజ్, క్యారెక్టరైజేషన్ ప్రేక్షకులను మైమరపిస్తాయి. డైరెక్టర్ రాహుల్, సుజిత్ విజువల్స్, జేక్స్ మ్యూజిక్, కృష్ణకాంత్ లిరిక్స్, జాషువా స్టంట్స్ ఈ చిత్రంలో హైలైట్‌గా నిలుస్తాయి. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని మే 18న ప్రపంచవ్యాప్తంగా గ్రాండియర్‌గా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ చిత్రానికి చక్కని టైటిల్, ఫస్ట్‌లుక్‌ను త్వరలో విడుదల చేస్తాము''అని అన్నారు. విజయ్ దేవరకొండ, ప్రియాంక జువాల్కర్, మాళవికా నాయర్, కళ్యాణి, మధునందన్, సిజ్జుమీనన్, రవిప్రకాష్, రవివర్మ తదితరులు ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించారు.

బ్రాహ్మణ అమ్మాయి పాత్రలో...



పూజా హెగ్డే

అల్లుఅర్జున్‌కు జంటగా 'డీజే.. దువ్వాడ జగన్నాథం' చిత్రంలో నటించి మంచి హిట్‌ను అందుకుంది అందాల తార పూజాహెగ్డే. ఈ చిత్రంలో గ్లామర్ రోల్‌లో నటించిన ఈ బ్యూటీ ప్రేక్షకులను మైమరపించింది. ఇప్పుడు ఈ భామ ఓ ఛాలెంజింగ్ రోల్ చేస్తోంది. 'డీజే'లో బ్రాహ్మణ అబ్బాయిగా కనిపించిన హీరో తో ఆన్‌స్క్రీన్ ప్రేమయాణాన్ని కొనసాగించిన ఆమె ఇప్పుడు బ్రాహ్మణ అమ్మాయి పాత్రలో నటించేస్తోంది. శ్రీవాస్ దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా రూపొందుతున్న 'సాక్ష్యం' చిత్రం చేస్తోంది పూజా హెగ్డే.

ఇందులోని పాత్రను ఆమె ను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేయడం విశేషం. అటు సాంప్రదాయాన్ని... ఇటు కొత్త తరాన్ని మేళవించిన పాత్రలో ఆమె నటిస్తోంది. 'సాక్ష్యం'లో పూజాహెగ్డే డ్రెస్సులు కూడా హైలైట్‌గా నిలుస్తాయట. వెస్ట్రన్, ఇండియన్ స్టైల్‌ను మిక్స్ చేసి ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ నీతులుల్లా ఆమె కోసం డిజైన్ చేసిన కాస్ట్యూమ్స్ అద్భుతంగా ఉంటాయట. ఈ చిత్రం తర్వాత మహేష్‌బాబువంశీపైడిపల్లి కాంబినేషన్‌లోని చిత్రంలో, ఎన్టీఆర్‌త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రానున్న సినిమాలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటించనుంది.



బ్యాంక్‌లకు ఆర్థిక మంత్రిత్వశాఖ లేఖ

న్యూఢిల్లీ: హాంకాంగ్‌లోని నాలుగు భారతీయ బ్యాంకులకు ఆర్థిక మంత్రిత్వశాఖ లేఖ రాసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి ఎల్‌ఒయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్) అందుకున్న బ్యాంకులకు ఈ లేఖ పంపినట్టు తెలుస్తోంది. బిలియనీర్ నీరవ్ మోడీ రూ.11 వేల కోట్ల పిఎన్‌బి మోసం కేసు వెలుగుచూసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ బ్యాంకులను జాగ్రత్తగా ఉండాలని సూచించినట్టు తెలుస్తోంది. రూ.11,300కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలోనే బ్యాంకులు కంపెనీలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇచ్చే ముందు నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపింది. ఎప్పకటికప్పుడు ఖాతాలను పరిశీలిస్తూ, అక్రమాలను వెంటనే గుర్తించాల్సిందిగా లేఖలో పేర్కొనట్లు సమాచారం. హాంకాంగ్‌లోని ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈ లేఖలు పంపించినట్లు తెలుస్తోంది. ఈ నాలుగు బ్రాంచ్‌ల్లోనే పిఎన్‌బి ముంబై బ్రాంచ్ మధ్యవర్తిగా ఉండి నీరవ్ మోడీకి రుణాలు ఇప్పించింది. ఇక ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి రూ.250కోట్లకు పైగా రుణాలు తీసుకున్న వారి ఖాతాలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఓ అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. నీరవ్ మోదీ, రొటోమాక్ యజమాని విక్రమ్ కొఠారిలు బ్యాంకుల దగ్గర నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకొని వాటిని ఎగవేసిన విషయం తెలిసిందే.

సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ

- 34 వేల పాయింట్లను దాటిన సూచీ
- మెటల్, ఫార్మా రంగాల్లో భారీ కొనుగోళ్లు



న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా తీవ్ర ఒడిదుడుల మధ్య కొనసాగుతున్న దేశీయ మార్కెట్లు ఎట్టకేలకు భారీగా లాభాలను నమోదు చేశాయి. శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ దాదాపు 300 పాయింట్లకు పైగా లాభపడింది.
మెటల్, ఫార్మా, ప్రైవేట్ రంగాల్లో భారీ కొనుగోళ్లు లాభాల ముగింపునకు కారణమయ్యాయి. మొత్తానికి సెన్సెక్స్ 323 పాయింట్లు లాభపడి 34,142 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 108.35 పాయింట్లు లాభపడి 10,491.05 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 33832 నుంచి 34168 మధ్య శ్రేణిలో కదలాడింది. కీలకమైన బ్యాంక్ నిఫ్టీ 347 పాయింట్లు అంటే 1.39 శాతం లాభపడి 25,302.50 పాయింట్ల వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే అన్ని సెక్టార్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా మార్కెట్లు సానుకూలంగా ఉండడంతో సెంటిమెంటు బలపడింది. దీంతో దేశీయంగానూ ఎలాంటి ప్రతికూలాంశాలు లేకపోవడంతో ఇన్వెస్టర్లు, ట్రేడర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. చివరి అరగంటలో సెన్సెక్స్ సూచి అత్యధికంగా 347 పాయింట్ల లాభపడి 34168 పాయింట్ల గరిష్టస్థాయిని నమోదు చేసింది. బ్యాంకింగ్, లోహ, లోహ, టెలికాం, హెల్త్‌కేర్ రంగాలకు చెందిన షేర్లు ర్యాలీ బాటపట్టాయి. అయితే మార్కెట్లో ప్రధానంగా మెటల్, ఫార్మా షేర్లు మంచి లాభాలతో దూకుడుగా ఉన్నాయి. మెటల్ సూచి 3.19 శాతం లాభపడి 4,028.80 వద్ద, ఫార్మా సూచి 2.64 శాతం ర్యాలీ 9,095.40 వద్ద ముగిసింది. టాటాస్టీల్ 6 శాతం లాభపడి మెటల్ ఇండెక్స్‌ను, సన్‌ఫార్మా 4శాతం ర్యాలీ చేసి ఫార్మా రంగాన్ని నడిపించాయి. ముఖ్యంగా వేదాంత, టెక్ మహీంద్రా, యూపిల్, సన్‌ఫార్మా, టాటా స్టీల్ షేర్లు 3 నుంచి 6 శాతం లాభపడ్డాయి. మరోవైపు ఏసియన్ పెయింట్స్, గెయిల్, ఇన్ఫోసిస్, ఐషర్ మోటార్స్ నష్టపోయాయి.

ఇంకా కొంత కన్సాలిడేషన్

ప్రస్తుత మార్కెట్లు కొనుగోళ్ల ఊపుతో లాభాల బాటపట్టాయి. అయితే పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం, లాంగ్ టర్మ్ గెయిన్ పన్ను వంటి అంశాలు ఇన్వెస్టర్లలో భయాన్ని నింపాయి. అదే సమయంలో గ్లోబల్ మార్కెట్ల ప్రభావంతో మార్కెట్ సూచీలు కరెక్షన్‌కు గురవుతున్నాయి. అయితే మార్కెట్లలో ఇంకా కొంత కన్సాలిడేషన్ జరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లు లాభాలను కొనసాగించే అవకాశం ఉన్నా.. పతనం అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. 9900 – 10000 లెవెల్‌కు నిఫ్టీ దిగి వచ్చే సూచనలు ఎక్కువగానే ఉన్నాయని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. లాంగ్‌టెర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను విధించడం.. ఇన్వెస్టర్లలో కొంత ప్రతికూలతను నింపింది. అయినప్పటికీ దీర్ఘకాలికంగా పెట్టుబడులు చేసేవారిపై ఇది పెద్దగా ప్రభావం చూపబోదని నిపుణులు అంటున్నారు. ఎల్‌టిసిడి ప్రభావం తాత్కాలికమే అని చెబుతున్నారు. విదేశీ ఇన్వెస్టర్లు మాత్రం ఈ అంశాన్ని అసలు పట్టించుకునే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది. దేశీయ మార్కెట్లలో విదేశీ పెట్టుబడులు అధికం కావడంతో ఇది మార్కెట్లపై కూడా అదే తరహా ప్రభావం చూపనుంది. ఉదాహరణకు యూఎస్ నుంచి వచ్చిన వ్యక్తులకు ఇక్కడ అసలు ట్యాక్స్ లేదు. మార్కెట్లో ఇంకా దిద్దుబాటు పూర్తయిపోయిందని అనుకోకూడదని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.ఈ స్థాయి నుంచి మరో 5 నుంచి 7 శాతం వరకూ సూచీలు తగ్గే అవకాశం కనిపిస్తోందని చెబుతున్నారు.



ఎస్‌బిఐ ఫిక్స్‌డ్ డిపాజిట్లు

వడ్డీ రేట్లు, కాల వ్యవధి, వివరాలు



ఫిక్స్‌డ్ డిపాజిట్ల(ఎఫ్‌డి)లకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పలు బ్యాంకులు ఎఫ్‌డిలను అందిస్తున్నాయి. వాటిలో దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) ఎఫ్‌డి లేదా టర్మ్ డిపాజిట్లకు వడ్డీ రేట్లు 5.25 శాతం(7 నుంచి 45 రోజుల తక్కువ వ్యవధి) నుంచి ప్రారంభమవుతాయి. గ్యారంటీ రిటర్న్‌లు, ప్రి మెచ్యూర్ విత్‌డ్రా వంటి అనేక ఇతర సౌకర్యాలను కూడా అందిస్తోంది. ఈమేరకు ఎస్‌బిఐ.కో.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను పొందుపరిచింది. ఎస్‌బిఐ టర్మ్ డిపాజిట్‌లో పెద్ద మొత్తంలో నగదును డిపాజిట్ చేయవచ్చు, దీనికి గ్యారంటీ లాభాలు, వడ్డీ రేటు చెల్లింపు ఎంపిక, ఒ.డి. ద్వారా లిక్విడిటీ సదుపాయాలను బ్యాంకు కల్పిస్తోంది. బ్యాంక్ వెబ్‌సైట్ ద్వారా లేదా మీ బ్రాంచ్‌ను సందర్శించి ఈ డిపాజిట్లు చేయవచ్చని ఎస్‌బిఐ చెబుతోంది.

ఎస్‌బిఐ ఆఫర్ చేస్తున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలు

☞ కస్టమర్లు తప్పనిసరిగా కనీస డిపాజిట్ రూ.1000 చేయాలి.. అదే సమయంలో గరిష్ట డిపాజిట్‌పై ఎలాంటి పరిమితులు లేవు

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేటు చెల్లింపు

☞ఎస్‌బిఐ ఎఫ్‌డిలపై వడ్డీ రేటును కస్టమర్ల అవసరాల మేరకు నెలవారీగా, మూడు నెలలకోసారి, క్యాలెండర్ త్రైమాసికం ఆధారంగా చెల్లిస్తారు. నెలవారీ వడ్డీ చెల్లింపు రాయితీ రేటు వద్ద ఉంటుంది. ఒప్పంద రేటు ప్రకారం చెల్లింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్స్ రూ.10 వేలకు పైగా డిపాజిట్లపై 0.25 శాతం అదనపు వడ్డీ రేటును పొందుతారు.

ఎస్‌బిఐ ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు...

☞ 2017 నవంబర్ 1 నుంచి దేశీయ టర్మ్ డిపాజిట్లు(ఒక కోటి రూపాయల లోపు) వడ్డీ రేట్లలో మార్పు చేశారు.

2018 జనవరి 30 నుంచి రూ. కోటి నుంచి రూ.10 కోట్ల వరకు డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించారు. ఈ వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి. (వార్షికం ఆధారంగా గణాంకాలు)

వ్యవధి కాలం	2017 నవంబర్ 1 నుంచి సవరించిన వడ్డీ రేటు%	వయో వృద్ధులకు సవరించి రేటు%
7 రోజుల నుంచి 45 రోజులు	5.25	5.75
46 రోజుల నుంచి 179 రోజులు	6.25	6.75
180 రోజుల నుంచి 210 రోజులు	6.25	6.75
211 రోజుల నుంచి ఏడాది లోపు	6.25	6.75
ఏడాది నుంచి 455 రోజులు	6.25	6.75
456 రోజుల నుంచి 2 ఏళ్ల లోపు	6.25	6.75
2 ఏళ్ల నుంచి 3 ఏళ్ల లోపు	6	6.5
3 ఏళ్ల నుంచి ఐదు సంవత్సరాల లోపు	6	6.5
5 ఏళ్లు, 10 సంవత్సరాల వరకు	6	6.5

కోటి రూపాయల లోపు టర్మ్ డిపాజిట్లకు వడ్డీ రేట్లను సవరించారు. ఈ వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి. (వార్షికం ఆధారంగా గణాంకాలు)

వ్యవధి కాలం	2017 నవంబర్ 1 నుంచి సవరించిన వడ్డీ రేటు%	వయో వృద్ధులకు సవరించి రేటు%
7 రోజుల నుంచి 45 రోజులు	5.25	5.75
46 రోజుల నుంచి 179 రోజులు	6.25	6.75
180 రోజుల నుంచి 210 రోజులు	6.25	6.75
211 రోజుల నుంచి ఏడాది లోపు	6.25	6.75
1 సంవత్సరం	6.25	6.75
1 సంవత్సరం నుంచి 455 రోజులు	6.25	6.75
456 రోజుల నుంచి 2 ఏళ్ల లోపు	6.25	6.75
2 ఏళ్ల నుంచి 3 ఏళ్ల లోపు	6	6.5
3 ఏళ్ల నుంచి ఐదు సంవత్సరాల లోపు	6	6.5
5 ఏళ్లు, 10 సంవత్సరాల వరకు	6	6.5

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34142.15	322.65	0.95%
నిఫ్టీ	10491.05	108.35	1.04%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29140	31165.78	0.17%
ముంబై	29910	31989.30	–0.03%
ఢిల్లీ	29750	31818.18	0.17%
కోల్‌కతా	30040	32128.34	0%
కేరళ	28300	30267.38	0.35%
బెంగళూరు	28550	30534.76	–1.04%
హైదరాబాద్	29140	31165.78	0.17%
గల్ఫ్	1407.18	1505.00	–0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	41600.00	41400.00	0.48
ముంబై	41600.00	41400.00	0.48
ఢిల్లీ	41600.00	41400.00	0.48
కోల్‌కతా	41600.00	41400.00	0.48
హైదరాబాద్	41600.00	41400.00	0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	365
వరంగల్	357	చిత్తూరు	388
విజయవాడ	363	చెన్నై	395
గోదావరి	363	బెంగళూరు	385

భారత్ లక్ష్యం గురించే ప్రపంచం చర్చ



ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ: నాలుగేళ్ల క్రితం 'ఫ్రాజిలె 5' ఆర్థిక వ్యవస్థల్లో భారత్ గురించి చర్చ జరిగేదని, ఇప్పుడు ప్రపంచం.. భారత్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం 5 ట్రిలియన్ డాలర్ల గురించే చర్చ జరుగుతోందని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఇక్కడ ఎకనమిక్స్ టైమ్స్ 'గ్లోబల్ బిజినెస్ సమ్మిట్' కార్యక్రమంలో ఆయన ఈవిధంగా అన్నారు. ఆర్థిక పరంగా భారత్ మెరుగైన పనితీరును కనబరుస్తోందని, గత నాలుగేళ్లలో గ్రాస్ ఎఫ్‌డిఐ ఇన్‌ఫ్లో 209 బిలియన్ డాలర్లకు చేరిందని అన్నారు. ప్రస్తుతం ఫ్రాజిలె 5 గురించి భారత్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం గురించే ప్రపంచం ఎక్కువగా చర్చిస్తోందని సదస్సులో ఆయన అన్నారు. గత నాలుగేళ్లలో ప్రపంచ జిడిపిలో భారత్ వాటా 2.4 శాతం నుంచి 3.1 శాతానికి పెరిగిందని అన్నారు. జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలుకు ముందు 60 లక్షల మంది ట్రేడర్లు మాత్రమే పరోక్ష పన్ను వ్యవస్థలో ఉన్నారని, అయితే జిఎస్‌టి అమలైన తర్వాత ఏడు నెలల్లో ఈ సంఖ్య కోటికి చేరిందని అన్నారు.

$ 5 ట్రిలియన్ల క్లబ్‌లోకి భారత్



భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ప్రవేశించిందని యస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ రాణా కపూర్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశంలో వేగంగా అభివృద్ధిని సాధిస్తోందని అన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ప్రవేశించిందని, 2030 సంవత్సరం నాటికి 10 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని కూడా చేరుకుంటుందని ఆయన వ్యాపారవేత్తలు విశ్వాసం వ్యక్తం చేశారు. 'ప్రపంచంలో భారత్ ఆర్థిక వ్యవస్థ గురించి చర్చ జరుగుతోంది. త్వరలో 2030 నాటికి భారత్ పది ట్రిలియన్ డాలర్ల క్లబ్‌ను తాకుందనే చర్చ జరగనుంది' అని కపూర్ అన్నారు. మరి కొన్నేళ్లలో భారత్ ఆర్థిక వ్యవస్థ అద్భుతమైన వృద్ధిని చూపనుందని, అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలువనుందని అన్నారు.

తొలి 5జి నెట్‌వర్క్ ట్రయల్



న్యూఢిల్లీ: టెలికామ్ దిగ్గజం ఎయిర్‌టెల్, ఫోన్ల తయారీ సంస్థ హువాయిలు శుక్రవారం దేశంలోనే తొలిసారిగా 5జి నెట్‌వర్క్ సేవల ట్రయల్‌ను నిర్వహించాయి. ఈ ట్రయల్‌లో సెకండ్‌కు మూడు గిగాబైట్లకు పైగా నెట్‌వర్క్ వేగం సాధించినట్టు సంస్థలు ప్రకటించాయి.

మోటరోలా, లెనోవా ఫోన్లపై క్యాష్‌బ్యాక్

లెనోవో, మెటోరోలా 4pf స్మార్ట్‌ఫోన్లపై ఎయిర్‌టెల్ క్యాష్ బ్యాక్ ఆఫర్‌ను అందిస్తోంది. ఈ కంపెనీలకు చెందిన ఎంపిక చేసిన 4జి స్మార్ట్‌ఫోన్లపై రూ.2 వేల వరకు క్యాష్ బ్యాక్ ప్రకటించింది. మోటొరోలా మోటో సి, మోటో ఈ4, లెనోవో కె8 నోట్ ఫోన్లపై ఈ ఆఫర్ వర్తిస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ ఆఫర్‌లో భాగంగా మోటో సీ స్మార్ట్‌ఫోన్ రూ.3,999కే లభ్యంకానుంది. అలాగే మోటో ఇ4 స్మార్ట్‌ఫోన్ రూ.6,499, లెనోవో కే8 నోట్ స్మార్ట్‌ఫోన్ రూ.10,999లకి లభించనుంది. 4జి స్మార్ట్‌ఫోన్లను మరింత మంది వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు మోటొరోలాతో ఒప్పందం చేసుకున్నట్టు భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ వాని వెంకటేశ్ తెలిపారు.

బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్ విలీనం యోచన లేదు

కేంద్ర టెలికం శాఖ మంత్రి మనోజ్ సిన్హా

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ టెలికామ్ సంస్థలు బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్‌ను విలీనం గురించి తరచూ వినిపిస్తోంది. అయితే అలాంటి యోచనేదీ ప్రస్తుతానికి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే విషయమై కేంద్ర టెలికం శాఖ మంత్రి మనోజ్ సిన్హా స్పందిస్తూ.. బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్‌ను విలీనం యోచన ప్రస్తుతానికైతే లేదన్నారు. పరస్పర సహకరించుకుంటూ పనిచేయడం ద్వారా రెండు సంస్థలూ ప్రయోజనం పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండు సంస్థలను పటిష్టం చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేయనున్నామని అన్నారు. టెలికం రంగంలోని ప్రభుత్వ రంగ కంపెనీలు, ఇతర సంస్థలు సమన్వయంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉద్దేశించిన వ్యూహాత్మక ప్రణాళికను టెలికం శాఖ గురువారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా మంత్రి ఈ విధంగా అన్నారు. మానవ వనరుల నుంచి స్థలాలు, భవంతుల దాకా అన్నింటినీ మరింత సమర్థంగా వినియోగించుకునేలా ఈ ప్రణాళికను రూపొందించారు. ట్రాయ్ స్వతంత్ర నియంత్రణ సంస్థ అని పేర్కొన్న సిన్హా అన్నారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్, సెల్యులార్ ఆపరేటర్ల సమాఖ్య సిఒఎఐ మధ్య నిబంధనలు, విధానాలపరంగా నెలకొన్న వివాదం ఉందని, అయితే ఈ విషయంలో కేంద్రం పక్షపాతం లేకుండా వ్యవహరిస్తోందని ఆయన పేర్కొన్నారు. టెలికం శాఖ న్యాయంగా, నిష్పక్షపాతంగానే వ్యవహరిస్తుందని మంత్రి పేర్కొన్నారు.



సంయమనం పాటించండి.. సమయం వచ్చినపుడు మాట్లాడండి



చెన్నై : తాను ప్రారంభించబోయే రాజకీయ పార్టీకి మంచి పునాది వేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నాయని, అప్పటి వరకు అభిమానులంతా సంయమనం పాటించాలని, సరైన సమయంలోనే మాట్లాడాలని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. శుక్రవారం నాడు తిరునల్వేలి జిల్లాలో జరిగిన అభిమానుల సమావేశంలో రజనీకాంత్ మాట్లాడుతూ 'ఇతరులు (రాజకీయాలు) మాట్లాడుతున్నారు. కా ని, వారు (అభిమానులు, మద్దతుదారులు) మౌనంగా ఉంటున్నారు. ఇతరులను మాట్లాడనీయండి, సరైన సమయంలోనే మీరు మాట్లాడండి' అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఒక రాజకీయ పార్టీకి ఓటు బ్యాంకు గ్యారంటీ ఉన్నదంటే, అది ఏర్పాటు చేసుకున్న పునాదే దానికి కారణమని అన్నారు. ఇలాంటి పునాదే మనకు ఇప్పుడు కావాలి, నిర్మాణానికి బలమైన మద్దతుతో కూడిన పునాది ఇప్పటి నుంచే అవసరమని తెలిపారు. తాను రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు రజనీకాంత్ గత ఏడాది డిసెంబరు 31న ప్రకటించిన విషయం విదితమే. వచ్చే శాసనసభ ఎన్నికల్లో 234 స్థానాల్లో పోటీ చేయనున్నట్టు కూడా చెప్పారు. తన మిత్రుడు,'మక్కళ్ నీది మయ్యం'(ఎంఎన్ఎం) వ్యవస్థాపకుడు కమల్‌హాసన్‌పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. సమర్థ నటుడు హాసన్ ప్రజల విశ్వాసాన్ని పొందుతారన్నారు.

దూసుకుపోయిన 'ధనుష్'



బాలాసోర్ (ఒడిశా) : అణు సామర్థ్యంతో కూడిన 'ధనుష్' బాలిస్టిక్ క్షిపణిని భారత్ శుక్రవారం నాడు విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని నేవల్ షిప్ నుంచి 350 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేదించగలిగే సామర్థ్యం ఈ క్షిపణికి ఉంది. ఉపరితలం నుంచి ఉపతలానికి దూసుకుపోయే ఈ క్షిపణిని శుక్రవారం ఉదయం 10.52 గంటలకు ప్రయోగించగా, నిర్దేశిత లక్ష్యంవైపు దూసుకుపోయిందని అధికారులు తెలిపారు. ఈ ధనుష్ క్షిపణి దాదాపు 500 కిలోల పేలోడ్‌ను తనతో పాటు మోసుకుపోయే సామర్థ్యాన్ని కలిగివుంది.భూ ఉపరితలంపైనా, సముద్ర తీరాలు లక్ష్యంగా ఇది దూసుకుపోగలదని అధికార వర్గాలు తెలిపాయి. రక్షణ బలగాల స్ట్రేటజిక్ ఫోర్స్ కమాండ్ (ఎస్ఎఫ్‌సి)చే ఈ ప్రయోగం జరిగిందని పేర్కొన్నాయి. భారతీయ నావికాదళ ప్రయోగాల్లో భాగంగానే ఈ క్షిపణి ప్రయోగం జరిగిందని వివరించాయి.

హంతకులే మాకు ఓట్లేయలేదు

కేంద్ర సహాయ మంత్రి ప్రదీప్ సింగ్ జడేజా



న్యూఢిల్లీ : కసాయివాళ్లు, అక్రమ రవాణాదారులు,ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకించే వారు ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో ఓట్లు వేయకపోవడం వల్లనే తమ పార్టీ విజయం 99 సీట్లకే పరిమితమైందని కేంద్ర సహాయ మంత్రి ప్రదీప్ సింగ్ జడేజా అన్నారు. 'నేను ఇదే చెబుతున్నాను గోహింసకు వ్యతరేకంగా చట్టాన్ని తీసుకొచ్చినందుకే కసాయివాళ్లు మాకు ఓట్లేయలేదు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్నందుకే అక్రమ రవాణాదారులు కూడా ఓట్లేయలేదు' అని ఆయన పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన శాసనసభలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.'ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకున్నందున చాలా మంది పాఠశాలల యజమానులు చాలా అసంతృప్తితో ఉన్నారు.ముస్లిం మహిళలకు రక్షణ కల్పించే ట్రిపుల్ తలాక్ బిల్లు కు వ్యతిరేకించిన వారు కూడా మాకు ఓట్లేయలేదు.ఇలాంటి వారితో మాకు ఎలాంటి ఇబ్బంది లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు.

అలాంటి అధికారులను కొట్టాల్సిందే



న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాష్‌పై ఆప్ ఎమ్మెల్యేల దాడి వివాదం సమసిపోకముందే ఆప్ ఎంఎల్ఏ నరేష్ బాల్యన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అన్షు ప్రకాష్ వంటి అధికారులను కొట్టాల్సిందేనని ఆయన అన్నారు. ఉత్తమ్ నగర్‌లో శుక్రవారం జరిగిన ర్యాలీ ని ఉద్దేశించి ఎమ్మెల్యే బాల్యన్ మాట్లాడుతూ చీఫ్ సెక్రటరీ తమపై తప్పుడు ఆరోపణలు చేశారని..అయితే ఇలాంటి అధికారులను కొట్టాల్సిందేనని తానంటానని చెప్పారు. సాధారణ పౌరుల పనులను నిలిపివేసే అధికారులకు ఇలా బుద్ధి చెప్పాల్సిందేనని అన్నారు.మరోవైపు ఢిల్లీ చీఫ్ సెక్రటరీపై దాడికి పాల్పడి అరెస్ట్ అయిన ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు అమనుతుల్లా ఖాన్, ప్రకాష్ జర్వాల్‌లు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లను ఢిల్లీ కోర్టు తోసిపుచ్చింది. ఎమ్మెల్యేలను 14 రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి తరలించాలని కోర్టు ఆదేశించిన విషయం విదితమే.

రైతులే కాదు..ఎంఎల్‌ఎలూ చస్తున్నారు

మధ్యప్రదేశ్ మంత్రి భార్గవ వ్యాఖ్యలు

సాగర్(ఎంపి) : రైతు ఆత్మహత్యలపై బిజెపి పాలిత మధ్యప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గోపాల భార్గవ చులకనగా మాట్లాడారు. 'రైతులే కాదు..ఎంఎల్ఎలూ చనిపోతున్నారు. కలకాలం ఎవరూ బతికుండరు. ఎప్పుడో అప్పుడు వెళ్లిపోయే వాళ్లమే' అని వ్యాఖ్యానించారు. నష్టాలు వచ్చినప్పుడు వ్యాపారులు, పరీక్షల్లో ఫెయిలయ్యామని విద్యార్థులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. గురువారంనాడు ఇక్కడికి ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. గత నాలుగేళ్లలో పదిమంది ఎంఎల్ఎలు చనిపోయారని, చావులను ఆపగలమా? అని ప్రశ్నించారు. అయితే రుణాలు, పంట నష్టాలతో ఉసురు తీసుకుంటున్న రైతుల పట్ల తనకు పూర్తి సానుభూతి ఉందన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని, మద్దతు ధరలపై మధ్యప్రదేశ్ రైతులు ఇటీవల ఆందోళనలు చేయడం దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. అకాల

కేజ్రీవాల్ నివాసానికి పోలీసులు



న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై ఆప్ ఎంఎల్‌ఎల దాడి కేసులో పోలీసులు విచారణ మొదలు పెట్టారు. శుక్రవారంనాడు ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంటికి పోలీసు బృందం వెళ్లింది. అక్కడి సిసిటివి, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఎదుటే తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ సిఎస్ చేసిన ఫిర్యాదు మేరకు సిసిటివిలు కావాలని అడిగామని, అయితే వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తామే సిఎం ఇంటికి వెళ్లి వాటిని స్వాధీన పరుచుకున్నట్టు అడిషినల్ డిసిపి హరేంద్ర సింగ్ మీడియాకు వెల్లడించారు. సిఎం నివాస నిర్వహణాధికారికి సమాచారం అందించాకే వెళ్లామన్నారు. కేజ్రీవాల్ ఇంట్లో మొత్తం 14 సిసిటివిలు ఉంటే వాటిలో ఏడు పనిచేయడం లేదన్నారు. మరికొన్నింటిలో 40నిమిషాలు ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు. ఇక దాడి జరిగిందని చెబుతున్న గదిలో సిసిటివి కెమెరాలు లేవని ఆయన వివరించారు. ఘటన ఈ నెల 19 అర్ధరాత్రి జరిగిందని భావిస్తున్నామన్నారు. మరోవైపు తన నివాసంలో పోలీసుల సోదాలను స్వాగతిస్తూనే కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోదాలు మంచిదేనని, అయితే జడ్జి లోయా హత్య కేసులో బిజెపి అధ్యక్షుడు అమిత్ షాను ఎప్పుడు ప్రశ్నిస్తారని నిలదీశారు. ఆయన తన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడినపుడు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు.

హెచ్ –1బి వీసా కఠినం

- ఐటి కంపెనీలు ఆధారాలతో అదనపు వివరాలివ్వాల్సిందే
- భారతీయులకు మరింత సంకట స్థితి



వాషింగ్టన్ : హెచ్1 బి వీసాల జారీ ప్రక్రియను అమెరికా కఠినతరం చేసింది. దీనికి సంబంధించి అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ అధికార యంత్రాంగం తాజాగా నూతన విధానాన్ని ప్రకటించింది. ఈ ప్రక్రియ ప్రత్యేకించి భారతీయ ఐటి కంపెనీలకు, వాటిలో పనిచేసే భారతీయ ఉద్యోగులకు సంకట స్థితిని తెచ్చిపెడుతుందని భావిస్తున్నారు. కొత్త సంవిధానం మేరకు ఇకపై కొత్తగా హెచ్ 1 బి వీసాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునే ఐటి కంపెనీలు అదనపు వివరాలను సమగ్ర రీతిలో పొందుపర్చాల్సి ఉంటుంది. తమ ఉద్యోగుల వివరాను అందించాల్సి ఉంటుంది. ఇందుకు సరైన ఆధారాలను కూడా జతచేయాల్సి ఉంటుంది. కొత్త సంవిధానం మేరకు పలు మార్గదర్శకాలను వెలువరించారు. 2019 ఆర్థిక సంవత్సరానికి హెచ్1 బి వీసాల దరఖాస్తు ప్రక్రియను ఏప్రిల్ రెండు నుంచి చేపడుతున్నట్లు అధికారికంగా వెల్లడించారు. దీనితో పలు ఐటి కంపెనీలలో కొత్త మార్గదర్శకాలపై సందడి నెలకొంది. ఈ వీసాలను ఆశిస్తున్న వారిలో ఇక ముందు ఏమి కానుందనే ఆందోళన తలెత్తింది. తాజా నిబంధనలతో మరింత విస్తృత స్థాయిలో ఆధారాలు, సంబంధిత పత్రాలు పొందుపర్చాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. హెచ్ 1 బి వీసాల ద్వారా విదేశీ ఉద్యోగులకు అమెరికాలో తాత్కాలిక ఉద్యోగాలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుత హెచ్ 1 బి వీసాల కాలపరిమితి మూడేళ్లుగా ఉంది. అయితే తాజా నిబంధనలలో దీనిని మూడేళ్ల కన్నా తక్కువకు కుదించాలని ఆదేశించారు. హెచ్ 1 బి వీసా కోసం దరఖాస్తు చేసుకునే ఉద్యోగులు ఇకపై తాము వృత్తిపరమైన నిర్దిష్ట అర్హతలతో ఉన్నట్లు నిరూపించుకోవల్సి ఉంటుం ది. తాజాగా ఏడు పేజీల నూతన మార్గదర్శక సూత్రాలను అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ వారు వెలువరించారు. అమెరికాలోని ఉద్యోగా లు అమెరికన్లకే, అమెరికా ఫస్ట్ నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ వలసదారుల నుంచి ఆందోళన వ్యక్తం కావడంతో ఇటీవలే కీలక గోష్టిలో ప్రతిభ ఆధారిత వీసాలకు తాము ప్రాధాన్యతను ఇస్తామని, ప్రతిభావంతులైన వారికి,ఇలాంటి వారితో ఉన్న సంస్థలకు ఏ విధమైన ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. అయితే ఇప్పటి నిబంధనలు తమ ఉద్యోగులకు గందరగోళం కలిగిస్తాయని భారతీయ ఐటి కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. భారతీయ కంపెనీలు ఎక్కువ సంఖ్యలో థర్డ్ పార్టీ వర్క్‌సైట్ ప్రాతిపదికన ఉద్యోగులను తీసుకుంటున్నారు. అయితే థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లో పనిచేసే పరిమిత కాలానికే ఈ హెచ్ 1బి వీసాలను ఇవ్వాలని తాజా నిబంధనలలో తెలిపారు. అంతేకాకుండా వీసా పరిమితిని కుదించారు. థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లో వీసాకు దరఖాస్తు చేసకునే ఉద్యోగి తాను ప్రత్యేకమైన వృత్తిలో నిర్దిష్ట అర్హతలు కలిగి ఉన్నట్లు నిరూపించుకోవాల్సి ఉంటుంది. సంబంధిత పత్రాలను సకాలంలోపొందుపర్చాల్సి ఉంటుంది.

వామపక్ష విద్యార్థి నేతపై ఎబివిపి దాడి



న్యూఢిల్లీ: తనను కొందరు ఎబివిపి సభ్యులు చంపేస్తానని బెదిరించారని శుక్రవారం ఢిల్లీ యూనివర్సిటీ వామపక్ష విద్యార్థి సంఘాల (ఎఐఎస్ఎ) అధ్యక్షురాలు కవల్ ప్రీత్ కౌర్ ఆరోపించారు. సత్యవతి కాలేజ్‌లో డిజిటల్ సేఫ్టీపై జరిగే చర్చలో ఒక స్పీకర్‌గా మాట్లాడేందుకు తాను వెళ్లానన్నారు. చర్చ ముగింపు దశలో ఉండగా ఆడిటోరియంలో అనేక మంది ఎబివిపి కార్యకర్తలు గుమిగూడి కార్యక్రమానికి అంతరాయం కలిగించారని కౌర్ పేర్కొన్నారు. తనపై దాడి చేసిన అనంతరం ప్రొఫెసర్లపై దాడికి పాల్పడ్డారన్నారు. పోలీసులు తనను రక్షించి తీసుకెళ్తుండగా ఆమెను ఎక్కడికి తీసుకెళ్తున్నారు, మాకు ఆమె ప్రాణం కావాలని పోలీసులను ప్రశ్నించారన్నారు. కాగా, ఈ ఆరోపణలను ఎబివిపి కాలేజ్ విద్యార్థుల జనరల్ సెక్రటరీ కునాల్ యాదవ్ ఖండించారు. విద్యార్థులను ఆమె రెచ్చగొట్టేందుకు యత్నించారని ఆరోపించారు.కౌరు ఫిర్యాదు మేరకు ఐపిసిలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు.

ఆదిమానవుని చిత్రకళ



లండన్ : వానరుడికి మనిషికి మధ్య ఉండే నియాన్‌డర్‌తల్ దశ జీవులే భూమిపై తొలి కళాకారులని వెల్లడైంది. ఇప్పటివరకూ ఆధునిక యుగ పు మానవుడే బొమ్మలను గీశాడని, చిత్రకళ అనేది ఆధునిక యుగంలోనే వెలిసిందనే వాదన ఉంది. అయితే ఇది సరికాదని స్పెయి న్ గుహలలో కనుగొన్న వర్ణచిత్రాలతో స్పష్టం అయింది. ఈ గుహాచిత్రాలు 64,000 సంవత్సరాల క్రితం నాటివని, యూరప్‌కు ఆధునిక మానవుడు ప్రవేశించడానికి 20,000 సంవత్సరాల ముందే ఈ బొమ్మలను అప్పటి నియాండర్‌తాల్స్ అద్భుతంగా రూపొందించారని వెల్లడైంది. బ్రిటన్‌లోని సౌతంప్టన్ యూనివర్సిటీకి చెందిన పురాతత్వవేత్త క్రిస్ స్టాండిష్‌తో కూడిన బృందం స్పెయిన్‌లో ఈ గుహా చిత్రాలను కనుగొంది. ఇది నిజంగా అద్భుతమైన ఆవిష్కరణ అని , పురాతన యుగపు మనుష్యులలోని కళాత్మకత ఏ విధంగా ఉందనేది అబ్బురపరుస్తోందని, ఇది ఇప్పటివరకూ ఉన్న అంచనాలకు భిన్నమైనదని క్రిస్ తెలిపారు. ఇప్పుడు తాము కనుగొన్న కళాఖండాలు ప్రపంచంలోనే అతి పురాతన గుహాచిత్రాలుగా నిర్ధారించవచ్చునని, ఆఫ్రికా నుంచి యూరప్‌కు ఆధునిక మానవుడు చేరడానికి కనీసం 20వేల సంవత్సరాల ముందే ఈ చిత్రాలు వెలిసినట్లుగా గుర్తించినట్లు, జంతువులు, గీతలు, సంఖ్యాశాస్త్ర సూచికలు వంటివి ఈ గుహలలో ఉన్నాయని వెల్లడించారు.వీటిని మం చుయుగపు మనుష్యులే గీసి ఉంటారని తెలిపారు. ఈ బొమ్మలను బట్టి ప్రాచీన మానవుడి ఆలోచన, కళా స్పందన ఏ విధంగా ఉందనేది స్పష్టం అవుతోందని, భావోద్వేగాలు,వ్యక్తీకరణలో మనిషి ఇప్పటి కం టే అప్పు డే మిన్నగా ఉండేవాడని స్పష్టం అవుతోందని బృందం స్పందించింది.

ప్రాచీన మనిషి ఆనవాళ్లు



'**సంబల్పూర్** : పురాతన మానవుడి ఆనవాళ్లు ఒడిషాలో లభించాయి. ఒడిషాలోని బర్‌గార్ జిల్లాలో పురాతత్వ శాఖ జరిపిన తవ్వకాలలో పలు కీలక ఆధారాలు లభించాయి. ప్రాచీన మానవుడు వాడిన పలురకాల పనిముట్లు, ఆయుధాలు ఇందులో లభ్యం అయినట్లు వెల్లడైంది. ప్రత్యేకించి రాతి గదులు, ఇతరత్రా ఆయుధాలు ఇక్కడ అప్పట్లో ప్రాచీన మానవుడు సంచరించిన దాఖలాలకు దారితీశాయి. సంబల్పూర్ వర్సిటీ పరిశోధకుల బృందం ఈ తవ్వకాలను చేపట్టింది. జీరా నదికి ఉపనది అయిన ఎగువ డాంటా ప్రవాహం వద్ద ఈ విశేష వస్తువులను పసికట్టినట్లు తెలిపారు. జిల్లాలోని తోరాజుంగా గ్రామం వద్ద వీటిని గుర్తించారు. ఇది ప్రాచీన మానవుడి ఉనికికి ఒక కీలక ఆయువు పట్టు అని వర్సిటీ చరిత్ర ప్రొఫెసర్ పికె బెహెరా తెలిపారు. మానవుడి వలస, దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థిరపడటం వంటి ప్రక్రియను జీర్ణించుకోవడానికి ఈ ఆవిష్కరణ దోహదం చేస్తుంది. తూర్పు, దక్షిణాఫ్రికాలలో వెలుగులోకి వచ్చిన ఆయుధాలు, పనిముట్లతో ఇక్కడి ఆవిష్కరణలు పోలి ఉన్నాయని వివరించారు.

నీరవ్ సంస్థకు ప్రియాంక గుడ్‌బై



ముంబై : నీరవ్ మోడీ వజ్రాల సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా ఇప్పుడు ఆ కంపెనీతో తన కాం ట్రాక్టును తెగదెంపులు చేసుకుంది. ఈ విషయాన్ని హీరోయిన్ తరపున ఆమె ప్రతినిధి వెల్లడించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)కు నీరవ్ మోడీ సంస్థ సుమారు 11,400 కోట్లు ఎగ్గొట్టగా, ఈ కేసులో విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ కంపెనీ ఆభరణాలకు ప్రియాంక గతంలో ప్రమోషన్ చేసింది. సిద్ధార్థ్ మల్‌హోత్రాతో కలిసి నీరవ్ మోడీ బ్రాండ్ కు సంబంధించిన టివి వాణిజ్య ప్రకటనల్లో కనిపించింది. 'అనేక ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో నీరవ్ మోడీతో వాణిజ్యపరమైన కాంట్రాక్టును ప్రియాంక చోప్రా వదులుకోవాలని నిర్ణయించుకున్నారు' అని ఆమె ప్రతినిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, ఇప్పటికే నీరవ్ మోడీతో తన కాంట్రాక్టు ముగిసిందని, దీనిపై తాను ఎలాంటి న్యాయపరమైన చర్యలు చేపట్టదల్చుకోలేదని ఇటీవల పిటిఐతో మాట్లాడుతూ సిద్ధార్థ్ మల్‌హోత్రా చెప్పాడు. అలాగే, మోడీ మేనమావ మెహుల్ చోక్సీకి చెందిన బ్రాండ్‌తో తన కాం ట్రాక్టు ముగిసినప్పటికీ తన ఫొటోలను ఇప్పటికీ ప్రకటనల్లో వాడుతున్నారని మరో బాలీవుడ్ నటి బిపాసా బసు తెలిపింది.

బ్యాంకు ఖాతాలు, షేర్ల స్తంభన : నీరవ్ మోడీకి చెందిన బ్యాంకు డిపాజిట్లు, రూ.44 కోట్ల విలువైన షేర్లను స్తంభింపజేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం నాడు వెల్లడించింది. దీంతో పాటు విలువైన విదేశీ వాచీలను జప్తు చేసినట్టు తెలిపింది. నగదు అక్రమ రవాణా నియంత్రణ చట్టం కింద నీరవ్ మోడీకి చెందిన రూ.30 కోట్ల విలువైన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశామని అధికారులు చెప్పారు. విలువైన విదేశీ గడియారాలు, 176 స్టీలు అల్మరాలు, 158 బ్యాక్సులు, 60 ఇతర కంటైనర్లు తదితరాలను గత వారం రోజులుగా నిర్వహించిన దాడుల్లో గుర్తించి జప్తు చేశామన్నారు. గురువారం నాడు రూ.100 కోట్ల విలువైన లగ్జరీ కార్లను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

సంగీత దర్శకుడి అసభ్య ప్రవర్తన

ముంబయి: సంగీత దర్శకుడు, గాయకుడు పపోన్ మ్యూజిక్ అసభ్యంగా ప్రవర్తించాడు. ఓ రియాల్టీ షోలో పాల్గొన్న మైనర్ బాలికను అకస్మాత్తుగా ముద్దుపెట్టుకున్నారు. సంబంధిత వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పపోన్ ప్రవర్తనను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు న్యాయవాది రుణ భుయాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'ది వాయిస్ ఇండియా కిడ్స్' అనే షోకు పపోన్ జడ్జిగా వ్యహరిస్తున్నారు. ఈ షోలో ఆయన హోలీ పాట 'రంగ్ బర్సే'ను ఆలపించారు. ఆ తర్వాత మైనర్ బాలిక దగ్గరికి వెళ్లి ఆమెకు రంగులు పూసి, ముద్దుపెట్టారు.రుణ భుయాన్ బాలల హక్కుల సంరక్షణ కింద పపోన్‌పై ఫిర్యాదు చేశారు. పపోన్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని న్యాయవాది భుయాన్ ఆరోపించారు.

కొఠారి, రాహుల్‌కు ట్రాన్సిట్ రిమాండ్



న్యూఢిల్లీ : రోటామాక్ యజమాని విక్రమ్ కొఠారి, ఆయన కుమారుడు రాహుల్‌ను సిబిఐకి ఒకరోజు ట్రాన్సిట్ రిమాండ్‌కు అనుమతిస్తూ ఢిల్లీ కోర్టు శుక్రవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. రూ.3695 కోట్ల రుణ ఎగవేత కేసులో వీరిద్దరినీ లక్నో కోర్టులో హాజరు పర్చాల్సిందిగా ఆదేశించింది. వీరిద్దరినీ శుక్రవారం నాడు అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సమర్ విశాల్ ఎదుట హాజరు పర్చగా, వారిని లక్నోకు తీసుకెళ్లడానికి రెండు రోజుల ట్రాన్సిట్ రిమాండ్‌కు అనుమతించాలని కోర్టుకు సిబిఐ విన్నవించింది. అయితే, కోర్టు ఒక రోజు రిమాండ్‌కు మాత్రమే అనుమతించింది. ఏడు బ్యాంకులతో కూడిన కన్సార్టియం 2008 నుంచి రోటామక్‌కు రూ.2919 కోట్ల రుణాలను అందించింది. రుణాలను చెల్లించకపోవడంతో వడ్డీలతో కలిసి ఈ మొత్తం రూ.3695 కోట్లకు చేరింది. దీంతో బ్యాంక్ ఆఫ్ బరోడా ఫిర్యాదుతో సిబిఐ రోటామాక్ యజమాని విక్రమ్ కొఠారి, ఆయన కుమారుడు రాహుల్‌లపై కేసులు నమోదు చేసింది. నీరవ్ మోడీలాగా విక్రమ్ కొఠారి, రాహుల్‌లు కూడా దేశం విడిచి పారిపోతారేమోనన్న ఆందోళనను సిబిఐ వ్యక్తం చేసింది.

చోరీలు చేస్తున్నాడని కట్టేసి కొట్టి చంపారు

సెల్ఫీల కోసం పోటీ పడిన స్థానికులు

పాలక్కాడ్ : దొంగతనానికి పాల్పడ్డాడనే కారణంతో ఓ వ్యక్తిని కట్టేసి కట్టెలతో దారుణంగా కొట్టారు. అలా కొడుతుంటే సాటి మనుషులుగా ఆపాల్సింది పోయి దాడి జరిగే సమయంలో సెల్ఫీల కోసం పోటీ పడ్డారు. ఈ ఘటన కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో గురువారం జరిగింది. వారి కిరాతనం అంతటితో ఆగలేదు. వారిలో కొంతమంది గాయాలతో కిందపడిపోయి సతమతమవుతున్న అతని వద్దకు వెళ్లి సెల్ఫీలు తీసుకున్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు సమాచారం తెలుసుకుని ఘటనాస్థలిని చేరుకుని తీవ్రంగా గాయాల పాలయిన ఆ యువకుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. ఆ 30 ఏళ్ల యువకుడిని గిరిజనుడైన మధుగా గుర్తించారు. కేరళలోని పాలక్కడ్ జిల్లాలో గల అత్తపాడి అనే గ్రామానికి సమీపంలో ఉన్న అడవిలో తిరుగుతూ బతికేస్తున్నాడు. అయితే, అతడు ఆ గ్రామంలోని దుకాణాల్లో తినుబండారాలు దొంగిలించి జీవనం సాగిస్తున్నాడని, కొద్ది రోజులుగా అతడిని పట్టుకోవడానికి తాము యత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు.అతడిపై ఇప్పటికే మూడు కేసులు నమోదయ్యాయని చెప్పారు. మధు ఓ దుకాణంలో చోరీ చేస్తుండగా సిసిటివిలో రికార్డయిన దృశ్యాలు కూడా ఉన్నాయని చెప్పారు. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, నిందితులుగా ఎవరి పేర్లను చేర్చలేదు. పోస్టు మార్టం అనంతరం మరణానికి కారణాలు తెలుస్తాయని, దాన్ని బట్టి కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు



ఉగ్రవాదంపై చర్చలు.. ఆరు ఒప్పందాలు

కెనడా ప్రధానితో మోడీ భేటీ



న్యూఢిల్లీ: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం విస్తృత చర్చలు జరిపారు. ప్రత్యేకించి ఉగ్రవాద , తీవ్రవాద నిరోధక అంశాలు, వాణిజ్య సంబంధాల వృద్ధి అంశాలు ఇరువురి మధ్య ప్రస్తావనకు వచ్చాయి. ప్రస్తుతం కుటుంబ సమేతంగా భారత పర్యటనలో ఉన్న ట్రూడోను ప్రధాని మోడీ రాష్ట్రపతిభవన్ వద్ద కలిశారు. అక్కడ ట్రూడో బృందానికి ఘన స్వాగతం లభించింది. అక్కడే ఉన్న ప్రధాని మోడీ తొలుత ట్రూడోకు కరచాలనం చేసి, ఆత్మీయతతో ఆలింగనం చేసుకున్నారు. ఆ తరువాత ట్రూడో సతీమణితో కరచాలనం చేశారు. తరువాత ట్రూడో కుటుంబ సభ్యులతో గ్రూప్ ఫోటో దిగారు. ట్రూడో దంపతులు వారిద్దరు పిల్లలతో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ప్రధాని మోడీతో ఫొటోలు దిగారు. ట్రూడో అక్కడికి వచ్చిన సందర్భంగా సైనిక గౌరవ వందనం లభించింది. వారం రోజుల క్రితం భారత్ పర్యటనకు ట్రూడో వచ్చిన సందర్భంగా ప్రధాని మోడీ ఆయనకు స్వాగతం పలకడానికి వెళ్లలేదు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఆయన పర్యటన సందర్భంగా వెంట ఎక్కడికి వెళ్లలేదు. దీనిపై అనేక రకాలుగా వార్తలు వెలువడ్డాయి. వీటికి ముగింపు పలుకుతూ కెనడా ముఖ్య అతిథికి ప్రధాని నుంచి సాదర ఆత్మీయ భావన వ్యక్తం అయింది. ప్రధానులిద్దరి మధ్య కీలక చర్చల సందర్భంగా ఇరుదేశాల మధ్య ఆరు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఇంధన రంగంలో సహకారం ఇందులో కీలకంగా ఉంది. ఇరువురు ప్రధానుల మధ్య దాదాపు రెండు గంటల సమావేశం తరువాత సంయుక్త విలేకరుల గోష్టి జరిగింది. ద్వైపాక్షిక బంధంపై పూర్తి స్థాయిలో చర్చలు జరిగినట్లు ఇరువురు నేతలు తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు రెండు దేశాలు కలిసికట్టుగా వ్యవహరించాల్సి ఉందని దీనిపై దృష్టి సారిస్తున్నట్లు ప్రకటించారు. రాజకీయ లబ్ధికి మత దుర్వినియోగం సహించరాని విషయం అని, స్వార్థ ప్రయోజనాల కోసం మత విద్వేషం తద్వారా తీవ్రవాదం వ్యాప్తి సరికాదని నేతలు స్పష్టం చేశారు. భారతదేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్ని సవాలు చేసే ఏ శక్తిని ఉపేక్షించేది లేదని కెనడా ప్రధాని సమక్షంలో భారత ప్రధాని తెలిపారు. ఖలీస్థాన్ అంశంపై కెనడా ప్రభుత్వం మెతక వైఖరి అవలంభిస్తోందనే విమర్శల నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.మతాన్ని సాకుగా చేసుకుని వేర్పాటువాదాన్ని ప్రోత్సహించే వారికి స్థానం లేదని ప్రధాని మోడీ హెచ్చరించారు. ఇండియా, కెనడా వంటి దేశాలకు ఉగ్రవాదం, తీవ్రవాదం పెను సవాళ్లుగా మారాయని ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో కెనడా ప్రధాని కుటుంబంతో పాటు ఆసక్తితో పర్యటించిన విషయాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కెనడా నేతకు భారతదేశ బహుళత్వం, అందులో ఇమిడి ఉన్న భిన్నత్వంలోని ఏకత్వం గురించి అవగాహన వచ్చి ఉంటుందన్నారు. ట్రూడో స్పందిస్తూ కెనడాకు భారతదేశం సహజమైన వాణిజ్య భాగస్వామ్య దేశం అని జవాబు ఇచ్చారు. అంతకు ముందు భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ కెనడా ప్రధానితో సమావేశం అయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ఖలీస్థాన్ పట్ల ట్రూడో అనుకూలత నేపథ్యంలో ఆయన పర్యటన దేశంలో వివాదాస్పదం అయింది. ప్రత్యేకించి పంజాబ్‌లో నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఖలీస్థాన్ అనుకూల వైఖరి సముచితం కాదనే అంశాన్ని పంజాబ్ సిఎం అమరీందర్ సింగ్ ట్రూడో దృష్టికి తెచ్చారు. అయితే తమ వైఖరి ఆ విధంగా లేదని, భారత్‌లో కానీ వేరే ఇతర చోట్ల కానీ తమ దేశం ఎక్కడా ఎప్పుడూ వేర్పాటువాదులకు ఊతం ఇవ్వలేదని, ఇక ముందు ఇవ్వబోదని ట్రూడో హామీ ఇచ్చారు.



సెజ్ చట్టంలోని లోపాల వల్ల ఉద్యోగులు రోడ్డున పడ్డారు : నాగేశ్వర్

మన తెలంగాణ / హైదరాబాద్ : సెజ్‌ల చట్టంలో కార్మికుల సంక్షేమం కోసం మార్పులు చేయాలని సూచించినా పాలకులు పెడచెవిన పెట్టారని, తాజాగా జెమ్స్ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డుపన పడడం ఇందుకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌రావు వ్యాఖ్యానించారు. పన్నెండేళ్ల పాటు గీతాంజలిలో పని చేసిన కార్మికులను నేడు యాజమాన్యం వెళ్ళిపోమ్మంటే ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. నీరవ్ మోడీకి 11వేల కోట్ల రూపాయలు ఇచ్చిన ప్రభుత్వాలు కార్మికుల జీతాల కోసం 11వేల రూపాయలు ఖర్చు పెట్టలేరా అని ఆయన ప్రశ్నించారు.సీఐటీయు ఆధ్వర్యంలో హైదరాబాద్ జెమ్స్ (గీతాంజలి గ్రూప్) పరిశ్రమ కార్మికుల ఉద్యోగ భద్రతపై శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ నాగేశ్వర్ పై విధంగా వ్యాఖ్యానించారు. జెమ్స్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధిని చూపించాలని, అప్పటి వరకు వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ జిల్లాల నుంచి వికలాంగులను తీసుకువచ్చి డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ ఇచ్చి 300 మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు. ఇందులో 100 మంది మహిళలు కూడా ఉన్నారన్నారు. ఉపాధి లభించడంతో వీరంతా తమ స్వగ్రామాలను వదిలి వెళ్ళి నగరంలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.

తాపీ గ్యాస్ పైప్‌లైన్‌కు శంకుస్థాపన

భారత్ సహా నాలుగు దక్షిణాసియా దేశాల ఉమ్మడి పథకం

సర్కెతబాత్ (తుర్కమనిస్థాన్) : వందలాది కోట్ల డాలర్ల ఖర్చుతో నిర్మించే గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టుకు అఫ్గాన్ భూభాగంలో శుక్రవారం నాడు శంకుస్థాపన ఘనంగా జరిగింది. తుర్కమనిస్థాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, భారత్ కలిసి నిర్మించే బృహత్ పథకం ఇది. దక్షిణాసియాలో ఇంధన కొరతను తీర్చే ఈ పథకం శంకుస్థాపన ఉత్సవంలో అఫ్గాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ, తుర్కమనిస్థాన్ అధ్యక్షుడు గుర్బంగూలి బెర్దీముఖమెదోవ్, పాకిస్థాన్ ప్రధాని సాహిద్ ఖాకన్ అబ్బాసీ, విదేశ వ్యవహారాల సహాయ మంత్రి ఎంజె అక్బర్ పాల్గొన్నారు. అఫ్గాన్, తుర్కమనిస్థాన్ సరిహద్దుల వద్ద గ్యాస్ నిక్షేపాలు అధికంగా గల ప్రాంతంలో ఈ ఉత్సవం జరిగింది. తుర్కమనిస్థాన్ దౌత్యాధికారులు, ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ ఉత్సవంలో ఆ దేశపు జాతీయ గీతాలు ఆలపించారు. సాంప్రదాయక సంచార జాతుల శిబిరాల్లో విందు ఏర్పాటు చేశారు. సర్కెతబాత్ వద్ద నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పేరు తాపీ గ్యాస్ పైప్‌లైన్ అని అఫ్గాన్ నేత తెలిపారు. ఈ నాలుగు దేశాలు కలిసి 1840 కి.మీ (1143 మైళ్ల) పైప్‌లైన్‌ను 2020 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ పథకం తుర్కమనిస్థాన్ లోని భారీ గాల్కినిష్ చమురు క్షేత్రం నుంచి ఉత్పత్తిని కూడా ప్రారంభించి గ్యాస్ పంపింగ్ సాగిస్తుంది. యుద్ధంతో చిన్నాభిన్నమైన అఫ్గానిస్థాన్‌కు ఇంధన కొరతను తీరుస్తుంది. 33 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఏటా పంపింగ్ చేస్తుం ది. ఈ గ్యాస్‌ను అధికంగా పాకిస్థాన్, భారత్ కొనుగోలు చేసే అవకాశం ఉంది. పాకిస్థాన్‌తో సఖ్యత లోపించిన భారత్ ఈ పథకంలో నిర్వహించే పాత్రపై గతంలో సందేహాలు వెలువడ్డాయి. అయితే ఇప్పుడు ఆ సందేహాలు సమసిపోయాయి. చైనాపై గ్యాస్ సరఫరాలపై అధికంగా ఆధారపడిఉన్న తుర్కమనిస్థాన్ ఈ పథకం ద్వారా సరఫరాల్లో భిన్నత్వాన్ని ఆశిస్తోంది.





మార్చి 13న నేపాల్ అధ్యక్ష ఎన్నిక

ఖాట్మండూ: మార్చి 13న నేపాల్ అధ్యక్ష ఎన్నిక జరగనున్నట్లు ఆ దేశం శుక్రవారం ప్రకటించింది. ఆ దేశ ప్రథమ మహిళా అధ్యరాలు బిద్యాదేవి భండారీ స్థానంలో కొత్త అధ్యక్షున్ని ఆ రోజు ఎన్నుకుంటారు. సాధారణంగా ఐదేళ్ల కోసారి జరగాల్సిన ఈ ఎన్నిక ఈ సారి రెండున్నరేళ్లకే జరుగుతోంది. కొత్త రాజ్యాంగం ప్రకారం పాత వ్యవస్థకు గుడ్‌బై చెప్పడంతో ఈ ఎన్నిక త్వరగా జరుగుతోంది. మూడవ అధ్యక్షుని ఎన్నిక తేదీని ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

పాక్ తీరుపై ట్రంప్ అసంతృప్తి



వాషింగ్టన్: ఉగ్రవాదంతో పాకిస్థాన్ సాగిస్తున్న పోరాటం తగిన స్థాయి లో లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పెదిమ విరిచారు. మొదటి సారి ఈ విషయంలో పాకిస్థాన్‌ను జవాబుదారీ చేస్తూ వైట్ హౌస్ ప్రకటన చేసింది. డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ రాజ్ షా ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) సమావేశం నేపథ్యంలో ఈ ప్రకటన చేశారు. ఉగ్రవాద సంస్థలకు నిధులు అందించే దేశాలపై అంతర్జాతీయ నిఘా జాబితాలో పాకిస్థాన్‌ను చేర్చుతున్నట్లు షా తెలిపారు. ఉగ్ర సంస్థలపై చర్యల విషయంలో పాక్ కొంత మెరుగుదల చూపినా అది సరిపోదని ఆయన అన్నారు. పాక్ అందించిన వివరాలతో ట్రంప్ సంతృప్తి చెందలేదని షా ప్రకటించారు.

లుపస్‌కు చికిత్స కనుగొన్న భారతీయుడు

ప్రొఫెసర్‌కు ప్రత్యేక గ్రాంటు, హూస్టన్ యూనివర్శిటీ మంజూరు

హూస్టన్ : 'లుపస్ ' (చర్మం మంట) వ్యాధికి కొత్త చికిత్సను కనుగొన్నందుకు భారతీయ సంతతికి చెందిన ప్రొఫెసర్, ఆయన ఇద్దరు సహచరులకు యూనివర్శిటీ ఆఫ్ హూస్టన్ నుంచి 6 లక్షల డాలర్ల ప్రైవేటు గ్రాంట్ లభించింది. ప్రొ. చంద్రమోహన్, ఆయన పరిశోధక బృందానికి ఈ గౌరవం దక్కింది. లుపస్ వ్యాధి త్వరగా బయటపడదు. ఇంతవరకు దానికి సరియైన చికిత్స లేదు. చర్మం మంటెక్కిపోయే ఈ వ్యాధికి చికిత్సను కనుగొన్నారు. ఆఫ్రికన్ –అమెరికన్‌లలో ఈ వ్యాధి అధికం. తర్వాత స్థానంలో స్పెయిన్ జాతీయులు నిలుస్తున్నారు.

150 సబ్సిడీ గొర్రెల పట్టివేత

మన తెలంగాణ/పెద్ద అడిశర్లపల్లి : గుంటూరుకు తరలిస్తున్న రాయితీ గొర్రెలు పట్టుబడిన సంఘటన పిఏ పల్లి మండలంలో చోటు చేసుకుంది. గుడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పిఏ పల్లి మండలం, అంగడిపేట స్టేజి వద్ద గురువారం తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేస్తుండగా సబ్సిడీ గొర్రెలను దేవరకొండ మండలం, పద్మటిపల్లికి చెందిన 6గురు లబ్దిదారులకు ప్రభుత్వం పంపిణీ చేసిన 150 సబ్సిడీ గొర్రెలను రెండు డీసీఎంలో అక్రమంగా గుంటూరుకు చెందిన కొమ్ము శ్రీను, మేకల ఎల్లయ్య అమ్మటానికి తరలిస్తున్నట్లు తెలిపారు. గుడిపల్లి పోలీసులు వారిని పట్టుకొని కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ ఎల్లయ్య, పిఏపల్లి తహశీల్దార్ నాగరాజు, ఆర్ఐ మల్లారెడ్డి, వీఆర్ఓ పున్న వెంకటయ్య తదితరులు ఈ సోదాల్లో పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు వద్ద మంటలు



మన తెలంగాణ/శంషాబాద్: ఎయిర్‌పోర్టు ప్రధాన గేటు వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరేట్ తాగి రోడ్డు పక్కన వేయడంతో రోడ్డు పక్కన ఉన్న చెత్త అంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఎయిర్‌పోర్టులోని రెండు అగ్ని మాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చాయి. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

సింగరేణిని ప్రైవేట్‌పరం చేసే కుట్ర

మన తెలంగాణ/హైదరాబాద్ : సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని టిఎన్‌టియూసి రాష్ట్ర అధ్యక్షులు బిఎన్. రెడ్డి విమర్శించారు. కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం బిఎన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం నుంచి నల్ల బ్యాడ్జీల నిరసన ప్రారంభించామన్నారు. 130 ఏండ్ల చరిత్ర ఉన్న సింగరేణి నుంచి 13వందల 10 మిలియల్ బొగ్గు ఈ 130 ఏండ్లలో తీశారన్నారు. ఇంకా 150 సంవత్సరాలకు సరిపడే బొగ్గు సింగరేణిలో ఉందన్నారు. గతంలో తాము అడ్డుకున్నప్పటికీ తడిచెర్లను ప్రైవేట్ పరం చేసిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. సింగరేణి కార్మికులకు జీతాల సవరణ చేయాలన్నారు.

అక్రమార్కులకు మోడీ అండ : విహెచ్

మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలో రోజుకో భారీ అవినీతి బయటపడుతోందని, విచ్చలవిడిగా దేశాన్ని దోచుకుంటున్న అక్రమార్కు లకు ప్రధాని మోడీ అండగా నిలిచి సామాన్య ప్రజలను ముంచుతున్నారని మాజీ ఎం.పి, ఎఐసిసి కార్యదర్శి వి.మనుమంతరావు విమర్శించారు. ఎఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ అనేక సార్లు మోడీ అవినీతిని ప్రస్తావించినా జవాబే లేదని, మోడీ తన 'మన్ కీ బాత్'లో దేశంలో జరుగుతున్న అవినీతిపై తన అభిప్రాయాన్ని ప్రకటించాలన్నారు. దేశ ప్రజల్లో అవినీతిపై తీవ్రమైన వ్యతిరేకత ఉందని, వచ్చే ఎన్నికల్లో మోడీని గద్దె దించుతారన్నారు.గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నల్ల ధనాన్ని వెలికితీస్తామన్న మోడీ ఇప్పుడు వారికే అండగా నిలిచి పేదల డబ్బులను దోచి పెడుతున్నారన్నారు.

కొత్త కార్పొరేషన్‌తో రుణాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ ఏర్పాటుతో రైతు పెట్టుబడి పథకం కింద ఎకరాకు రూ. 4 వేలు ఇవ్వడానికి వివిధ మార్గాల్లో రుణం సమకూర్చుకునేందుకు వెసులు బాటు ఏర్పడింది. ఏప్రిల్ 20నుంచి రైతులకు చెక్కులను పంపిణీ చేస్తామని ఇటీవల సిఎం ప్రకటించినందున అప్పటికల్లా డబ్బును సమ కూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే రిజర్వు బ్యాంకు నుంచి ముందస్తు రుణం కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. రైతు కార్పొరేషన్ ద్వారా ద్రవ్య సంస్థల నుంచి రుణం పొందడంపై కూడా దృష్టి సారించినట్లు తెలిసింది. పెట్టుబడి పథకానికి వానాకాలం సీజన్‌లో 1.62 కోట్ల ఎకరాలకు ఆర్థిక సాయం చేయడానికి రూ.6480 కోట్లు అవసరమవుతుందని ప్రభుత్వ అంచనా. ప్రత్యామ్నాయంగా కార్పొ రేషన్ ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంపై ఆలోచనలు చేస్తోంది.

ఆ ప్రమాదం తప్పించతగ్గదే

8 మంది భారతీయులు మరణించిన బ్రిటన్ ప్రమాదంపై విచారణ మొదలు



లండన్: ఇంగ్లండ్‌లో గత ఏడాది ఎనిమిది మంది భారతీయుల మరణానికి కారణమైన రోడ్డు ప్రమా దం 'తప్పించదగ్గదే' అని కోర్టుకు అధికారులు తెలిపారు. దక్షిణ బ్రిటన్‌లోని న్యూపోర్టు ప్యాగ్నల్‌లో ఆగస్టు 26న ఈ ప్రమాదం జరిగింది. దీనిపై రీడింగ్ క్రౌన్ కోర్టులో విచారణలు నిన్న మొదలయ్యాయి. ఈ ప్రమాదానికి ఇద్దరు ట్రక్కు డ్రైవర్ల నిర్లక్ష్యం కారణమని ప్రాసిక్యూషన్ పేర్కొంది. నాటింగ్ హామ్‌లోని కేరళకు చెందిన మినీ బస్సు డ్రైవర్ సిరియాక్ జోసెఫ్, మరి ఏడుగురు భారతీయ ప్రయాణీకులు ఈ ప్రమాదంలో మరణించారు. నాటింగ్ హామ్ నుంచి లండన్‌కు ఆ బస్సు ను 52 ఏళ్ల సిరియాక్ కిరాయికి తీసుకున్నారు. రిస్ జార్డ్ మాసీరాక్ అనే 31 ఏళ్ల పోలెండ్ జాతీయుడు, డేవిడ్ వాగ్ స్టాఫ్ అనే 53 ఏళ్ల బ్రిటీష్ జాతీయుడు ఈ కేసులో మరణ శిక్ష పడే అవకాశం ఉన్న ఏడు అభియోగాలను ఎదుర్కొంటున్నారు. వారు నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయకపోతే ప్రమాదం తప్పేదని ప్రాసిక్యూషన్ వాదించింది.

పశుగ్రాస కుంభకోణం కేసులో లాలూకు బెయిల్ తిరస్కరణ


రాంచి : పశుగ్రాస కుంభకోణానికి సంబంధించి బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం జార్ఖండ్ హైకోర్టు తిరస్కరించింది. ధియోఘర్ ట్రెజరీ నుంచి మోసపూరితంగా రూ.89.27లక్షలు ఉపసంహరించుకున్నారని ఆయనపై కేసు నమోదయింది. కుంభకోణం జరిగిన కాలంలో లాలూ ప్రసాద్ ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా కొనసాగారని జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ నివేదికను కొన్నేళ్లపాటు ఆయన ముందుంచినప్పటికీ ఎటువంటి చర్య తీసుకోలేదని ధర్మాసనం పేర్కొంది. కుంభకోణాలన్ని ఆయనకు తెలిసే జరిగి ఉంటాయని భావించి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నామని తెలిపింది. పశుగ్రాస కుంభకోణం కేసులో లాలూ ప్రసాద్‌ను దోషిగా తేల్చిన సిబిఐ ప్రత్యేక కోర్టు డిసెంబర్ 23న ఆయనకు మూడున్నరేళ్లు జైలు శిక్ష విధించింది. దీంతో రాంచిలోని బిర్సా ముండా జైలులో ఆయన శిక్ష అనుభవిస్తున్నారు. లాలూ ప్రసాద్ ఇప్పటి వరకు మూడు కేసుల్లో దోషిగా తేలారు. చైబాసా ట్రెజరీకి సంబంధించి రెండు కేసులలోఆయనను తక్షణమే దోషిగా నిర్ధారించారు.

ఒడిశాలో మంత్రి సోదరుడు సహా నలుగురికి గాయాలు

బర్‌గర్: ఒడిశాలో దుండగులు దాడి చేయడంతో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుశాంత్ సింగ్ సోదరుడు, మరో ముగ్గురు గాయపడ్డారు. శుక్రవారం తెల్లవారు జామున బనబీరా ప్రాంతం లోని ఉప ఎన్నికలు జరిగే బిజేపూర్ అసెంబ్లీ నియోజకవర్గ సమీపంలో ఘటన చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. బర్‌గర్ జిల్లాలో మంత్రి సోదరుడు సుబ్రత్‌సింగ్, పలువురు కార్యకర్తలతో వెళ్తున్న కారును అడ్డగించిన దుండగు లు వారిపై దాడికి పాల్పడ్డారని జిల్లా అదనపు ఎస్‌పి యశోబాంత్ సేనాపతి తెలిపారు. కారుకు నిప్పు బెట్టిన దుండగులు, రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేశారు. గాయపడ్డవారిని మెరుగైన వైద్య చికిత్స కోసం బుర్లాలోని విమ్సార్ ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం బిజేపూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక జరగనుంది, ఫిబ్రవరి 28న ఓట్లను లెక్కించనున్నారు.


భూమాయగాళ్ల అరెస్టు

- కేసు నమోదు విషయం చంద్రయ్య యాదవ్‌కు ముందే ఉప్పందించిన పోలీసు ఎస్పీవో
- కాల్ లిస్టులో దొరికి పోయిన కానిస్టేబుల్ - ఇంకా పరారీలోనే చంద్రయ్య



మన తెలంగాణ/ హైదరాబాద్ / బాచుపల్లి: కుత్బుల్లాపూర్ బాచుపల్లిలో విలువైన భూములకు నకిలీ పత్రాలు సృష్టించిన ముఠాలోని ముగ్గురు నిందితులను బాచుపల్లి పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. బాచుపల్లి సిఐ బాలకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బాచుపల్లి లోని రహదారి ప్రక్కన గల సర్వేనంబర్లు 140, 141 లలో దాదాపు వంద కోట్ల విలువైన 32ఎకరాల భూమికి సూరారంలో నివసించే రామచంద్రుడు అలియాస్ చంద్రయ్య యాదవ్, మాజీ కార్పోరేటర్ సూర్యనారాయణరెడ్డిఅలియాస్ గుడిమెట్ల సురేశ్‌రెడ్డిలు కలిసి మేడ్చల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది సాయి కృష్ణ, మురళికృష్ణల సహాయంతో బుక్1, వాల్యూం 440లో 7 మార్టిగేజ్ డాక్యుమెంట్లు దొంగిలించి 6 నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వాటిల్లో పొందుపరిచారు . వాటిలో ఒక డాక్యుమెంట్ బాచుపల్లి గ్రామంలోని సర్వేనంబర్‌లో 140,141 ,ఉన్న సుమారు 32 ఎకరాల భూమికి సంబంధించినది కాగా మిగతా 5 డాక్యుమెంట్లు సూరారం, గాజులు రామారం గ్రామాలకి చెందిన భూములవి. బాచుపల్లిలోని భూ విక్రయానికి ప్రయత్నించగా సదరు భూ యజమాని కూకట్‌పల్లికి చెందిన దామోదర్ రావుకు తెలియడంతో ఆయన బాచుపల్లి పోలీసులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తీగలాగితే డొంక మొత్తం కదిలింది. సురేశ్‌రెడ్డి,సాయి,మురళిలను పోలీసులు అదుపులోకి తీసుకోగా ప్రధాన నిందితుడు చంద్రయ్య ఇంకా పరారీలోనే ఉన్నాడు. రెండు రోజులు విచారించిన పోలీసులు ప్రధాన నిందితుడు చంద్రయ్య యాదవ్ దొరకకపోవడంతో ముగ్గురు నిందితులను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో దామోదర్‌రావు చంద్రయ్య యాదవ్ ,సురేశ్‌రెడ్డి లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయానికి మార్కెట్ లో పెట్టారని ఆధారాలతో సహ ఫిర్యాదు చేయగానే వెంటనే ప్రధాన నిందితుడైన చంద్రయ్యయాదవ్‌కు బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లోనే పనిచేసే ఒక ఎస్పీవో ఫోన్‌లో సమాచారాన్ని చేరవేశా డు. దీంతో అలర్టైన చంద్రయ్య యాదవ్ పోలీసులకు దొరక్కుండా అజ్ఞాతంలోకి వెళ్లి పోయాడు, పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలించి నా శుక్రవారం వరకు కూడా అతని జాడ తెలియకపోవడంతో అతని ఫోన్ కాల్స్ లిస్టు తీయగా ఎస్పీవో రెండు రోజులగా చంద్రయ్య యాదవ్‌తో టచ్‌లో ఉన్నట్టు తేలడంతో ఉన్నతాధికారులు అతనిపై సస్పెన్షన్ వేటు వేశారని విశ్వసనీయ సమాచారం.

విభజన సమస్యల పరిష్కారంలో మరింత జాప్యం!



మన తెలంగాణ / హైదరాబాద్ : రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న పలు వివాదాల పరిష్కారంతో పాటు తొమ్మిదవ, పదవ షెడ్యూలులోని సంస్థల విభజనపై ఏకాభిప్రాయం, నిర్ణయం రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాలూ బడ్జెట్ తయారీ, అసెంబ్లీ సమావేశాల నిర్వహణలో తలమునకలై ఉన్నందువల్ల కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన సమావేశం వాయిదా పడడంతో పాటు ఈ నెల 27న జరగాల్సిన సమావేశం కూడా వాయిదా పడింది. రాష్ట్రాల బడ్జెట్ సమావేశాలు ముగిసేంతవరకూ మళ్ళీ సమావేశాలు నిర్వహించాలన్న ఆలోచన రెండు రాష్ట్రాలకూ లేదు. మరోవైపు జూన్ మొదటివారంకల్లా హైకోర్టు విభజన ఒక కొలిక్కి వస్తుందని, రెండు రాష్ట్రాల్లో వేర్వేరు హైకోర్టులు ఉంటాయని భావించినా హైకోర్టు న్యాయమూర్తుల అమరావతిలో కమిటీ క్షేత్రస్థాయి పర్యటన జరిపి భవనాలను పరిశీలించిన తర్వాత అనువుగా లేవన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతో ఆ ప్రక్రియకు కూడా తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది. ఢిల్లీలోని ఉమ్మడి భవన్ విభజనకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఇప్పటికే స్పష్టమైన విధానాన్ని ప్రకటించడంతో ఆ మేరకు రెండు రాష్ట్రాల మధ్య భవనాల, స్థలం విభజన జరగడానికి సంయుక్త కమిటీ ఏర్పాటైనా ఇప్పటివరకూ ఒక్క సమావేశం కూడా జరగలేదు. పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని పదమూడవ షెడ్యూలులో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి తేదీని ఖరారు చేసి రైల్వే, మానవ వనరుల అభివృద్ధి, వాణిజ్య, ఉక్కు తదితర మంత్రిత్వశాఖల అధికారులకు సమాచారం ఇచ్చినా కొన్ని అనివార్య కారణాలతో ఆ సమావేశం కూడా వాయిదా పడింది. ఈ నెల 23వ తేదీన సమావేశం తేదీని ఖరారు చేసినా బడ్జెట్ తయారీ కారణంగా హాజరుకాలేకపోతున్నట్లు తెలంగాణ సిఎస్ లేఖ రాయడంతో ఆ సమావేశం కూడా వాయిదా పడింది. మళ్ళీ సమావేశం ఏర్పాటు చేయాలంటే ఈ మంత్రిత్వశాఖల అధికారులంతా రావాల్సి ఉంటుంది కాబట్టి వచ్చే నెల 5వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్న కేంద్ర బడ్జెట్ పార్లమెంటు సమావేశాల దృష్ట్యా మళ్ళీ ఇప్పట్లో జరిగే అవకాశం లేదని రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఇక రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఈ నెల 27వ తేదీన సమావేశం కావాలని ముందుగానే నిర్ణయించుకున్నా బడ్జెట్ సమావేశాల కారణంగా అది కూడా వాయిదా పడింది. వివిధ కారణాలతో ఒక్కో సమావేశం వాయిదా పడుతుండడంతో ఉమ్మడి సంస్థల విభజనతో పాటు అందులోని ఉద్యోగుల విభజన, పలు వివాదాల పరిష్కారం మరింత జాప్యం అయ్యే అవకాశం ఉంది. తొమ్మిదవ, పదవ షెడ్యూళ్ళలోని సంస్థల విభజన రాజకీయ నిర్ణయంతో ముడిపడి ఉన్నందువల్ల బడ్జెట్ సమావేశాలు పూర్తికాగానే ఎన్నికల మూడ్‌లోకి వెళ్ళిపోయే అవకాశం కూడా లేకపోలేదని, దాదాపు సాధారణ ఎన్నికలు జరిగేంత వరకు పెద్దగా వివాదం లేని సమస్యలు పరిష్కారమవుతాయి తప్ప కీలకమైనవి పెండింగ్‌లోనే ఉండే అవకాశం ఉందని అధికారి అభిప్రాయపడ్డారు.

ఆస్ట్రేలియా ఉప ప్రధాని రాజీనామా?


మెల్‌బోర్న్: లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియా ఉప ప్రధాని బార్నబె జాయిస్ ఎట్టకేలకు పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం గర్భవతిగా ఉన్న మాజీ సహాయకురాలితో సంబంధం, లైంగిక ఆరోపణల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. బార్నబె జాయిస్ సోమవారం అధికారికంగా పదవి నుంచి తప్పుకుంటారని ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ ప్రకటించారు. సోమవారం జరిగే పార్టీ సమావేశంలో నేషనల్ పార్టీ నాయకత్వానికి, ఉప ప్రధాని పదవులకు రాజీనామా సమర్పించనున్నట్లు బార్నబె జాయిస్ తెలిపారు.

త్వరలో బాబ్లీ నీటి విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్: బాబ్లీ గేట్లు తెరిచి నీటిని విడుదల చేయాలని మహారాష్ట్ర అధికారులను తెలంగాణ ప్రభుత్వం కోరింది. శ్రీరాంసాగర్ దిగువన ఉన్న నీటి డిమాండ్‌తో బాబ్లీ గేట్లను మార్చి 1న తెరవాలని లేఖ రాసింది. అయితే తమ వద్ద తీవ్ర మంచినీటి కొరత ఉన్నందున కొంత ఆలస్యంగా తెరుస్తామని మహారాష్ట్ర అధికారులు చెప్పినట్లు తెలిసింది. దీంతో మరో రెండు, మూడు రోజుల్లో బాబ్లీ గేట్లు తెరవడంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నారసింహుడి ఎదుర్కోళ్ల వైభవం

నేడే శ్రీవారి తిరుకల్యాణోత్సవం



మన తెలంగాణ/యాదాద్రి : శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీస్వామివారి ఎదుర్కోళ్ల మహోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఏడవ రోజైన శుక్రవారం రోజు ఉదయం ఆలయంలో నిత్యవాహనములు పారాయణీకులచే మూలమంత్ర మూర్తి మంత్ర జపములు దివ్య ప్రబంధారి పారాయణములు నిర్వహించబడినవి. అనంతరము శ్రీస్వామివారి బ్రహ్మోత్సవ సంబంధమైన శ్రీ స్వామివారిని జగన్మోహిని అలంకారములో అలంకరించి ఆలయ తిరువీధులలో ఉత్సవ సేవను ఊరేగించగా భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారి ఆలయంలో నిత్యపూజలలో భాగంగా పారాయణ ములను మూలమంత్ర జపములను ఉచ్చరించి స్వామివారి అశ్వవాహన సేవ అలంకారంతో పెండ్లికి సిద్ధమైన లక్ష్మి నారసింహుడిని పెండ్లికొడుకుగా, అమ్మవారిని పెండ్లికూతురిగా ఊరేగించి ఆలయ మండపంలో చూడ ముచ్చటగా ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవ వేడుకలలో అమ్మ వారిని, స్వామివారిని ఎదురెదురుగా కొలువుదీర్చి, పెండ్లిముహూర్తాన్ని ఖాయం చేయుటకు అర్చక స్వాము లు, ఆలయ ధర్మకర్త లు పెండ్లి పెద్దలుగా వ్యవహరించి మాటముచ్చటగా సాగిన ఆహ్లాదకరమైన పదాలతో వధూవరుల విశిష్టతలను సౌందర్యమైన రూపాలను వర్ణిస్తూ సాగిన ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని భక్తజనులు తిలకించి దర్శించు కున్నారు. స్వామివారి కల్యాణ ముహూర్తాన్ని ఇరువర్గాల పెద్దలుగా వేద పండితులు, ఆలయ అర్చకులు సుముహూర్తం తుల లగ్నంలో ముహుర్తాన్ని ఖరారు చేశారు. ఈ ఎదుర్కోళ్ల మహోత్సవ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీ నరసింహాచార్యులు ఎదుర్కోళ్ల విశిష్టతను తెలుపగా పభుత్వవిప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనీతరామచెంద్రన్, ధర్మకర్త నరసింహమూర్తి, ఇవో ఎన్.గీత, అర్చకులు నర్సింహ్మాచారి, భాస్కరాచార్యులు, సంపతాచార్యులు, ఆలయ ఉద్యోగులు భాస్కరాశర్మ, చంద్రశేఖర్,చలమయ్యచారి, సురేందర్ రెడ్డి, రాజన్‌బాబు,, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విమర్శల సుడిలో హార్దిక్



ముంబయి: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను విమర్శించే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఘోర వైఫల్యం నేపథ్యంలో అతనిపై విమర్శలు రెట్టింపు అయ్యాయి. సుదీర్ఘ దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఒక్క తొలి టెస్టులో మినహా పాండ్య రాణించిన దాఖలలు లేనేలేవు. ఇటు బంతితో, అటు బ్యాట్‌తో ఘోర వైఫల్యం చవిచూస్తున్నాడు. జట్టులో ఉన్న ఏకైక ఆల్‌రౌండర్‌గా మూడు ఫార్మాట్‌లలోనూ తుది జట్టులో స్థానం దక్కించుకుంటున్నాడు. వరుస వైఫల్యాలు చవిచూస్తున్నా అతన్ని ఎందుకు జట్టులో కొనసాగిస్తున్నారో తనకు అంతుబట్టకుండా మారిందని మాజీ క్రికెటర్ రోజర్ బిన్ని అన్నాడు. కెప్టెన్ కోహ్లి అండతోనే హార్దిక్ జట్టులో స్థానాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నాడని బిన్ని విమర్శించాడు. ఒకటి రెండు మ్యాచుల్లో రాణించినంత మాత్రాన అతన్ని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్‌తో పోల్చడం ఏంటని ప్రశ్నించాడు. ఇదిలావుండగా సోషల్ మీడియా వేదికగా కూడా నెటిజన్లు కూడా పాండ్యపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. అతన్ని హాలీవుడ్ చిత్రం బ్లాక్ పాంథర్ చిత్రంలో విలన్ పాత్ర పోషించిన మైఖేల్ బి జోర్డాదన్‌తో పోల్చుతున్నారు. ప్రస్తుతం పాండ్య కూడా హీరోగా ఉంటూనే జట్టుకు విలన్‌గా మారాడని వ్యంగ్యాస్త్రాలువ్యంగ్యాస్త్రాలు వదిలారు.

గెలిచిన జట్టుదే!

సిరీస్ కోసం భారత్–సౌతాఫ్రికా అమీతుమీ

నేడు చివరి టి–20




రైనాకు కీలకం

కేప్‌టౌన్: సీనియర్ ఆటగాడు సురేశ్ రైనాకు శనివారం దక్షిణాఫ్రికాతో జరిగే చివరి మ్యాచ్ చాలా కీలకంగా మారింది. ఇప్పటికే రెండు మ్యాచులు ఆడిన రైనా ఆశించిన స్థాయిలో సత్తా చాటలేక పోయాడు. టీమిండియాలో చోటు కోసం విపరీత పోటీ నెలకొన్న నేపథ్యంలో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో రైనా విఫలమయ్యాడనే చెప్పాలి. తుది జట్టులో స్థానం భారత్‌లో ఆరోగ్యకర పోటీ ఉన్న విషయం తెలిసిందే. యువ ఆటగాళ్లు లోకేష్ రాహుల్, రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేదార్ జాదవ్, కరుణ్ నాయర్, సంజూ శాంసన్ తదితరులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైనాకు జట్టులో చోటు కాపాడుకోవడం అనుకున్నంత తేలికకాదు. ఏమాత్రం అవకాశం దొరికినా జట్టులో స్థానాన్ని దక్కించుకునేందుకు రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లు పొంచి ఉన్న తరుణంలో రైనా భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా రాణిస్తే రానున్న శ్రీలంక సిరీస్‌లో జట్టులో స్థానం నిలబెట్టుకునే అవకాశాలు ఉంటాయి. లేకుండా అతని స్థానం గల్లంతు కావడం ఖాయం. కాగా, తొలి రెండు మ్యాచుల్లో కళ్లు చెదిరే రీతిలో బ్యాటింగ్ ప్రారంభించిన అంతే వేగంగా వికెట్లను చేజార్చుకుని నిరాశ పరిచాడు. ఈ నేపథ్యంలో చివరి టి–20 మ్యాచ్ రైనాకు చాలా కీలకమని చెప్పక తప్పదు.

సిరీస్ మాదే: కోహ్లి

దక్షిణాఫ్రికాతో జరిగే టి–20 సిరీస్‌ను గెలుచుకుంటామనే ధీమాను టీమిండియా కెప్టెన్ కోహ్లి వ్యక్తం చేశాడు. రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా అద్భుతంగా ఆడిందని, అందువల్లే వారికి విజయం దక్కిందన్నాడు. అయితే శనివారం జరిగే మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతామన్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బౌలర్లు, బ్యాట్స్‌మెన్ జట్టులో ఉన్నారన్నాడు. చివరి మ్యాచ్‌లో సమష్టిగా రాణించడం ద్వారా సిరీస్‌ను సొంతం చేసుకుంటామన్నాడు. కిందటి మ్యాచ్‌లో విజయానికి సౌతాఫ్రికా అన్ని విధాలుగా అర్హురాలని అభిప్రాయపడ్డాడు. క్లాసెన్, డుమిని చిరస్మరణీయ బ్యాటింగ్‌తో తమ నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారన్నాడు. అయితే చివరి మ్యాచ్‌లో మాత్రం తమను ఓడించడం అనుకున్నంత తేలిక కాదని కోహ్లి స్పష్టం చేశాడు.





కేప్‌టౌన్: ఫలితాన్ని తేల్చే కీలకమైన మూడో ట్వంటీ–20 మ్యాచ్‌కు ఆతిథ్య దక్షిణాఫ్రికా, టీమిండియా జట్లు సిద్ధమయ్యాయి. ఇరు జట్లు చెరో మ్యాచ్‌లో విజయం సాధించడంతో శనివారం జరిగే చివరి మ్యాచ్ కీలకంగా మారింది. ఇందులో గెలిచిన జట్టుకు సిరీస్ దక్కుతుంది. తొలి మ్యాచ్‌లో భారత్ జయభేరి మోగించగా, రెండో టి–20లో సఫారీ జట్టు జయకేతనం ఎగుర వేసింది. దీంతో సిరీస్ ఫలితాన్ని తేల్చే ఆఖరి మ్యాచ్ కోసం ఇరు జట్లు భారీ వ్యూహాలతో సిద్ధమయ్యాయి. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. దీంతో చివరి సమరం హోరాహోరీగా సాగడం ఖాయం. కిందటి మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది. మరోవైపు వన్డే సిరీస్‌లో ఎదురైన పరాభవానికి టి–20లో ప్రతీకారం తీర్చుకునేందుకు సౌతాఫ్రికా తహతహలాడుతోంది. కిందటి మ్యాచ్‌లో అసాధారణ రీతిలో చెలరేగిపోయిన హెన్రిక్ క్లాసెన్‌పై దక్షిణాఫ్రికా భారీ ఆశలు పెట్టుకొంది. మరోవైపు సెంచూరియన్‌లో జరిగిన పొరపాట్లకు ఈసారి తావివ్వకుండా ఆడాలనే లక్ష్యంతో భారత్ ఉంది. ఈ మ్యాచ్‌తో సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనకు తెరపడుతుంది. టెస్టు సిరీస్‌ను సౌతాఫ్రికా సొంతం చేసుకోగా, భారత్ వన్డేల్లో విజేతగా నిలిచింది. ఈ పరిస్థితుల్లో టి–20 సిరీస్ ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

రోహిత్‌కు పరీక్ష!



సిరీస్‌లో ఆడిన రెండు మ్యాచుల్లో కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరిన ఓపెనర్ రోహిత్ శర్మకు ఈ మ్యాచ్ సవాలుగా మారింది. వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న రోహిత్ ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటున్నాడు. టెస్టు, వన్డే సిరీస్‌లలో అంతంత మాత్రంగానే రాణించిన రోహిత్ టి–20లలో కూడా నిరాశ పరిచాడు. రెండు మ్యాచుల్లో కూడా మంచి ఆరంభం లభించినా దాన్ని భారీ స్కోరుగా మలచడంలో విఫలమయ్యాడు. ఇక, ఫలితాన్ని తేల్చే కీలకమైన మ్యాచ్‌లోనైనా తన బ్యాట్‌కు పని చెప్పాల్సిన బాధ్యత రోహిత్‌పై ఉంది. అతను చెలరేగితే దక్షిణాఫ్రికాపై భారీ స్కోరును సాధించడం భారత్‌కు కష్టమేమి కాదు. మరోవైపు భీకర ఫాంలో ఉన్న మరో ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా ఈ మ్యాచ్‌లో మెరుపులు మెరిపించాల్సి ఉంటుంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన ధావన్ సిరీస్‌లో మెరుగైన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. ఈసారి కూడా జట్టుకు కీలకంగా మారాడు.

రైనా మెరవాలి...

మరోవైపు ఆడిన రెండు మ్యాచుల్లో కూడా అంతంత మాత్రంగానే రాణించిన సీనియర్ ఆటగాడు సురేశ్ రైనాకు కూడా చివరి మ్యాచ్ కీలకంగా మారింది. జట్టు అతనిపై పెట్టుకున్న ఆశలను నిలబెట్టాల్సిన బాధ్యత అతనిపై ఉంది. తొలి రెండు మ్యాచుల్లో రైనా స్థాయికి తగ్గ ఆటను కనబరచడంలో విఫలమయ్యాడు. యువ క్రికెటర్లతో తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో రైనా తన ఆటను మెరుగు పరుచుకోక పోతే భవిష్యత్తులో టీమిండియా చోటు సంపాదించడం కష్టమేనని చెప్పక తప్పదు. ఈ మ్యాచ్ రైనా సత్తా సవాలు వంటిదేనని విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు. రానున్న శ్రీలంక సిరీస్ నేపథ్యంలో జట్టులో స్థానం కాపాడుకోవాలంటే ఆఖరి మ్యాచ్‌లో మెరుగైన బ్యాటింగ్‌ను కనబరచడం రైనా ముందున్న ఏకైక మార్గంగా చెప్పాలి. ఇందులో విఫలమైతే మాత్రం టీమిండియా ఆవకాశాలకు ఫుల్‌స్టాప్ పడడం ఖాయం.

కోహ్లిపైనే ఆశలు...

ఇక, ఈ మ్యాచ్‌లో భారత్ కెప్టెన్ విరాట్ కోహ్లిపై భారీ ఆశలు పెట్టుకుంది. వన్డేల్లో ఒంటిచేత్తో జట్టుకు సిరీస్‌ను సాధించి పెట్టిన కోహ్లి కిందటి మ్యాచ్‌లో డకౌటయ్యాడు. దీని ప్రభావం జట్టుపై తీవ్రంగానే పడింది. కాగా, సిరీస్ ఫలితాన్ని తేల్చే కీలకమైన మూడో టి–20లో కోహ్లి మెరుపులు మెరిపించాల్సి ఉంది. అతను చెలరేగితే సౌతాఫ్రికా బౌలర్లకు కష్టాలు ఖాయం. మరోవైపు కిందటి మ్యాచ్‌లో మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచిన మనీష్ పాండే, మహేంద్ర సింగ్‌లు కూడా ఈ మ్యాచ్‌లో బ్యాట్‌ను ఝులిపించాలి. సెంచూరియన్‌లో ఇద్దరు అర్ధ సెంచరీలతో కదం తొక్కిన విషయం తెలిసిందే. క్లిష్ట సమయంలో బ్యాటింగ్‌కు దిగిన వీరిద్దరూ సౌతాఫ్రికా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ జట్టుకు భారీ స్కోరును అందించారు. ఈ మ్యాచ్‌లో కూడా జట్టు వీరిపై భారీ ఆశలే పెట్టుకుంది. ఇక, పేలవమైన ఆటతో నిరాశ పరుస్తున్న హార్దిక్ పాండ్య కనీసం ఈసారైన తన పాత్రకు న్యాయం చేస్తాడా లేదా అన్నది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. వరుస వైఫల్యాలు చవిచూస్తున్న అతనికి స్థానం కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా కెప్టెన్ కోహ్లి, ప్రధాన కోచ్ రవిశాస్త్రి పాండ్యకు తుది జట్టులో స్థానాన్ని కల్పిస్తూనే ఉన్నారు. అయితే ఈ మ్యాచ్‌లో విఫలమైతే మాత్రం రానున్న సిరీస్‌లో జట్టులో చోటు సంపాదించడ అంత తేలిక కాదనే చెప్పాలి.

జట్ల వివరాలు:

భారత్: విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, ధావన్, రైనా, మహేంద్ర సింగ్ ధోని, మనీష్ పాండే, దినేష్ కార్తీర్, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, శార్దూల్ ఠాకూర్, చాహల్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, జైదేవ్ ఉనద్కట్, లోకేష్ రాహుల్.

దక్షిణాఫ్రికా: డుమిని (కెప్టెన్), రీజా హెంద్రిక్స్, స్మట్స్, డేవిడ్ మిల్లర్, క్లాసెన్, క్రిస్ మోరిస్, ఫెలుక్‌వాయో, జూనియర్ డాలా, ప్యాటర్సన్, అరోన్ ఫంగిసో, ఫర్హాన్ బెహార్డిన్, క్రిస్టియాన్ జోన్కర్, తబ్రెస్ షంసి.

క్లాసెన్‌తో ప్రమాదం..

కిందటి మ్యాచ్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌తో భారత్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్న విధ్వంసక ఆటగాడు హెన్రిక్ క్లాసెన్‌తో భారత బౌలర్లకు ప్రమాదం పొంచి ఉంది. ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్న క్లాసెన్‌ను ఎంత త్వరగా కట్టడి చేస్తే భారత్‌కు అంత మంచిది. ఒకవేళ అతను కుదురుకుంటే మాత్రం మ్యాచ్‌ను కాపాడుకోవడం చాలా కష్టమని చెప్పక తప్పదు. ఇప్పటికే వన్డేల్లో, టి–20లో భారత్ క్లాసెన్ దెబ్బను చవిచూసింది. కిందటి మ్యాచ్‌లో క్లాసెన్ భారత ప్రధాన అస్త్రం చాహల్‌ను లక్ష్యంగా చేసుకున్నాడు. అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడంతో చాహల్ గతి తప్పాడు. దీని ప్రభావం ఇతర బౌలర్లపై కూడా పడింది. కాగా, కిందటి మ్యాచ్‌లో ఫాస్ట్ బౌలర్లు భువనేశ్వర్, శార్దూల్, ఉనద్కట్‌లు ఓ దశలో బాగానే బౌలింగ్ చేశారు. అయితే క్లాసెన్, డుమిని కుదురు కోవడంతో వారికి కష్టాలు తప్పలేదు. కాగా, ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయాలనే పట్టుదలతో భారత్ ఉంది. క్లాసెన్, డుమిని, బెహార్డిన్, హెన్‌డ్రిక్స్, మిల్లర్‌లను త్వరగా వెనక్కి పంపితే మ్యాచ్‌ను సొంతం చేసుకోవడం భారత్‌కు కష్టమేమి కాదు. కాగా, రెండు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో పోరు ఉత్కంఠభరితంగా సాగడం తథ్యం.

భారత్‌కే ఛాన్స్: గంగూలీ



కోయంబత్తూరు: దక్షిణాఫ్రికాతో శనివారం జరిగే చివరి ట్వంటీ–20లో భారత్‌కే గెలుపు అవకాశాలు అధికంగా ఉన్నాయని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ బలమైన జట్టుగా ఎదిగిందనడానికి దక్షిణాఫ్రికాలో జట్టు ప్రదర్శనే నిదర్శనమన్నాడు. సఫారీ వంటి బలమైన జట్టును సొంత గడ్డపై ఏ జట్టుకైనా చాలా కష్టమని, కానీ భారత్ దాన్ని ఆచరణలో చేసి చూపిందని ప్రశంసించాడు. శుక్రవారం కోయంబత్తూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన గంగూలీ మీడియాతో మాట్లాడాడు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ట్వంటీ–20 ఫార్మాట్‌కు విపరీత ఆదరణ లభిస్తుందన్నాడు. పరిస్థితి ఎంతలా వచ్చిందంటేటి–20లులేకుండా క్రికెట్‌ను ఊహించే ప్రసక్తే లేకుండా పోయిందన్నాడు. ఐపిఎల్, బిగ్‌బాష్ తదితర టోర్నమెంట్‌లకు టి–20 ఫార్మాట్‌కు మంచి ఆదరణ లభించిందన్నాడు. క్రికెట్ ఆడే అన్ని ప్రధాన దేశాలు టి–20కు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని, అంతేగాక టి–20 లీగ్‌లు నిర్వహిస్తూ క్రికెట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తెస్తున్నాయని వివరించాడు. రానున్న రోజుల్లో ప్రపంచ క్రికెట్‌లో పొట్టి ఫార్మాట్‌దే రాజ్యమని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నాడు. టి–20 లీగ్‌ల రాకతో ఎందరో ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి వస్తున్నారని గంగూలీ పేర్కొన్నాడు. మరోవైపు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. ఆటగాడిగా, కెప్టెన్‌గా కోహ్లి నిర్వహిస్తున్న బాధ్యతలు తనను ఎంతో ఆకట్టు కున్నాయన్నాడు. అతని సారథ్యంలో భారత్ ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తుందనే నమ్మకం తనకుందన్నాడు.

సౌతాఫ్రికాకు చావోరేవో



కేప్‌టౌన్: కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకునేందుకు సౌతాఫ్రికా మహిళా క్రికెట్ జట్టు పోరుకు సిద్ధమైంది. మరోవైపు ఇప్పటికే సిరీస్‌లో 2–1 ఆధిక్యంలో ఉన్న భారత్‌కు ఓడినా నష్టమేమి లేదు. ఒకవేళ ఓడితే సిరీస్ 1–1తో సమమవుతోంది. కాగా, దక్షిణాఫ్రికా ఓడితే మాత్రం సిరీస్‌ను కోల్పోక తప్పదు. ఇప్పటికే వన్డే సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత మహిళా జట్టు తాజాగా టి–20 సిరీస్‌పై కన్నేసింది. ఇరు జట్ల మధ్య బుధవారం జరిగిన నాలుగో మ్యాచ్ వర్షం వల్ల అర్ధాంతరంగా రద్దయ్యింది. దీంతో సౌతాఫ్రికా సిరీస్ ఆశలకు బ్రేక్ పడింది. సిరీస్ గెలిచే అవకాశాలు ఎలాగో కోల్పోయిన సఫారీ మహిళా జట్టు కనీసం డ్రాతోనైనా గట్టెక్కాలని భావిస్తోంది. మూడో మ్యాచ్‌లో గెలిచి జోరుమీద కనిపించిన సౌతాఫ్రికా ఆశలపై వర్షం నీళ్లు చల్లింది. ఒకవేళ నాలుగో మ్యాచ్ జరిగి ఉంటే సౌతాఫ్రికా గెలుపు అవకాశాలు అధికంగా ఉండేవి. అయితే వర్షం వల్ల మ్యాచ్ ఒక్క ఇన్నింగ్స్ కూడా పూర్తి కాకుండానే అర్ధాంతరంగా రద్దయ్యింది. కాగా, ఈ మ్యాచ్‌ను రెండు జట్లు సవాలుగా తీసుకున్నాయి. ఇరు జట్లలోనూ ఒంటిచేత్తో మ్యాచ్ పలితాన్ని తారుమారు చేసే బ్యాటర్లు, బౌలర్లు ఉన్నారు. మిథాలీ రాజ్, స్మృతి మందన సిరీస్‌లో నిలకడైన బ్యాటింగ్‌ను కనబరుస్తున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా మెరుపులు మెరిపిస్తోంది. వేదా కృష్ణమూర్తి నిలకడైన ఆటతో జట్టుకు అండగా నిలుస్తోంది. శిఖా పాండే, పూనమ్ యాదవ్‌లు బౌలింగ్‌లో రాణిస్తున్నారు. దీంతో సిరీస్‌పై పైచేయి సాధించింది. ఈ మ్యాచ్‌లో కూడా సమష్టిగా రాణించి సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు టీమిండియా తహతహలాడుతోంది. మరోవైపు ఆతిథ్య జట్టు ఎట్టి పరిస్థితుల్లోనూ సిరీస్ చేజారకుండా చూడాలని భావిస్తోంది. కెప్టెన్ నికర్క్, లిజెల్లి లి, డుప్రిజ్, మసబాతా క్లాస్ తదితరులతో సౌతాఫ్రికా బ్యాటింగ్ బలంగా ఉంది. అంతేగాక షబ్నమ్ ఇస్మాయిల్ రూపంలో మ్యచ్ విన్నర్ బౌలర్ జట్టుకు అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో సౌతాఫ్రికా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

నేడు మహిళల చివరి పోరు



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.